శుక్రవారం
12•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 17
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
సంప్రదించండి
040 -30915112
లేదా ఏదేని శ్రీరామ్ బ్రాంచీని
www.shriramcity.in

గోదావరి జలాలు చేరడంతో కళకళలాడుతున్న అన్నారం బరాజ్

అన్నారం బరాజ్ @1.97 టీఎంసీలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ వద్ద గ్రావిటీ కెనాల్‌లోకి 3వ, 4వ, 6వ మోటర్ల నుంచి ఎత్తిపోస్తున్న గోదావరి జలాలు

- కన్నెపల్లి నీటి చేరికతో నిండుతున్న బరాజ్
- మూడు మోటర్లతో జలాల ఎత్తిపోత
- నేడు ఐదు మోటర్ల ద్వారా తరలింపు
- మేడిగడ్డ అన్నిగేట్లు మూసివేత
- 3.3 టీఎంసీల నీరు నిల్వ
- కొనసాగుతున్న ప్రాణహిత వరద
- దేవాదుల వద్ద 74.7 మీటర్ల ప్రవాహం
- తాలిపేరు గేట్లు ఎత్తివేత

పెద్దపల్లి జిల్లా మంథని గోదావరి తీరానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎదురెక్కిన ప్రాణహిత గోదావరి జలాలను పసుపు, కుంకుమ, చీర సారెతో స్వాగతిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులు.

కేసీఆర్ ఔదార్యాన్ని హర్షించాలి

ఆయనను అభినందించడం మానేసి విమర్శిస్తారా?

సీఎంల మధ్య సఖ్యత ఉంటే రాష్ట్రాలు అభివృద్ధి సాధిస్తాయి

ఏపీ అసెంబ్లీలో టీడీపీ తీరును తీవ్రంగా తప్పుబట్టిన సీఎం జగన్

గురువారం అమరావతిలో ఏపీ శాసనసభలో మాట్లాడుతున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చూపుతున్న ఔదార్యాన్ని హర్షించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌ను అభినందించడం మానేసి విమర్శించడమేమిటని మండిపడ్డారు. ఏపీ అసెంబ్లీలో గురువారం ప్రాజెక్టులపై చర్చ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టారని తెలిపారు. 'కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి ఎందుకు వెళ్లారని ప్రతిపక్ష టీడీపీ అడుగుతున్నది. పొరుగురాష్ట్రాలతో మంచిగా ఉండాలనే కాళేశ్వరం వెళ్లాను. ముఖ్యమంత్రుల మధ్య సఖ్యత ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది' అని పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారని.. అప్పుడు ఆయన ఏం చేశారు.. గాడిదలు కాశారా అని తీవ్రంగా విమర్శించారు. ఏపీ అసెంబ్లీలో సీఎం జగన్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

'ఆల్మట్టి ఎత్తు 519 మీటర్ల నుంచి 524 మీటర్లు పెరిగితే భవిష్యత్‌లో కృష్ణా బేసిన్‌కు నీటి కష్టాలు తప్పవు. కేసీఆర్ గారికి మనకున్న సత్సంబంధాలరీత్యా ఆయన మనపట్ల ఔదార్యం చూపుతున్నారంటే మనం హర్షించాల్సిన పరిస్థితుల్లో ఉండాలి. గోదావరి నీళ్లను శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు తీసుకుపోయేందుకు, కృష్ణా ఆయకట్టును స్థిరీకరించేందుకు ప్రయత్నిస్తున్నాం. వీటిని పోలవరం నుంచి తీసుకోవడం లేదు. కేసీఆర్‌గారు తన రాష్ట్రం తెలంగాణ నుంచి గోదావరి నీటిని శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు అందిస్తున్నారు. గోదావరి గురించి ప్రతిపక్షపార్టీకి ముందుగా ఒక క్లాస్ ఇవ్వాలి. గోదావరిలో నాలుగు పాయలుంటాయి. నాసిక్ నుంచి వచ్చేపాయ ఒకటి. ఇది ఎండిపోయి తెలంగాణకే నీరు రాని పరిస్థితి. రెండోది గోదావరిలో 36శాతం నీటివాటా ఉండే ప్రాణహిత. మూడోది ఇంద్రావతి. ఇది గోదావరి నీటిలో 26 శాతం ఉంటుంది. ప్రాణహిత, ఇంద్రావతి కలిసి గోదావరిలో దాదాపుగా 65% నీటిని కలిగి ఉన్నాయి. ఈ రెండుపాయలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి. కేవలం శబరి పాయ ఒక్కటే ఏపీకి ఉంది. దీనిద్వారా గోదావరికి కేవలం 11శాతం మాత్రమే వాటా. అంటే

మిగతా 9వ పేజీలో

18 నుంచి అసెంబ్లీ

రెండురోజులపాటు నిర్వహణ • 19న మండలి సమావేశం

నూతన మున్సిపల్ చట్టం ఆమోదం కోసమే ప్రత్యేక సమావేశాలు

ప్రకటించిన సీఎం కార్యాలయం • కొత్త చట్టం వచ్చాకే పుర ఎన్నికలు

ఆగస్టు మొదటివారంలో నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో నూతన మున్సిపల్ చట్టం ఆమోదం కోసం ఈ నెల 18, 19 తేదీల్లో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. 18న కొత్త మున్సిపాలిటీ చట్టం బిల్లు ప్రతులను ఎమ్మెల్యేలకు అందించనున్నారు. బిల్లుపై 19న చర్చించి ఆమోదం తెలుపనున్నారు. ఈ నెల 19వ తేదీన మండలి కూడా సమావేశం కానున్నది. అసెంబ్లీ, మండలి సమావేశాలు కేవలం మున్సిపల్ బిల్లును ఆమోదించేందుకు మాత్రమే ఉద్దేశించినవని, ప్రశ్నోత్తరాలు తదితర అసెంబ్లీ ప్రొసీడింగ్స్ ఉండవని సీఎం కార్యాలయం గురువారం ప్రకటించింది. రాష్ట్రంలో నూతన మున్సిపల్ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాతే మున్సిపల్ ఎన్నికలను నిర్వహించనున్నట్టు ప్రభుత్వం పేర్కొన్నది. ఆగస్టు మొదటివారంలో పుర ఎన్నికలు జరుపనున్నట్టు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. మున్సిపల్ బిల్లుకు తుదిరూపం ఇవ్వడానికి ముసాయిదా చట్టాన్ని ఇప్పటికే న్యాయశాఖకు పంపించినట్టు ఆయన చెప్పారు.

మూడు లేదా నాలుగోవారంలో నోటిఫికేషన్!

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే వేగవంతమైంది. మున్సిపాలిటీల్లో వార్డులవారీగా ఓటరు జాబితా ముసాయిదాను విడుదలచేశారు. పోలింగ్ కేంద్రాల జాబితా కూడా సిద్ధమైంది. బీసీ ఓటరు జాబితాను సైతం ఫైనల్ చేశారు. ఈ నెలాఖరుకే ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని

మిగతా 2వ పేజీలో

బుల్లెట్, హైస్పీడ్ రైళ్లు

దక్షిణాదికి రావా?

బడ్జెట్‌పై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ తెలంగాణకు అన్యాయం చేసిందని ట్విట్టర్‌లో ఆరోపించారు. రైల్వేల విస్తరణ, అభివృద్ధి గురించి ప్రస్తావించలేదని విమర్శించారు. 'కొత్త రైల్వే సేవలు లేవు.. కొత్త రైల్వే లైన్లు లేవు.. కొత్త లైన్లకు

మిగతా 2వ పేజీలో

రాజీనామాలపై తక్షణం నిర్ణయించాలి

కర్ణాటక స్పీకర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

మెరుపు వేగంతో పనిచేయలేనన్న రమేశ్‌కుమార్

రాజీనామాల పరిశీలనకు సమయం కావాలంటూ పిటిషన్

మళ్లీ రాజీనామా లేఖలిచ్చిన రెబల్స్

అవి నిబంధనల ప్రకారమే ఉన్నాయన్న స్పీకర్

5

బెంగళూరులో మీడియాతో మాట్లాడుతున్న కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్

ఎగువ మానేరుకు మంచిరోజులు

- కాళేశ్వరం జలాలతో పూర్వవైభవం
- మధ్యమానేరు నుంచి తరలించేందుకు ప్రణాళికలు
- కేటీఆర్‌చొరవతో శరవేగంగాఎత్తిపోతల ప్యాకేజీ పనులు
- త్వరలోనే పూడికతీత.. పరిశీలించిన కలెక్టర్లు
- పర్యాటక కేంద్రంగానూ అడుగులు

2

ఎగువ మానేరు జలాశయం

ఎగువ మానేరు జలాశయానికి మంచిరోజులు రాబోతున్నాయి. కాళేశ్వరం జలాలను మధ్యమానేరు ప్రాజెక్టు తీసుకవచ్చి, అక్కడి నుంచి ఎగువకు తరలించేందుకు చకాచకా పనులు సాగుతున్నాయి. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక చొరవతో ఇప్పటికే ముమ్మరంగా కాకా, మొదటిసారిగా ప్రాజెక్టులో పూడికతీత ప్రారంభం కాబోతున్నది. త్వరలోనే పూర్వవైభవం రానుండగా, మరోవైపు మానేరును పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇప్పటికే బోటింగ్ ఏర్పాటు చేయగా, మరిన్ని వసతులను కల్పించే దిశగా ముందుకు సాగుతున్నారు.

- గంభీరావుపేట

నమస్తే తెలంగాణ దినపత్రికకు 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
TRIPURA Landmark-III
@Bowrampet
నేటి పెట్టుబడే
రేపటి బంగారు భవిష్యత్తు కు నాంది.

East & West Facing Villas
Duplex Villas G+1
Exclusive Amenities & Features
Clubhouse | Swimming Pool | Gym | Multipurpose Hall | Landscaping
Neighbouring 500+ Villa gated community
TRIPURA CONSTRUCTIONS
విల్లా గేటెడ్ కమ్యూనిటీలో సొంత ఇంటి కలను నిజం చేసుకునేందుకు ఆకర్షణీయమైన ఆఫర్ల కోసం సంప్రదించండి:
+91 73040 25025 | +91 91004 47761
www.tripuraconstructions.com
/tripuraconstructions

లక్ష్యం దిశగా సభ్యత్వాలు

టీఆర్ఎస్ పిలుపునకు విశేష స్పందన

పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

7

పసిడి ధర పైపైకి

ఒకేరోజు రూ.930 పెరుగుదల

రూ.35,800కి చేరిన తులం

11

వారసత్వ భూమి మాయం

కాస్తులో ఉన్నా.. ఆన్‌లైన్‌లో లేదు

- 4.13 ఎకరాలను మరొకరికి పట్టాచేసిన అధికారులు
- కలెక్టర్ ఆదేశాలను లెక్కచేయని రెవెన్యూ సిబ్బంది
- మనోవేదనతో మంచంపట్టిన వృద్ధ రైతు
- ఏడాదిగా తాసిల్ చుట్టూ కొడుకు ప్రదక్షిణ
- ఆదిలాబాద్ జిల్లా కాన్పమేడిగూడలో రైతు దుస్థితి

4

పాత పాస్‌పుస్తకం చూపుతున్న ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కాన్పమేడిగూడ బాధితుడు గోపతి నర్సింగ్

తాత ముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి రికార్డుల్లో మాయమైంది. కాస్తులో ఉన్నా.. ఆన్‌లైన్‌లో కానరాక రైతుబంధు దూరమైంది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఓ వృద్ధ రైతును మంచం పట్టేలాచేసింది. సమస్యను పరిష్కరించాలని స్వయంగా కలెక్టరే ఆదేశించినా తాసిల్ కార్యాలయం అధికారులు పట్టించుకోవడంలేదని ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కాన్పమేడిగూడ గ్రామానికి చెందిన గోపతి కిష్టన్న కుమారుడు నర్సింగ్ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏడాదిగా పాత పాస్‌పుస్తకం పట్టుకొని తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా స్పందించే వారు కరువయ్యారని చెప్తున్నారు. రెవెన్యూ అధికారులు లంచాలు తిని.. తమ వారసత్వ భూమి 4.13 ఎకరాలను మరొకరికి పట్టాచేశారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. న్యాయం కోసం చివరికి బాధితుడి కుమారుడు నర్సింగ్ 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

2

లావణ్య (ఫైల్)

కేశంపేట తాసిల్దార్ లావణ్య

చంచల్‌గూడ జైలుకు

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఉదయం అరెస్టు

మధ్యాహ్నం ప్రత్యేక జడ్జి ఎదుట బైండోవర్

14 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి

జైలుకు తాసిల్దార్, వీఆర్వో అనంతయ్య

మూడ్రోజులు ఓ మోస్తరు వర్షాలు

9

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

భారీగా గంజాయి పట్టివేత

- సిద్దిపేట, జనగామలో టన్నుకుపైగా స్వాధీనం.. ఆరుగురి అరెస్టు
- గంజాయి విలువ రూ.2 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రెండుచోట్ల గురువారం పెద్దమొత్తంలో గంజాయి పట్టుబడింది. సిద్దిపేట జిల్లా దుద్దెడ క్రాస్‌రోడ్డు వద్ద, జనగామ జిల్లాకేంద్ర శివారులో అధికారులు టన్నుకుపైగా గంజాయి స్వాధీనంచేసుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. డీసీఎంలో పెద్దమొత్తంలో గంజాయిని భద్రాచలం నుంచి జహీరాబాద్‌కు తరలిస్తున్నారనే సమాచారంపై డీఆర్‌ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ సిబ్బంది బుధవారం తెల్లవారుజామున సిద్దిపేట జిల్లా దుద్దెడ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వాహనాన్ని తనిఖీచేయగా.. కొబ్బరి, జామ మొక్కల మాటున గోధుమరంగులో ఉన్న 477 గంజాయి ప్యాకెట్లను (962.7 కిలోలు) గుర్తించారు. ఇద్దరిని అరెస్టుచేశారు. గంజాయి విలువ రూ.1,92,54,000 ఉంటుంది. ములుగు జిల్లాకు చెందిన అవుడియా రవీందర్ ముఠా కారులో గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్, మహారాష్ట్రకు చేరవేస్తున్నట్టు సమాచారం అందడంతో జనగామ శివారులోని కింగ్స్‌వే దాబా వద్ద ప్రొహిబిషన్, ఎక్సైజ్ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్ బృందం, జనగామ ఎక్సైజ్ సిబ్బంది కారును సోదాచేయగా 130.3 కిలోల ఎండుగంజాయి లభించింది. అవుడియా రవీందర్‌తోపాటు అతడి ముఠాకు చెందిన వంకుడోతు రాజు, గుగులోతు హరిలాల్, బుక్య మంగులాల్‌ను అరెస్టు చేశారు. గంజాయి విలువ రూ.26 లక్షలు ఉంటుంది.



సిద్దిపేట జిల్లా దుద్దెడ క్రాస్‌రోడ్డు వద్ద వాహనంలో పట్టుబడ్డ గంజాయి ప్యాకెట్లు

గత నెల 21న ఎగువ మానేరు జలాశయంలో పూజలు చేస్తున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఎగువమానేరుకు మంచి రోజులు

కాళేశ్వరం జలాలతో పూర్వవైభవం

మధ్యమానేరు నుంచి తరలించేందుకు ప్రణాళికలు

- కేటీఆర్ చొరవతో శరవేగంగా ఎత్తిపోతల ప్యాకేజీ పనులు
- త్వరలోనే పూడికతీత..
- పరిశీలించిన కామారెడ్డి, సిరిసిల్ల కలెక్టర్లు
- పర్యాటక కేంద్రంగానూ అడుగులు

(గంభీరావుపేట)

నిజాం హయాం (1945-51)లో పూర్వఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నర్మాలలో రెండు టీఎంసీల సామర్థ్యంతో ఎగువ మానేరు జలాశయం నిర్మాణమైంది. నాటి సమైక్య పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం ఒక టీఎంసీకు చేరి, చివరి ఆయకట్టుకు నీరందించలేకపోయింది. దీంతో ఈ ప్రాంత రైతులు పంటలు సాగు చేయక, ఉపాధి కోసం ఎడారి దేశాలకు వలస బాట పట్టాల్సి వచ్చింది. కానీ, స్వరాష్ట్రంలో టీఆర్ఎస్ సర్కారు సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించింది. కాళేశ్వరం ఎత్తిపోతలతో అనుసంధానిస్తూ, తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక చొరవచూపుతున్నారు. ఎగువ మానేరును కాళేశ్వరం జలాలతో నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయించారు. ఈ మేరకు మధ్యమానేరు నుంచి 9వ ప్యాకేజీ ద్వారా ఎగువ మానేరును నింపే కాలువల నిర్మాణ పనులు చకచకా చేయిస్తున్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు..

సిద్దిపేట జిల్లాలోని కూడెల్లి వాగు, కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ వాగుల ద్వారా వచ్చే వరదనీరు మాత్రమే ఎగువ మానేరుకు జీవధార అయ్యేది. వరుసగా మూడేళ్ల నుంచి వర్షాలు సరిగ్గా లేక ప్రాజెక్టు బోసిపోయింది. కాళేశ్వరం జలాలతో ఎగువ మానేరును నిండుకుండలా మార్చి, ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సాగునీరందించడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల లైనింగ్‌తోపాటు తూములు, షట్టర్లను మరమ్మతు చేయడానికి ₹80లక్షలు అవసరమని అంచనా వేశారు. సర్కారుకు ప్రతిపాదనలు కూడా పంపారు.

త్వరలోనే పూడికతీత..

ఎగువ మానేరు ప్రాజెక్టులో మొదటిసారిగా పూడికతీత తీయబోతున్నారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి శాఖ మేనేజింగ్ డైరెక్టర్‌తోపాటు సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇటీవలే అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టులో ఇసుక ఎంతున్నది? పూడిక ఎంత ఉన్నదో తెలుసుకునే పనులు చేపట్టారు. వర్షాలు పడడంతో వాయిదా వేశారు. త్వరలోనే పూడికతీత మొదలు పెట్టనున్నారు.

ఎత్తిపోతలతో జలకళ..

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా ఎగువ మానేరుకు గోదావరి జలాలు రానున్నాయి. 9వ ప్యాకేజీలో భాగంగా మధ్యమానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి సింగసముద్రం నుంచి కాలువల ద్వారా బట్టల చెరువు రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి ఎగువ మానేరుకు జలాలు చేరుకోనున్నాయి. 21జూన్2019న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఎగువ మానేరులో ప్రత్యేక పూజలు చేశారు. పనులు చకచకా పూర్తి చేసి, ఎగువ మానేరుకు నీరు అందించాలన్న లక్ష్యంతో మల్కపేట రిజర్వాయర్‌లో సాగుతున్న అంతర్భాగ కాలువల తవ్వకాలు, నిర్మాణ పనులను పరిశీలించారు.

పర్యాటకానికి ఏర్పాట్లు..

మానేరును గొప్ప పర్యాటకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మానేరులో బోటింగ్‌కు 250 మంది సామర్థ్యం గల బల్ల కట్టు బోటును పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇద్దరు ఇద్దరు ప్రయాణించే స్పీడ్‌బోటు, ఇద్దరు పైడిల్ బోట్లను అందుబాటులో ఉంచారు. ప్రాజెక్టులోకి నీళ్లు రాగానే బోట్లను ప్రారంభించనున్నారు. మానేరు తీరంలో సందర్శకులకు అతిథి గృహాలతోపాటు చిన్నారులకు పార్కును ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు కూడా పంపారు.

కేటీఆర్ ప్రత్యేక చొరవతో ..

కేటీఆర్ చొరవతో ఎగువ మానేరు అభివృద్ధికి నోచుకుంటుంది. స్వరాష్ట్రంలో మానేరులో మరమ్మతులు పనులతోపాటు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతలతో ఎగువ మానేరు జలకళను సంతరించుకోనున్నది. మధ్యమానేరు నుంచి ఎత్తిపోతల ద్వారా ఎగువ మానేరును నింపనున్నారు.

- బుచ్చెల్లి బాలరాజుగౌడ్, సింగిల్‌విండో చైర్మన్, కొత్తపల్లి (రాజన్న సిరిసిల్ల జిల్లా)

ఎగువ మానేరుకు జీవం

కాళేశ్వరం జలాలతో ఎగువ మానేరు ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సాగునీరు అందుతుంది. వరద నీటిని వృథా చేయకుండా నిర్మిస్తున్న ప్రాజెక్టులతో రైతులకు ఎంతో మేలు. కాళేశ్వరంతో చివరి ఆయకట్టు వరకు పూర్తి స్థాయిలో నీరు అందుతుంది. 70ఏళ్ల కిందట నిర్మించిన ప్రాజెక్టులో పూడికతీస్తే 2టీఎంసీలతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంటుంది.

- పురం గోపాల్ రావు, రైతు (నర్మాల-రాజన్న సిరిసిల్ల జిల్లా)

అపర భగీరథుడు కేసీఆర్

తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో బీడు భూములకు నీళ్లు మళ్లిస్తున్న అపర భగీరథుడు ముఖ్యమంత్రి కేసీఆర్. వర్షాకాలంలో వృథాగా ప్రవహించే వరద నీటిని ప్రాజెక్టులకు ఎత్తిపోసి అక్కడి నుంచి మధ్యమానేరు ద్వారా ఎగువ మానేరుకు నీళ్లు తెప్పించడంతో మా ప్రాంత బీడు భూములు సాగు అవుతాయి. దీంతో రానున్న రోజుల్లో బంగారు పంటు పండుతాయి.

- లక్కిరెడ్డి ఎల్లారెడ్డి, రైతు (గంభీరావుపేట-రాజన్న సిరిసిల్ల జిల్లా)

అన్నారం బరాజ్ @1.97 టీఎంసీలు

కన్నెపల్లి నీటి చేరికతో నిండుతున్న బరాజ్

- మూడు మోటర్లతో జలాల ఎత్తిపోత
- నేడు ఐదు మోటర్ల ద్వారా తరలింపు
- మేడిగడ్డ అన్నిగేట్లు మూసివేత
- కొనసాగుతున్న ప్రాణహిత వరద
- దేవాదుల వద్ద 74.7మీటర్ల ప్రవాహం
- తాలిపేరు గేట్లు ఎత్తివేత

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంపుహౌస్ నుంచి మోటర్ల ద్వారా ఎత్తిపోస్తున్న గోదావరి నీటితో అన్నారం బరాజ్‌లో నీటిమట్టం పెరుగుతున్నది. కన్నెపల్లి నుంచి అన్నారం బరాజ్‌లోకి గురువారం సాయంత్రానికి 1.97 టీఎంసీల జలాలు చేరుకున్నాయి. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తున్నది. దీంతో గోదావరిలోకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఇంజినీర్లు ఒక్కో మోటర్‌ను ప్రారంభించి అన్నారం బరాజ్‌కు తరలిస్తున్నారు. పంపుహౌస్‌లో 3వ, 6వ మోటర్లు నిరంతరాయంగా నడుస్తుండగా, 4వ నంబర్ మోటర్‌ను ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నడిపి బంద్‌చేశారు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ ఆన్‌చేశారు. శుక్రవారం నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బరాజ్‌కు ఐదుపంపుల ద్వారా గోదావరి నీటిని తరలించనున్నట్టు అధికారులు తెలిపారు. కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం 9,500 వేలుగా ఉన్నదన్నారు. అన్నారం బరాజ్ నుంచి 35 కిలోమీటర్ల దూరం ఎదురెక్కిన గోదావరి జలాలు మంథని తీరానికి చేరాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గురువారం నిండుకుండలా దర్శనమిస్తున్న మేడిగడ్డ బరాజ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో తాలిపేరు గేట్ల నుంచి విడుదలవుతున్న వరదనీరు

కన్నెపల్లి నుంచి అన్నారం బరాజ్‌కు చేరిన నీటి వివరాలు (క్యూసెక్కులలో)

1వ మోటర్:	9,320
3వ మోటర్:	4,567
4వ మోటర్:	2,100
6 వ మోటర్:	6,990
మొత్తం:	22,977 క్యూసెక్కులు (1.97 టీఎంసీలు)

మేడిగడ్డ 85 గేట్లు మూసివేత

మేడిగడ్డ బరాజ్‌లో అధికారులు మొత్తం 85 గేట్లనూ మూసివేశారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తూ గోదావరిలోకి భారీగా వరద చేరుతున్నది. వరదతోపాటు, మహదేవపూర్ మండలంలో వర్షం కురియడంతో బరాజ్‌లోకి గురువారం 3.3 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

దేవాదుల వద్ద తగ్గుతున్న నీటిమట్టం

దేవాదుల వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఎగువప్రాంతాల్లో కురిసిన వర్షాలతో దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి నీటిమట్టం 75 మీటర్లకుపైగా చేరుకుని ప్రవహించిన విషయం తెలిసిందే. రెండు రోజులుగా నీటిమట్టం క్రమంగా తగ్గుతున్నది. భద్రాచలం వద్ద గురువారం ఉదయం 15.8 అడుగులుగా ఉన్న గోదావరి సాయంత్రం 6 గంటలకు 15.3 అడుగులకు చేరుకున్నది.

నేడు తాలిపేరు కాల్వలకు నీటి విడుదల

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో మధ్యతరహా సాగునీటిప్రాజెక్టు తాలిపేరుకు వరదపోటెత్తింది. డ్యాంలోకి వచ్చే ఇన్‌ఫ్లోతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు 73.60 మీటర్ల మేర నీటిని నిల్వచేస్తూ.. అదనంగా వస్తున్న నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. గురువారం ఉదయం మూడు క్రస్ట్ గేట్లను రెండు అడుగులు ఎత్తి 4,392 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

ఆల్మట్టికి పెరిగిన వరద

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆల్మట్టికి వరద ప్రవాహం పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాలతో గురువారం సాయంత్రానికి 1.10 లక్షల క్యూసెక్కులకు చేరినట్టు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆల్మట్టిలో నీటిమట్టం 64 టీఎంసీలకు పెరిగింది.

మహాద్భుత సృష్టికర్త కేసీఆర్

- 104 కిలోమీటర్ల గోదావరి తీరంలో జలసంబురం
- గోదావరికి మంత్రి కొప్పుల పూజలు

మంథని, నమస్తే తెలంగాణ: ప్రపంచ చరిత్రలోనే ఎక్కడాలేనివిధంగా రీడిజైనింగ్ పద్ధతిలో ప్రాణహిత నుంచి గోదావరి నీటిని ఎదురెక్కించే మహాద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టికర్త ముఖ్యమంత్రి కేసీఆర్ అని సంక్షేమశాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని గోదావరి తీరానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎదురెక్కిన జలాలకు పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్, సీపీ సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్‌తో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, సారె, పుష్పాలు సమర్పించి గోదావరి మాతకు హారతినిచ్చి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ గోదావరి జలాలను తెలంగాణ బీళ్లకు మళ్లించాలనే తపనతో అహోరాత్రుల శ్రమకు ప్రతిరూపమే కాళేశ్వరం ప్రాజెక్టు అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మేడిగడ్డ బ్యారేజీని పూర్తి చేసుకొని కన్నెపల్లిలో పంపింగ్ పనులు ప్రారంభం కావడంతో ప్రాజెక్టు కల సాకారమయ్యిందన్నారు. కాళేశ్వరం నుంచి ఎదురెక్కుతున్న నీళ్లతో ఎల్లంపల్లి నుంచి మేడిగడ్డ వరకు ఉన్న 104 కిలోమీటర్ల గోదావరి తీరం నిండు కుండలా మారబోతున్నదన్నారు. తెలంగాణ రావడం ఎంత నిజమో.. కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు కూడా ఎదురెక్కుతుండటం అంతే నిజం అని చెప్పారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి కొప్పుల

ముహూర్తం

సూర్యోదయం: 5.53 గంటలకు

సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, ఏకాదశి, నక్షత్రం: విశాఖ మధ్యాహ్నం 3.58 వరకు, తదుపరి అనురాధ, అమృతఘడియలు: ఉదయం 7.09 నుంచి 8.45 వరకు, రాహుకాలం: ఉదయం 10.45 నుంచి 12.22 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.28 నుంచి 9.20 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.48 నుంచి 1.40 వరకు, వర్జ్యం: రాత్రి 8.03 నుంచి 9.39 వరకు.

కేశంపేట తాసిల్దార్ లావణ్య చంచల్‌గూడ జైలుకు

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఉదయం అరెస్టు
- మధ్యాహ్నం ప్రత్యేక జడ్జి ఎదుట బైండోవర్
- 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి
- సాయంత్రం కారాగారానికి తాసిల్దార్, వీఆర్వో అనంతయ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన ఉన్న కేసులో రంగారెడ్డి జిల్లా కేశంపేట తాసిల్దార్ మునావత్ లావణ్యను ఏసీబీ అధికారులు గురువారం ఉదయం అరెస్టుచేశారు. అనంతరం ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నివాసంలో లావణ్యను హాజరుపరుచగా.. న్యాయమూర్తి ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించారు. సాయంత్రం ఆమెను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

గురువారం కేశంపేట తాసిల్దార్ లావణ్యను కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తున్న అధికారులు

రంగారెడ్డి జిల్లా కొందుర్గు వీఆర్వో అనంతయ్య బుధవారం ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంగతి తెలిసిందే. తాసిల్దార్ లావణ్య ఆదేశం మేరకే రైతు నుంచి లంచం తీసుకున్నానని అతడు చెప్పడంతో అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. హయత్‌నగర్‌లోని లావణ్య ఇంట్లోనూ సోదాలుచేయగా రూ.93 లక్షల నగదు, 40 తులాలకుపైగా బంగారం పట్టుబడింది. రాష్ట్రంలో ఒక ప్రభుత్వ అధికారి ఇంట్లో భారీ మొత్తంలో నగదు పట్టుబడటం పదేండ్లలో ఇదే ప్రథమం కావడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో ఏసీబీ లోతైన దర్యాప్తు చేపట్టింది. బుధవారం రాత్రి వరకు హయత్‌నగర్‌లోని లావణ్య నివాసంలో తనిఖీలుచేసిన ఏసీబీ అధికారులు గురువారం ఉదయం ఆమెను అరెస్టుచేశారు. నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయంలో విచారణ పూర్తయిన తర్వాత లావణ్యను దవాఖానకు తరలించి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమెను ఏసీబీ కార్యాలయానికి తీసుకొచ్చారు. తర్వాత బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నివాసంలో లావణ్యను హాజరుపరిచారు. న్యాయమూర్తి తాసిల్దార్ లావణ్యతోపాటు వీఆర్వో అనంతయ్యకు 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో నిందితులను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా, లావణ్య భర్త వెంకటేశ్‌నాయక్ పరారీలో ఉన్నట్టు తెలిసింది. అతడు జీహెచ్ఎంసీ పరిపాలనా విభాగంలో పనిచేస్తున్నారు.

18 నుంచి అసెంబ్లీ

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వానికి వివరించింది. ఈ నేపథ్యంలో కొత్త చట్టం అమల్లోకి వచ్చాక ఎన్నికలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ నెల మూడోవారం లేదా నాలుగోవారం ప్రారంభంలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రిజర్వేషన్ల ప్రక్రియ కొంత ఆలస్యం కానున్నది. కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తర్వాతే రిజర్వేషన్లు ఖరారు చేయనున్నట్టు అధికారులు చెప్పున్నారు. ప్రభుత్వం.. బీసీ రిజర్వేషన్ల జాబితాను అందించిన వెంటనే ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదలచేసే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో 129 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్న విషయం తెలిసిందే.

బుల్లెట్, హైస్పీడ్ రైళ్లు దక్షిణాదికి రావా?

మొదటిపేజీ తరువాయి...

సంబంధించి ఎలాంటి సర్వేలు లేవు.. బుల్లెట్ రైళ్లు లేవు.. హైస్పీడ్ రైళ్లు లేవు.. ప్రస్తుత రైల్వే ప్రాజెక్టులకు ఎలాంటి బడ్జెట్ పెంపు లేదు.. అన్నింటికీ 'లేదు' అనే సమాధానమే. దీంతో పాటు బడ్జెట్‌లో తెలంగాణకు సంబంధించి ఎలాంటి కేటాయింపులు లేవు. బుల్లెట్, హైస్పీడ్ రైళ్లు పొందడానికి దక్షిణ భారత్‌కు అర్హత లేదా' అని నిలదీశారు.

లోకం పోకడ

క్రికెట్ మ్యాచ్ నుంచి ఇండియా తప్పుకుంది గదా.. ఇక కర్ణాటక, గోవా వార్తలు పెట్టండి.. అక్కడ పాలిటికల్ మ్యాచ్ ఇంకా రసవత్తరంగా వుంది!

క్రాస్‌కు 100 మిలియన్ డాలర్ల ఆర్డర్

భారత సైన్యం, ఎయిర్‌ఫోర్స్‌కు బరాక్-8 మిసైల్స్, కిట్స్ సరఫరాకు ఒప్పందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇజ్రాయెల్‌కు చెందిన రక్షణరంగ పరికరాల తయారీసంస్థ రాఫెల్ అడ్వాన్స్ సిస్టమ్స్‌కు భారత్‌కు చెందిన కల్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (క్రాస్) మధ్య 100 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.684 కోట్ల) ఆర్డర్‌కు ఒప్పందం కుదిరింది. భారత ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌కు 1000 బరాక్-8 ఎంఆర్ఎస్ఏఎం మిసైల్స్, కిట్స్ సరఫరా చేసేందుకు ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. గురువారం హైదరాబాద్‌లోని పార్క్‌హయత్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాఫెల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అండ్ జనరల్ మేనేజర్, ఎయిర్ అండ్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ డివిజన్ బ్రిగేడియర్ జనరల్ (రిటైర్డ్) పినియుంగ్‌మన్.. కల్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఇండియా (క్రాస్) చైర్మన్ బాబా కల్యాణికి ఒప్పంద పత్రాలను అందించారు. కల్యాణి సంస్థ ఈ మిసైల్స్, కిట్స్‌ను మరింత మెరుగుపర్చేందుకు బీడీఎల్‌కు అందిచనున్నది. అక్కడినుంచి అవి భారత ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌కు చేరుతాయి. ఈ సంస్థ మేక్‌ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా డిఫెన్స్ పరికరాలను తయారు చేయనున్నది. 2023 నాటికి 300 మంది సాంకేతిక నిపుణులతో క్రాస్ తమ సంస్థను మరింత బలపర్చాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నది.

గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఒప్పంద పత్రాలు ప్రదర్శిస్తున్న రాఫెల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అండ్ జనరల్ మేనేజర్ పినియుంగ్‌మన్, కల్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఇండియా (క్రాస్) చైర్మన్ బాబా కల్యాణి

తెలంగాణలో రెండో యూనిట్

ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం బిగ్రేడియర్(రిటైర్డ్) పిని యుంగ్‌మన్ మాట్లాడుతూ.. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా క్రాస్‌తోపాటు ఇతర భారతీయ రక్షణరంగ పరిశ్రమలతో కలిసి పనిచేసేందుకు ఉత్సాహంగా ఉన్నామని చెప్పారు. కల్యాణి గ్రూప్ చైర్మన్ బాబా కల్యాణి మాట్లాడుతూ దేశంలో తమకున్న సామర్థ్యానికి ఈ ఆర్డర్ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సహకారం ఎంతో గొప్పగా ఉన్నదని చెప్పారు. క్రాస్ విస్తరణలో భాగంగా తెలంగాణలో రెండో యూనిట్‌ను నెలకొల్పేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తున్నామని, వందఎకరాల స్థలం కావాలని ప్రతిపాదనలు పెట్టినట్టు వివరించారు. భవిష్యత్తులో సొంతంగా తమ సంస్థ ద్వారానే రక్షణరంగ పరికరాలు తయారుచేసే ప్రణాళికలు ఉన్నట్టు పేర్కొన్నారు.

కాళేశ్వరానికి పైసా ఇవ్వలేదు

- నిధుల కేటాయింపులో కేంద్రానిది మొండివైఖరి
- ఇదేనా సహకార సమాఖ్య?
- అంకెల్లోనే దేశం అభివృద్ధిని చూపారు
- బడ్జెట్‌పై రాజ్యసభలో టీఆర్ఎస్ పక్షనేత కే కేశవరావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయకు నిధుల కేటాయింపులో కేంద్రం మొండివైఖరి అవలంబిస్తున్నదని రాజ్యసభలో టీఆర్ఎస్ పక్షనేత కే కేశవరావు ఆరోపించారు. నీతి ఆయోగ్ పదిసార్లు నిధులు విడుదల చేయాలని సిఫారసు చేసినా కేంద్రం పట్టించుకోలేదన్నారు. స్వయంగా ప్రధాని అద్భుతమైన ప్రాజెక్టులని ప్రశంసించినప్పటికీ.. ఏ విధంగా కూడా ఆర్థిక మద్దతు లభించలేదని విచారం వ్యక్తంచేశారు. బడ్జెట్‌పై రాజ్యసభలో గురువారం కే కేశవరావు మాట్లాడారు. 'వ్యవసాయ ప్రధానమైన దేశంలో నీటి ప్రాజెక్టులు కడుతున్నామంటే ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఇదేనా సహకార సమాఖ్య. కేంద్రం నుంచి సహకారం లభించనప్పటికీ తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేస్తున్నది. మిషన్ కాకతీయ ద్వారా వందలాది చెరువులకు మరమ్మతులు చేశాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడానికి కేంద్రం వెనుకాడుతున్నది. జలశక్తి ద్వారా ఇంటింటికి తాగునీటిని ఎలా అందిస్తారో కేంద్రం సమాధానం చెప్పాలి' అని కేశవరావు డిమాండ్ చేశారు. ప్రాజెక్టులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా కేంద్రం తెలంగాణ ప్రజలను అవమానించిందని చెప్పారు. తెలంగాణలో రైతుల నుంచి ఒక్క రూపాయి తీసుకోకుండా రైతు బంధు, రైతు బీమా అందిస్తున్నట్టు తెలిపారు. ఒడిశా కూడా తెలంగాణ దారిలో నడుస్తున్నదని పేర్కొన్నారు. 'జలశక్తి ద్వారా దేశంలో ప్రతి ఇంటికి నీళ్లు ఇస్తామంటూ చెప్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ముందుగానే ఈ పని చేసింది. జలశక్తి పథకానికి ఎంత కేటాయింపులు జరిపిందో చెప్పడంలేదు. కనీసం ఎలా సాధ్యం చేస్తారో అనే స్పష్టతనైనా ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం వెయ్యి కోట్లు ఇస్తామని మాట ఇచ్చి తప్పారని చెప్పారు. బడ్జెట్‌లో కొత్త విషయాలేమీ లేవని, పాత పథకాల కొనసాగింపే ఉన్నదన్నారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పెంచి సామాన్యులకు షాక్ ఇచ్చారని, భారత అభివృద్ధి అనేది బడ్జెట్‌లో పేర్కొన్నట్టు అంకెల్లోనే కనిపిస్తుందని ఎద్దేవాచేశారు. పూర్తి మెజార్టీతో గెలిచిన మోదీ ప్రభుత్వం నుంచి ప్రజలు చాలా ఆశిస్తున్నారని, అయితే అంచనాలకు తగినట్లుగా బడ్జెట్ లేదని విచారం వ్యక్తంచేశారు.

బేగంపేటలో పౌరవిమానయాన పరిశోధన సంస్థ సముదాయం!

- రూ.332.82 కోట్లతో నిర్మాణానికి ఎయిర్‌పోర్ట్ అథారిటీ టెండరు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పౌరవిమానయాన పరిశోధన సంస్థ సముదాయాన్ని హైదరాబాద్‌లో నిర్మించేందుకు రంగం సిద్ధమయ్యింది. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రకటనను ఎయిర్‌పోర్ట్ అథారిటీ జారీచేసినట్టు సమాచారం. బేగంపేట ఎయిర్‌పోర్టులో ఈ పరిశోధన సంస్థ సముదాయాన్ని రూ.332.82 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు టెండరు జారీచేసినట్టు తెలిసింది.

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని చింతల మాదార అటవీ ప్రాంతంలో ఉన్న జలపాతం ఆకట్టుకుంటున్నది. దట్టమైన అడవిలో ఎత్తయిన కొండలపై నుంచి జాలువారే ఈ జలపాతం వీక్షకులకు కనువిందు చేస్తున్నది. ఈ జలపాతాన్ని చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. తిర్యాణి మండల కేంద్రం నుంచి 25 కిలో మీటర్ల దూరంలో చింతలమాదార ఉంటుంది. అక్కడి నుంచి 3 కిలో మీటర్లు కాలినడకన ప్రయాణిస్తే ఈ జలపాతానికి చేరుకుంటారు.

– తిర్యాణి

పంజాబ్ నేషనల్ బ్యాంకు ...దేశానికి మరో పేరు! punjab national bank ...the name you can BANK upon!
(భారత ప్రభుత్వరంగ సంస్థ)
జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, సర్కిల్ ఆఫీసు: తెలంగాణ
6-1-73, 2వ అంతస్తు, సీనియర్ ప్లాజా, లక్డీ-కా-పూల్, హైదరాబాద్-500 004.
పంజాబ్ నేషనల్ బ్యాంకు, తెలంగాణ సర్కిల్ కార్యాలయం కొరకు వివిధ విభాగాలు మరియు కేటగిరీల్లో కాంట్రాక్టర్ల ప్రీ-క్వాలిఫికేషన్ కోసం ప్రకటన
పంజాబ్ నేషనల్ బ్యాంకు, తెలంగాణ సర్కిల్ కార్యాలయంలో నమోదు కోసం దిగువ పేర్కొన్న వివిధ విభాగాలు మరియు కేటగిరీల్లో పేరుగాంచిన మరియు అనుభవం కలిగిన కాంట్రాక్టర్లు/సంస్థల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది:
- సివిల్ పనులు, మరమ్మతులు మరియు నిర్వహణ పనులు (రూ. 1 లక్ష వరకు, రూ. 1 నుండి 5 లక్షల వరకు)
- ఇంటీరియర్ మరియు ఫర్నిషింగ్ పనులు (రూ. 1 లక్ష వరకు, రూ. 1 నుండి 5 లక్షల వరకు, రూ. 5 నుండి 10 లక్షల వరకు, రూ. 10 నుండి 15 లక్షల వరకు)
- విద్యుత్ పనులు (రూ. 1 లక్ష వరకు, రూ. 1 నుండి 5 లక్షల వరకు)
- ఎయిర్ కండీషనింగ్ పనులు (రూ. 1 లక్ష వరకు, రూ. 1 నుండి 5 లక్షల వరకు, రూ. 5 నుండి 10 లక్షల వరకు)
- సైన్ బోర్డ్ (రూ. 1 లక్ష వరకు, రూ. 1 నుండి 5 లక్షల వరకు)

దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేది 31-07-2019, మధ్యాహ్నం 3.00 గంటల వరకు. పూర్తి వివరాల కోసం మరియు, దరఖాస్తుల డౌన్‌లోడ్ చేసుకోవడానికి మా వెబ్‌సైట్ https://www.pnbindia.in ను సందర్శించండి. ఈ ప్రకటనకు సంబంధించిన సవరణలు/వివరణలు ఏవైనా ఉన్నచో, అన్నవుడూ దర్శించగలిగే మా బ్యాంకు వెబ్‌సైట్‌లో పొందుపరచబడతాయి.
డిప్యూటీ సర్కిల్ హెడ్

కేంద్ర రైల్వే మంత్రి పీయూష్‌గోయల్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కూడా ఉన్నారు.

కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన ఎంపీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర రైల్వే మంత్రి పీయూష్‌గోయల్‌ను టీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కలిశారు. పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ యార్డు విస్తరణ నిమిత్తం.. రామచంద్రాపురం నుంచి పటాన్‌చెరు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం రైల్వే శాఖ భూములను అప్పగించాలని కోరారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కూడా భేటీ అయ్యారు. ప్రజలతో ఉండి అభివృద్ధికి బాటలువేయాలని ఉపరాష్ట్రపతి సూచించారని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

రైల్వే విషయంలో తెలంగాణపై కేంద్రం వివక్ష

- మహబూబ్‌నగర్ టీఆర్ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైల్వే విషయంలో తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిస్తున్నదని టీఆర్ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఆరోపించారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. విభజన చట్టంలోని కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటును కేంద్రం పట్టించుకోవటం లేదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం భూమి కేటాయించినప్పటికీ ముందుకు రావటం లేదని చెప్పారు. నిదులు విడుదల చేసి తెలంగాణలోని అన్ని పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలని కేంద్రాన్ని ఆయన కోరారు.

గద్వాల-మాచర్ల రైల్వేలైన్ పూర్తిచేయాలి

- బడ్జెట్‌పై చర్చలో టీఆర్ఎస్ ఎంపీ పోతుగంటి రాములు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గద్వాల–మాచర్ల రైల్వేలైన్ వెంటనే పూర్తిచేయాలని, రెండు రాష్ట్రాల ప్రజల మూడుదశాబ్దాల కలను సాకారంచేయాలని నాగర్‌కర్నూల్ టీఆర్ఎస్ ఎంపీ పోతుగంటి రాములు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బడ్జెట్‌పై జరుగుతున్న చర్చలో గురువారం ఆయన మాట్లాడుతూ.. గద్వాల–మాచర్ల సర్వే పూర్తిచేసి పదేండ్లు గడిచినా మోక్షం లభించలేదని, పూర్తిచేస్తామని మహబూబ్‌నగర్ బహిరంగసభలో అమిత్‌షా ప్రజలకు హామీ ఇచ్చారని, అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. భద్రాచలం, సత్తుపల్లి, కొవ్వూరు రైల్వేలైన్లను కూడా వేగంగా పూర్తిచేయాలన్నారు.

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

వారసత్వ భూమి మాయం

- కాస్తులో ఉన్నా.. ఆన్‌లైన్‌లో లేదు
- 4.13 ఎకరాలను మరొకరికి పట్టాచేసిన అధికారులు
- కలెక్టర్ ఆదేశాలనూ లెక్కచేయని రెవెన్యూ సిబ్బంది
- మనోవేదనతో మంచంపట్టిన వృద్ధ రైతు
- ఏడాదిగా తాసిల్ చుట్టూ కొడుకు ప్రదక్షిణ
- ఆదిలాబాద్ జిల్లా కాన్పమేడిగూడలో రైతు దుస్థితి

కాళ్లు మొక్కినా కనికరం లేదు

వారసత్వంగా వచ్చిన 4.13 ఎకరాల భూమి మా నాయిన కిష్టన్న పేరిట ఉన్నది. ఈ భూమి ఆన్‌లైన్‌లో కాన రావడం లేదని రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. అప్ప టినుంచి మా నాయిన మానసిక క్షోభకుగురై మంచం పట్టారు. నేను ఏడాదిగా తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. మేము సాగు చేసుకొంటున్న మా భూమి ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం విచిత్రం. ఎన్నో సార్లు అధికారుల కాళ్లు మొక్కిన. కొత్త పాస్ పుస్తకం వచ్చినంక పైసలు కూడా ఇస్తా మన్న. అయినా అధికారులు కనికరిస్తలేరు. గతంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేసిన. సమస్యను పరిష్కరించాలని ఆయన ఆదేశించినా అధికా రులు పట్టించుకొంటలేరు. రెవెన్యూ అధికారులే లంచాలు తిని మా భూమిని మరొకరి పేరిట మార్చారు. మాకు తీరని అన్యాయంచేశారు.

- గోపతి నర్సింగ్, కాన్పమేడిగూడ, జైనథ్ మండలం, ఆదిలాబాద్ జిల్లా

ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ జిల్లా, జైనథ్ మండలం, కాన్పమేడిగూడ గ్రామానికి చెందిన గోపతి కిష్టన్న వయసు 80 ఏండ్లు. ప్రస్తుతం నడువలేని స్థితిలో ఉన్నారు. ఈయనకు ఒక్కగానొక్క కొడుకు నర్సిం గ్ ఉన్నారు. కిష్టన్నకు గ్రామంలోని సర్వే నంబర్ 19లో వారసత్వంగా వచ్చిన 4.13 ఎకరాల భూమి ఉన్నది. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో కిష్టన్నకు కొత్త పాస్ పుస్తకం అందలేదు. ఈ విషయమై రెవెన్యూ అధికారు లను ఆశ్రయించగా, కార్యాలయంలో ఫిర్యాదుచేయాలని గ్రామసభలో సూచించారు. గోపతి కిష్టన్న కొడుకు నర్సింగ్ తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదుచేశారు. ఆన్‌లైన్‌లో పరిశీలించిన రెవెన్యూ అధికారులు.. సర్వే నంబర్ 19లో 4.13 ఎకరాల భూమి కిష్టన్న పేరిట లేదని చెప్పారు. దీంతో బాధిత రైతు అవాక్కయ్యారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో తమ సమస్యను వివరిస్తూ దరఖాస్తుచేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యను పరిశీలించాలని ఆర్డీవోను ఆదేశించారు. ఆర్డీవో.. తాసి ల్దార్‌కు ఆదేశాలు జారీచేశారు. అయినప్పటికీ తాసిల్దార్ తనకేమీ తెలియదంటూ చేతులెత్తేశారు. కిందిస్థాయి అధి కారులు నర్సింగ్‌ను ఏడాదిగా రేపు మాపు అంటూ తాసి ల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పించుకొంటున్నారు. తమ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అధికారులే చేతి వాటం ప్రదర్శించి 4.13 ఎకరాలను మరొకరి పేరిట మార్చారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రాజాపేట తాసిల్దార్ పద్మావతిని కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న రైతులు

రాజాపేటలో రైతుల నిరసన

- కార్యాలయంలోకి తాసిల్దార్ వెళ్లకుండా అడ్డగింత
- భూసమస్య పరిష్కరించాలని ఐదుగంటలపాటు ఆందోళన
- పురుగులమందు తాగేందుకు యత్నించిన బాధితులు
- వారంరోజుల్లో పరిష్కరిస్తామని తాసిల్దార్ పద్మావతి హామీ

రాజాపేట: ఏండ్ల కింద కొన్న భూమిని సాగు చేసుకొంటూ పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందారు.. అయితే అమ్మివారే భూమి తమ దే అంటూ కబ్జాపైకి వచ్చే ప్రయత్నం చేస్తున్నా రు.. తమ వద్ద కూడా పాస్‌పుస్తకాలు ఉన్నా యని బెదిరింపులకు పాల్పడుతున్నారు. కొత్త పాస్‌పుస్తకాల కోసం తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోక పోవడం తో ఆగ్రహించిన కాస్తులో ఉన్న రైతులు.. గురువారం కుటుంబంతో కలిసి ఐదు గంట లపాటు తాసిల్ కార్యాలయం ఎదుట బైఠా యించారు. అనంతరం ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేటలో జరిగింది. మండలంలోని నెమి లకు చెందిన మంత్రి స్వామి.. ఆదే గ్రామానికి చెందిన బింగి కైలాసం పద్ద సర్వే నంబర్ 223లో 1.28 ఎకరాల భూమిని 1997 సంవత్సరంలో కొన్నారు. ఆ భూమిని స్వామి కుమారులు కిష్టయ్య, సిద్దులు, మల్లేశం సమానంగా పం చుకొన్నారు. ఒక్కొక్కరికీ 22 గుంటల భూమి రాగా సాగుచేసుకొంటూ జీవిస్తున్నారు. 2008 అమైన్‌మెంట్ ద్వారా పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా వచ్చాయి. పొజీషన్ సర్టిఫికెట్ కోసం మూడేండ్లుగా తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. కొద్ది రోజులుగా తమకు భూమి అమ్మిన బింగి కైలాసం కుమారుడు వైకుంఠం స్థలం తమదే నని, పాస్‌పుస్తకాలు తమ పేరిట ఉన్నాయని, కొన్న రైతులను వెంటనే కబ్జా నుంచి తప్పు కోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు. అధికారులు కావాలనే భూమి అమ్మిన వ్యక్తికే పాస్‌పుస్తకాలు అందజేసి అక్రమాలకు పాల్ప డుతున్నారని బాధిత రైతులు ఆరోపించారు. కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం తిరిగి తిరిగి విసిగి వేసారిన ఆ మూడు కుటుంబాల సభ్యులు ఆగ్రహించి తాసిల్ కార్యాలయం ఎదుట ఐదుగంటలపాటు బైఠాయించారు. భూసమస్య పరిష్కరించే వరకు తాసిల్దార్ పద్మావతిని కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకొన్నారు. అధికారులు పొంతనలేని సమాధానం చెప్పడంతో అసహనానికి గురైన రైతులు కిరోసిన్ ఒంటిమీద పోసుకొని, పురు గులమందు తాగేందుకు యత్నించగా అక్క డున్న మిగతా రైతులు అడ్డుకొన్నారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తాసిల్దార్ పద్మావతి హామీ ఇవ్వ డంతో బాధితులు శాంతించారు.

మా మాట!

పేదలకు మంచిచేస్తున్న సీఎం కేసీఆర్

రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖల్లో అధికారుల అవినీతిని అరికట్టడానికి సీఎం కేసీఆర్ సార్ చేస్తున్న కృషి అభినంద నీయం. రెవెన్యూలో మార్పులు జరిగితే పేదలందరికీ మంచి జరుగుతుంది. రెవెన్యూశాఖలో భూసమస్యలు చాలా ఉన్నాయి. వాటి పరిష్కారం కోసం కార్యాలయానికి ఎప్పు డుపోయినా అధికారులు రేపు మాపు అంటూ పనులు ముందుకు సాగనివ్వడం లేదు. సమస్యలను పరిష్కారించేం దుకు సీఎం కేసీఆర్ నడుం బిగించడం శుభ పరిణామం.

- కాటిపెల్లి రఘుపతిరెడ్డి, మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా

పేద రైతులకు న్యాయం

చాలా గ్రామాల్లో భూసమస్యలు ఏండ్ల తరబడి పేరుకుపోయి ఉన్నాయి. ప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనతో అధి కారులు చాలా వరకు సమస్యలు పరిష్కరించారు. ఇంకా చాలా గ్రామాల్లో భూసమస్యలతో బాధపడే రైతులకు ధర్మ గంట మంచి అవకాశంగా మారింది. 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమవుతున్న కథనాలపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరిం చడం హర్షణీయం.

- మామిడి చిన్నారెడ్డి, రైతు, మల్లాపూర్, జగిత్యాల జిల్లా

వీఆర్వో కక్కుర్తి.. రైల్వే ఉద్యోగికి శాపం!

- సాదాబైనామా ద్వారా దొంగపట్టాలు చేసిన రెడ్డిపల్లి వీఆర్వో
- ఫిర్యాదుచేసినా పట్టించుకోని వీణవంక రెవెన్యూ అధికారులు
- న్యాయంచేయాలని 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితుడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెవెన్యూ సిబ్బంది కాసులకు కక్కుర్తిపడితే.. తిమ్మిని బమ్మిని చేసేస్తారు. అలాంటి ఒక అవినీతి రెవెన్యూ ఉద్యోగి లంచం తీసుకొని రైల్వే మాజీ ఉద్యోగి జీవితాన్ని కష్టాలపాలుచేశాడు. పిల్లల భవిష్యత్‌కు భరోసా ఉంటుందన్న ఉద్దే శంతో విడుతలవారీగా డబ్బు చెల్లించి కొన్న భూమిని.. కాసులకు కక్కుర్తిపడిన వీఆర్వో సాదాబైనామా ద్వారా ఇతరులకు దొంగ పట్టాచేశారు. విషయాన్ని ఆలస్యంగా తెలు సుకొన్న బాధితుడు తాసిల్దార్ కార్యాలయం లో ఫిర్యాదుచేసినా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం రెడ్డిపల్లికి చెందిన ఒడ్డేపల్లి రాజ య్య దీనగాథ ఆయన మాటల్లోనే.. 'నా పేరు ఒడ్డేపల్లి రాజయ్య. రైల్వే ఉద్యోగం చేస్తూ 1985లో కరీంనగర్ జిల్లా వీణవంక మం డలం రెడ్డిపల్లి పరిధిలోని సర్వే నంబర్ 195 లో మూడెకరాల భూమిని కురిమిల్ల శంక రయ్య, గుంటి స్వామి వద్ద రూ.29,712 చెల్లించి కొన్నాను. ఉద్యోగరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో ఉండటం, రెడ్డిపల్లికి రాలేకపో వడం వంటి కారణాలను అలుసుగా తీసు కొని కొందరు నా భూమిపై కన్నేశారు. దాసా రపు రమ్య అనే మహిళ సాదాబైనామా ద్వారా ఎకరం భూమిని పట్టా చేయించు కోగా.. మరో రెండెకరాలను ఒడ్డేపల్లి ఓదెలు దొంగ పట్టా చేయించుకొన్నారు. ప్రస్తుతం జిల్లా మెజిస్ట్రేట్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నది. అదేవిధంగా 1986లో మాడ మల్లా రెడ్డి వద్ద సర్వే నంబర్ 191లో 28 గుంట లు, 1987లో మాడ వెంకటరాజిరెడ్డి వద్ద రెండెకరాలు, మాడ సంజీవరెడ్డి వద్ద 32 గుంటల భూమిని కొన్నాను. రెవెన్యూ అధి కారులు 191సీ అనే కొత్త సర్వే నంబర్ సృష్టించి ఫోర్జరీ సంతకాలతో ఒడ్డేపల్లి లక్ష్మి అనే మహిళ పేరిట రెండెకరాలను సాదాబై నామా పట్టా చేశారు. ఒడ్డేపల్లి భారతమ్మ అనే మహిళ మరో 2.20 ఎకరాలను పట్టా చేయించుకొన్నారు. దీనిపై జాయింట్ కలెక్ట ర్‌కు ఫిర్యాదుచేయగా ప్రస్తుతం ఆయన వద్ద పెండింగ్‌లో ఉన్నది. ఒడ్డేపల్లి సంపత్‌కుమార్ అనే రౌడీషీటర్.. నన్ను, నా కుమారుడు గోపీనాథ్‌ను విపరీతంగా కొట్టి నా పేరిట ఉన్న 192 సర్వే నంబర్‌తోపాటు 192ఏ, 193, 194 భూములను దున్నకుండా అడ్డు కొంటున్నారు. రెడ్డిపల్లి వీఆర్వో శంకరయ్య పలువురి నుంచి లంచం తీసుకొని దొంగ పట్టాలుచేశారు. నా భూములకు సంబం ధించి విచారణ జరిపి దొంగ పట్టాలను రద్దు చేసి నాకు న్యాయంచేయాలి. సర్వే నంబర్ 193లోని 4.18 ఎకరాల భూమిని నా కుమారిడి పేరిట పట్టా మార్పిడి చేయడానికి తాసిల్దార్, ఆర్డీవోకు దరఖాస్తు చేసుకొ న్నాను. ఆరునెలలైనా పట్టా మార్పిడి చేయ డంలేదు. రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకొని నాకు న్యాయంచే యాలని కోరుతున్నాను.'

నా భూమి మరొకరికి పట్టా!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నా పేరు గుర్రప్పగారి సత్యనారాయణ. తండ్రి పేరు రాజయ్య. మాది సిద్దిపేట జిల్లా మిర్‌దొడ్డి మండలం అల్వాల గ్రామం. అదే గ్రామంలోని సర్వే నంబర్లు 459/అ, 459/ఆ3, 459/ఇ, 461/అ, 461/ఆ, 461/ఇ లో 24 గుంటల భూమిని గుర్రప్పగారి రాములు, గుర్రప్పగారి కమ లమ్మ నుంచి 2017లో కొనుగోలుచేశాను. నేను రిజిస్ట్రేషన్ చేయించుకొన్న తర్వాత.. పాస్‌బుక్‌ను నా పేరిట మంజూరుచేసేందుకు ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలియజేయా లని 2017 డిసెంబర్‌లో రెవెన్యూ అధికా రులు నోటీసులు జారీచేశారు. అల్వాల నుం చి ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో నా పేరిట పట్టా మంజూరుచేయాలని ఆర్డర్ కాపీని కూడా ఇచ్చారు. కానీ, భూరికార్డుల ప్రక్షాళన తర్వాత.. నా పేరిట కాకుండా గడీల సత్యనారాయణ పేరిట కొత్త పాస్‌బుక్‌ను జారీచేసిన రెవెన్యూ అధికారులు.. పహాణీ లోనూ ఆయన పేరే నమోదుచేశారు. రైతు బంధు సాయం కూడా ఆయనకే ఇస్తున్నారు. దీనిపై అప్పటి వీఆర్వోకు ఎన్నిసార్లు మొరపె ట్టుకొన్నా, ఆధారాలన్నీ చూపించినా రేపు.. మాపు అంటూ కాలయాపన చేశారు. తాసిల్దా ర్‌కు దరఖాస్తుచేసినా పట్టించుకోలేదు. ఈలో గా అప్పటి అధికారులు బదిలీ అయ్యారు. కొత్తగా వచ్చిన అధికారులకు నా సమస్యను వివరిస్తే మాకు తెలువదంటున్నారు. గడీల సత్యనారాయణకు మంజూరుచేసిన పాస్‌బు క్‌లో సర్వే నంబర్లు 459/అ, 461/అ లో గల భూమి ఆయనకు అనువంశికమని నమో దుచేశారు. వాస్తవానికి ఆ భూమి కొత్త పాస్ బుక్‌లు మంజూరుచేయకముందు గుర్రప్ప గారి రాములు, గుర్రప్పగారి కమలమ్మ పేరిట ఉన్నది. ఈ భూమిని గడీల సత్యనారాయ ణకు అనువంశికమని రెవెన్యూ అధికారులు ఎలా నమోదుచేస్తారు. నేను కొనుగోలుచేసిన భూమిని వేరే వ్యక్తి పేరిట పాస్‌పుస్తకం మం జూరు చేయడం అన్యాయం. అధికారులు చేసిన తప్పిదం వల్ల నేను రెండు విడుతల రైతుబంధు సాయం నష్టపోయాను. ఇప్పటి కైనా ఉన్నతాధికారులు విచారించి నా భూమి కి పాస్‌పుస్తకం ఇప్పించాలి.

గుర్రప్పగారి సత్యనారాయణకు అధికారులు ఇచ్చిన ప్రొసీడింగ్ ఆర్డర్

ఆధారాలుంటే పట్టాచేస్తాం

ఈ సమస్య గత అధికారుల తప్పిదం వల్ల తలెత్తింది. ఇద్దరి పేర్లతోపాటు వారి తండ్రుల పేర్లు కూడా ఒకటే కావడంతో అధికారులు పొరబడి ఉంటారు. గుర్ర ప్పగారి సత్యనారాయణ వద్ద భూమి తనదేనని ఆధారాలుంటే పరిశీలించి పాస్‌పుస్తకం మంజూరుచేస్తాం.

- పద్మారావు, మిర్‌దొడ్డి తాసిల్దార్

పట్టాలిచ్చి.. పాస్‌బుక్‌లు మరిచారు!

- 'కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స' లబ్ధిదారుల మొర
- నాలుగు దశాబ్దాలుగా కాస్తులో ఉన్నా పట్టించుకోని అధికారులు
- ఇప్పటికైనా రికార్డుల్లో నమోదుచేసి పాస్‌పుస్తకాలు ఇవ్వాలి
- ధర్మగంటను ఆశ్రయించిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను చూపుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పోతెపల్లి రైతులు

వెల్దండ: ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు స్పందించి, బతుకుదెరువు కోసం కుటుంబ నియంత్రణ శస్త్రచికి త్సలు చేయించుకొన్న లబ్ధిదారులకు భూమిలిచ్చారు. ఆ మేరకు పట్టాలు కూడా పంపిణీచేశారు. 1976 నుంచి ఆ భూముల్లో సాగుచేస్తున్న రైతులపై అధికా రులు కనీస కనికరం చూపడం లేదు. నాలుగు దశాబ్దా లకుపైగా పాస్‌పుస్తకాలకోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన భూమి పట్టాలకు విలువ లేకుండాపోయిందని లబ్ధిదారులు వాపోతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పోతెపల్లి గ్రామానికి చెందిన 10 మంది నిరుపేదలకు 1976లో అప్పటి ప్రభుత్వం 21.32 ఎకరాల భూమిని సాగు చేసుకొని జీవనం గడి పేందకు సీలింగ్ పట్టాలను అందజేసింది. పట్టాలు ఇచ్చేందుకు పురుషులు కుటుంబ నియంత్రణ శస్త్రచికి త్సలు చేయించుకోవాలని నిబంధన పెట్టింది. దీంతో గ్రామానికి చెందిన 10 మంది రైతులు శాంతయ్య, బాలయ్య, గెల్వయ్య, చిన్నయ్య, మల్లయ్య, లక్ష్మయ్య, చిన్నమైసయ్య, జంగయ్య, పాండ్యానాయక్, బాల య్యలు తమకు బతుకుదెరువు దొరుకుతుందని కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించుకొని భూమి పట్టాలు పొందారు. పోతెపల్లి శివారులోని సర్వే నంబర్లు 176, 177, 178 లో 21.32 ఎకరాల భూమిని గ్రామంలోని పది మంది దళితులు సాగు చేసుకొంటున్నారు. దాదాపు 43 ఏండ్లుగా భూమి సాగుచేసుకొంటున్న రైతులు భూమి శిస్తును సైతం కడ తున్నా.. రికార్డుల్లో మాత్రం ఎలాంటి ఆధారాలు లేవు. పట్టాలు ఇచ్చిన అధికారులు వాటి పాస్‌పుస్తకాలు ఇవ్వ కుండా నేటికీ కాలయాపన చేస్తూనే ఉన్నారు. కార్యా లయం చుట్టూ ఎండ్ల తరబడి తిరుగుతున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని లబ్ధిదారుల వారసులు వాపోయారు. చివరికి కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిం దని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యను పరిష్కరించా లని 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

ఇప్పటికీ కాస్తులోనే ఉన్నం

1976 నుంచి ఇప్పటికీ మా నాయినకు ఇచ్చిన భూమిలోనే సాగు చేసు కుంట జీవిస్తున్నం. పట్టా లు ఇచ్చింద్రు కానీ.. పాస్ పుస్తకాలు ఇవ్వడం లేదు. మాకు ఆ భూమే జీవనాధా రం. అధికారులు చొరవచూపి పాస్‌పుస్త కాలు జారీచేయాలి.

- శ్రీరాములు, పోతెపల్లి

ఏండ్లుగా తిప్పించుకొంటున్నరు

రెవెన్యూ అధికారులు ఏం డ్లుగా పాస్‌పుస్తకాలు ఇవ్వ కుండా తిప్పించుకొంటు న్నరు. మా సమస్యను పట్టించుకుంటలేరు. పిల్లల జీవితాలు బాగుపడాలని మా పెద్దలు శస్త్రచికిత్సలు చేయించుకొని, పట్టాలు పొందిండ్రు. 40 ఏండ్లకుపైగా భూములను సాగుచే స్తున్నం. ప్రభుత్వం ఇచ్చిన భూమిపైనే ఆధార పడి మేమంతా జీవిస్తున్నం.

- కొమ్ము వెంకటయ్య, పోతెపల్లి

అధికారులు కరుణించాలి

మా పెద్దలు భూమి వస్తుం దని కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించుకు న్నరు. నాటి నుంచి నేటి వరకు సాగు చేసుకొని మా కుటుంబాలు జీవనం సాగి స్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు కరుణిం చాలి. స్పందించి మాకు పాస్‌పుస్తకాలిచ్చి న్యాయంచేయాలి

- కృష్ణయ్య, పోతెపల్లి

భూమి తగ్గించారు

- రికార్డులు సవరించండంటే.. రైతుబంధు ఆపేశారు
- ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకొన్నా పట్టించుకోవడం లేదు
- నల్లగొండ జిల్లా మహిళా రైతు ఆవేదన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపా కల గ్రామానికి చెందిన పోట్లోల స్వరూపరా ణికి అదే గ్రామంలో సర్వే నంబర్లు 32/ఆ, 32/ఆ 2, 32/ఆ 3, 27/ఈ, 27/ఈ 1, 275/అ లో మొత్తం ఐదెకరాల భూమి ఉన్నది. ఈ భూమిని స్వరూపరాణి 2003 లోనే కొన్నారు. పాస్‌బుక్ కూడా తీసుకొన్నా రు. పహాణీలోనూ స్వరూపరాణి పేరు నమో దైంది. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో సర్వేచేసిన అధికారులు స్వరూపరాణికి ఉన్న ఐదెకరాల భూమిలో 3.21 ఎకరాలకు మాత్ర మే కొత్త పాస్‌పుస్తకం మంజూరుచేశారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు పలుమా ర్లు దరఖాస్తుచేసినా పట్టించుకోలేదు. మొత్తం ఐదెకరాల భూమిపై తామే మోఖాలో ఉన్నా మని బాధితురాలు తెలిపారు. మిగిలిన 1.19 ఎకరాలు పాస్‌పుస్తకంలో నమోదుచేయక పోగా, రికార్డుల్లో నమోదైన 3.21 ఎకరాలకూ రైతుబంధు ఇవ్వకుండా తిప్పలు పెడుతున్నా రని వాపోయారు. 'పాత పాస్‌పుస్తకం ఇచ్చిం ది రెవెన్యూ అధికారులే. కొత్త పాస్‌పుస్తకం ఇచ్చిందీ వారే. మరి నా 1.19 ఎకరాల భూమి ఏమైనట్టు.. తగ్గిన భూమిని రికార్డుల్లో కి ఎక్కించాల్సింది పోయి.. ఉన్నదానికి రైతు బంధు ఆపడం అన్యాయం' అని స్వరూప రాణి ఆవేదన వ్యక్తంచేశారు.

మా దృష్టికి రాలేదు

స్వరూపరాణి సమస్య మా దృష్టికి రాలేదు. ఇప్పటివరకైతే మాకు దరఖాస్తు అందలేదు. సమస్యను మాకు తెలియ జేస్తే రికార్డులు పరిశీలిస్తాం. వారికి ఎందుకు భూమి తక్కువగా నమోదైందో చూసి సమస్యను పరిష్కరిస్తాం.

- కిరణ్మయి, కొండమల్లేపల్లి ఎమ్మార్వో

దరఖాస్తు చేసుకొంటే పరిష్కరిస్తాం

నేను ఇటీవలే వీఆర్వోగా ఈ ఊరికి వచ్చాను. ఇంతకుముందున్న వీఆర్వో సస్పెండ్ అయి వెళ్లిపోయారు. స్వరూప రాణి తమ సమస్యపై దరఖాస్తు చేసు కుంటే పరిశీలించి పరిష్కరిస్తాం.

- నరేందర్, పెండ్లిపాకల వీఆర్వో

పట్టా ఒకరిది పరిహారం మరొకరికి

- మెదక్ జిల్లా చిన్నశంకరంపేట అధికారుల నిర్వాకం
- న్యాయం కోసం బాధిత దళిత మహిళ వేడుకోలు

చిన్నశంకరంపేట: పట్టాదారు కాకుండా మరో రైతుకు రెవె న్యూ అధికారులు నష్టపరిహారాన్ని అందించి చేతులు దులు పుకొన్నారు. నష్టపరిహారం కోసం పట్టాదారు రెవెన్యూ అధి కారుల చుట్టూ తిరిగినా కనికరించడం లేదు. రెవెన్యూ అధి కారులు తనను నిలువునా ముంచారని పట్టాదారు అయిన బాధిత దళిత మహిళ వాపోతున్నారు. మెదక్ జిల్లా చిన్నశం కరంపేట మండలకేంద్రంలో 132/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు ఆ గ్రామ శివారులోని 345 సర్వే నంబర్‌లో 10.18 ఎకరాల భూమిని 12 మంది రైతుల నుంచి సేకరించారు. ఈ రైతులంతా గతంలో ప్రభుత్వం ద్వారా పట్టాలు పొందినవారే. ఇది అసైన్డ్ భూమి కావడంతో రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.5లక్షల చొప్పున నష్టపరిహారం అందించింది. ఇందులో చిన్నశంక రంపేటకు చెందిన ఆడపడుచు నాగవ్వ 1.19 ఎకరాల భూమిని కోల్పోయారు. నాగవ్వకు అందాల్సిన నష్టపరి హారం సొమ్మును రెవెన్యూ అధికారులు మరో రైతుకు అం దించారు. ఈ విషయం తెలుసుకొన్న పట్టాదారు నాగవ్వ రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా.. కాస్తులో ఉన్న రైతుకే నష్టపరిహారాన్ని అందించామని సమాధానమిచ్చారు. తాను ఎవరికీ భూమి విక్రయించలేదని ఆమె చెప్తున్నారు. ఒకవేళ విక్రయించి ఉంటే ఆ భూమికి సంబంధించిన రైతుబంధు పథకం సొమ్ము తనకే ఎందుకు వచ్చిందని ఆమె అధికారు లను నిలదీస్తున్నారు. అర్హురాలిని అయిన తనకు నష్టపరి హారం అందించి తగు న్యాయంచేయాలని నాగవ్వ ఉన్నతా ధికారులకు విజ్ఞప్తిచేశారు.



కొత్త పాస్‌పుస్తకం చూపుతున్న బాధితురాలు నాగవ్వ

సర్వే ప్రకారమే పరిహారం అందించాం

చిన్నశంకరంపేటలో 132/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మా ణానికి సేకరించిన భూములకు ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం రైతులకు నష్టపరిహారాన్ని అందించా రు. నాగవ్వ పేరిట 1.19 ఎకరాల పట్టా భూమి ఉన్నది వాస్తవమే. ఆ భూమిని ఆమె అమ్ముకున్నం దున సర్వే ప్రకారం కాస్తులో ఉన్న రైతులకే నష్టపరిహారం అందించాం.

- రాజేశ్వర్‌రావు, చిన్నశంకరంపేట తాసిల్దార్

30 ఏండ్ల కిందట రూ.200 అప్పు..

చెల్లించడానికి కెన్యా నుంచి భారత్‌కు రాక

- నీతి నిజాయితీలకు అద్దం పట్టిన ఘటన

ముంబై: తీసుకున్న అప్పు చెల్లించకుండా తిరిగే ఈ రోజుల్లో.. కేవలం రూ.200 అప్పు చెల్లించడానికి దేశం కాని దేశం నుంచి వచ్చాడు ఓ వ్యక్తి. అది కూడా దాదాపు 30 ఏండ్ల కింద చేసిన రూ.200 అప్పును గుర్తు ఉంచుకొని మరీ చెల్లించాడు. కెన్యాలోని న్యారిబారి ఛాఛి ఎంపీ రిచర్డ్ టాంగీ 1985-89 మధ్య మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసించినప్పుడు వాంఖేడినగర్‌లో నివాసం ఉన్న ఇంటి వద్ద ఓ కిరాణ దుకాణంలో రూ.200 అప్పు చేశారు. చదువు పూర్తికాగానే స్వదేశానికి వెళ్లిపోయారు. కానీ తన అప్పు సంగతి మరిచిపోలేదు. భార్య మిషెల్లీతో కలిసి సోమవారం కిరాణం దుకాణం యజమాని గౌలి ఇంటికి వచ్చిన రిచర్డ్ విలేకరులతో మాట్లాడుతూ 'ఔరంగాబాద్‌లో చదువుకున్నప్పుడు గౌలి వద్ద రూ.200 అప్పు చేసి తర్వాత కెన్యాకు వెళ్లిపోయాను. ఆ అప్పు గౌలికి రూ.200 తిరిగి ఇచ్చేయడానికి ఇక్కడికొచ్చాను. అప్పు తీర్చానన్న భావోద్వేగంతో నా కండ్ల నుంచి ఆనందబాష్పాలు రాలాయి' అని తెలిపారు. తమ ఇద్దరి మధ్య అనుబంధాన్ని గుర్తుచేసుకున్న గౌలి ఎంతో ఆనంద పడ్డారని చెప్పారు. తమ భోజనం కోసం ఓ హోటల్‌కు తీసుకెళ్లడానికి ప్రయత్నించగా వద్దని వారించి ఇంట్లోనే భోజనం చేద్దామని చెప్పానన్నారు. కెన్యాలోని తమ ఇంటికి రావాలని గౌలిని ఆహ్వానించానని వివరించారు.

గౌలితో రిచర్డ్ టాంగీ

అమ్మా.. మీరే దిక్కు!

తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు చేపట్టండి

సోనియాకు కాంగ్రెస్ సీనియర్ల వేడుకోలు

న్యూఢిల్లీ: 'అమ్మా.. మీరే దిక్కు. పార్టీకి తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు చేపట్టండి' అని యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ (72)ని ఆ పార్టీ సీనియర్లు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాహుల్ బాటలోనే పలు రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు రాజీనామా చేశారు. రాహుల్ తన రాజీనామాను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు ఆందోళనలు, ఆత్మహత్యాయత్నాలు కూడా చేసినా ఆయన స్పందించడం లేదు. ప్రత్యామ్నాయ అధ్యక్షుడి కోసం కాంగ్రెస్ సీనియర్ నేతలు తీవ్ర చర్చలు జరిపినా ఓ కొలిక్కి రాలేదు. పలు రాష్ట్రాల్లో పార్టీ భవిష్యత్తుపై కేడర్‌లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో సోనియానే తాత్కాలికంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని కాంగ్రెస్ విధేయులు కోరుతున్నా ఆమె విముఖంగా ఉన్నట్లు తెలుస్తున్నది. తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలకు ఆరోగ్యం సహకరించడం లేదని తన సన్నిహితులకు ఆమె చెప్పినట్లు తెలుస్తున్నది.

అయోధ్యపై 18లోపు

నివేదిక ఇవ్వండి!

మధ్యవర్తిత్వ కమిటీకి సుప్రీంకోర్టు ఆదేశం

అదేరోజున తదుపరి ఉత్తర్వులిస్తాం..

జూలై 25 నుంచి రోజువారీ విచారణ చేపడుతామని వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూలై 11: అయోధ్యలోని రామ జన్మభూమి-బాబ్రీ మసీదు భూ వివాదం సమస్య పరిష్కారంలో పురోగతిపై నివేదికను అందజేయాలని మధ్యవర్తిత్వ కమిటీని సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. ఈ నెల 18నాటికి మధ్యవర్తిత్వ ప్రక్రియలో పురోగతిపై నివేదికను ఇవ్వాలని సూచించింది. ఒకవేళ మధ్యవర్తిత్వ ప్రక్రియ అవసరంలేదనిపిస్తే, తదుపరి ఉత్తర్వుల్ని అదే రోజు ఇస్తామని ధర్మాసనం పేర్కొంది. అవసరమైతే ఈ నెల 25 నుంచి రోజువారీ విచారణ చేపడుతామని స్పష్టంచేసింది. 'అయోధ్య భూ వివాదంపై నివేదికను మధ్యవర్తిత్వ కమిటీ జూలై 18నాటికి సమర్పించాలి. తదుపరి ఉత్తర్వుల్ని అదే రోజున ఇస్తాం' అని జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదు గురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. అయోధ్య భూ వివాదంలో మధ్యవర్తిత్వ ప్రక్రియ చాలని అనిపిస్తే, అదేరోజున తగిన ఆదేశాలు ఇచ్చి.. ఈ అంశంపై విజ్ఞప్తులను స్వీకరిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. అయోధ్య భూ వివాదంలో మధ్యవర్తిత్వంతో ఎలాంటి ప్రయోజనం కన్పించట్లేదంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌ను రామ జన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంలో వాస్తవ కక్షిదారుల్లో ఒకరైన గోపాల్ సింగ్ విశారద్ సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. అయోధ్య వివాదంలో సామరస్యపూర్వకంగా సమస్యను పరిష్కరించడానికి అవకాశముంటే సూచించాలని ఈ ఏడాది మార్చి 8న సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించింది. దీనికి సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఎఫ్.ఎం.ఖలీఫుల్లా నేతృత్వం వహిస్తుండగా ఆధ్యాత్మిక గురువు, 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకుడు రవిశంకర్, ప్రముఖ సీనియర్ న్యాయవాది శ్రీరామ్ పంచు సభ్యులుగా ఉన్నారు. కమిటీ ఇటీవల సుప్రీంకోర్టుకు మధ్యంతర నివేదికను సమర్పించింది. అయితే సామరస్య పరిష్కారాన్ని కనుగొనేందుకు తమకు మరింత సమయం కావాలని మధ్యవర్తిత్వ కమిటీ కోర్టును కోరింది. దీంతో ఆగస్టు 15వరకు న్యాయస్థానం గడువు కల్పించింది. అయితే, మధ్యవర్తిత్వంతో ఎలాంటి ప్రయోజనం కన్పించట్లేదంటూ గోపాల్‌సింగ్ విశారద్ పిటిషన్ దాఖలు చేయడంతో సుప్రీంకోర్టు కమిటీకి జూలై 18తేదీని గడువుగా విధించింది.

తక్షణం నిర్ణయించాలి

రెబల్స్ రాజీనామాలపై కర్ణాటక స్పీకర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

మెరుపు వేగంతో పనిచేయలేనన్న రమేశ్‌కుమార్

రాజీనామాల పరిశీలనకు సమయం కావాలని వెల్లడి

మళ్లీ రాజీనామా లేఖలిచ్చిన ఎమ్మెల్యేలు

అవి నిబంధనల ప్రకారమే ఉన్నాయన్న స్పీకర్

న్యూఢిల్లీ, జూలై 11: కర్ణాటకలో అసెంబ్లీ నుంచి తప్పుకున్న 16 మంది అధికార పక్షాల ఎమ్మెల్యేల రాజీనామాపై అనిశ్చితి కొనసాగుతున్నది. రాజీనామా చేసిన పది మంది రెబల్ ఎమ్మెల్యేలపై తక్షణం నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ రమేశ్‌కుమార్ బేఖాతరు చేశారు. తాను మెరుపు వేగంతో పనిచేయలేనని తేల్చిచెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ ముందు హాజరైన పది మంది రెబల్స్.. తాజాగా మరోసారి రాజీనామాలను సమర్పించారు. వారి రాజీనామాలన్నీ నిబంధనల ప్రకారమే ఉన్నా, వారు స్వచ్ఛందంగా రాజీనామా చేశారా, వారు సమర్పించిన పత్రాలు నిజమైనవేనా అన్నది నిర్ధారించాల్సి ఉన్నదని స్పష్టం చేశారు. ముంబైలోని ఒక హోటల్‌లో మకాం వేసిన 10 మంది ఎమ్మెల్యేలు గురువారం సాయంత్రం రెండు ప్రత్యేక విమానాల్లో బెంగళూరు చేరుకున్నారు. అక్కడి నుంచి ఒక లగ్జరీ బస్సులో బందోబస్తు మధ్య అసెంబ్లీకి చేరుకుని స్పీకర్‌ను కలిసి రాజీనామాలు సమర్పించాక వారు తిరిగి ముంబై వెళ్లిపోయినట్టు తెలిసింది. అధికార పార్టీలకు చెందిన 16 మంది (13 మంది కాంగ్రెస్, ముగ్గురు జేడీఎస్) ఎమ్మెల్యేల రాజీనామాతో కుమారస్వామి ప్రభుత్వం సంక్షోభంలో పడిన సంగతి తెలిసిందే.

ఈ రోజే నిర్ణయించాలి: సుప్రీంకోర్టు

రెబల్ ఎమ్మెల్యేలను సాయంత్రం 6 గంటలకు కలుసుకొని, వారు సమర్పించే రాజీనామాలు స్వీకరించి, వాటిపై వెంటనే ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గురువారం ఉదయం కర్ణాటక స్పీకర్‌ను ఆదేశించింది. స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని తమకు శుక్రవారం తెలియజేయాలని ఆదేశించింది. తాము సమర్పించిన రాజీనామాలను స్పీకర్ ఆమోదించడం లేదని పది మంది రెబల్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. కోర్టు ఆదేశాలపై స్పందించిన స్పీకర్ రమేశ్‌కుమార్ వెంటనే ఒక పిటిషన్ దాఖలు చేస్తూ, కోర్టు ఆదేశాల ప్రకారం తాను పది మంది రెబల్ ఎమ్మెల్యేలను కలుసుకుంటాను తప్ప.. వారి రాజీనామాపై నిర్ణయాన్ని వెల్లడించలేనన్నారు. వారి రాజీనామాల పరిశీలనకు తనకు కొంత సమయం పడుతుందన్నారు. స్పీకర్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరుపుతామని కోర్టు తెలిపింది.

పరిస్థితిని భ్రష్టు పట్టించారు

రెబల్ ఎమ్మెల్యేలు పరిస్థితిని భ్రష్టు పట్టించారని స్పీకర్ రమేశ్‌కుమార్ అన్నారు. 'నా కార్యాలయానికి రాకుండా నేను వారిని (రెబల్స్‌ను) అడ్డుకోలేదు. నన్ను కలుసుకోవడానికి వారు సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లారో తెలియడం లేదు' అని స్పీకర్ మీడియాతో అన్నారు. 'నన్ను కలుసుకోవడానికి వారు కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకోవాల్సిన అవసరం లేదు. వారు స్వేచ్ఛగా నా దగ్గరికి రావచ్చు. వారి వైఖరే భ్రష్టు పట్టించేదిగా ఉంది' అని అన్నారు. రెబల్స్ రాజీనామాపై ఈ రోజే నిర్ణయం తీసుకుంటారా అన్న విలేకరుల ప్రశ్నకు.. 'న్యాయస్థానం ఈ రోజే నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. కానీ ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో ఆదేశించలేదు' అని బదులిచ్చారు.

రాజీనామాలు ఇచ్చేందుకు స్పీకర్ చాంబర్‌వద్దకు వస్తున్న రెబల్ ఎమ్మెల్యేలు (ఇన్‌సెట్‌లో) స్పీకర్ రమేశ్ కుమార్

అసమ్మతి శిబిరానికి చేరిన ఇద్దరు ఎమ్మెల్యేలు

ముంబైలోని ఓ హోటల్‌లో మకాం వేసిన రెబల్ ఎమ్మెల్యేల వద్దకు మరో ఇద్దరు ఎమ్మెల్యేలు చేరారు. దీంతో ముంబైలో ఉన్న రెబల్ ఎమ్మెల్యేల సంఖ్య 14కు చేరింది.

రాజీనామాలు తాజాగా సమర్పిస్తాం: రెబల్స్

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం స్పీకర్‌కు తాము మళ్లీ రాజీనామాలు సమర్పిస్తామని కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు ముంబైలో చెప్పారు. తాము ఇంకా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నామన్నారు. తాము కేవలం అసెంబ్లీ సభ్యత్వాలకు రాజీనామా చేశామని, ఇందులో బీజేపీకి ఎటువంటి పాత్ర లేదని తెలిపారు.

నేనెందుకు రాజీనామా చేయాలి: కుమారస్వామి

అధికార పక్ష ఎమ్మెల్యేల రాజీనామాలతో ప్రభుత్వం మైనారిటీలో పడిన నేపథ్యంలో తన రాజీనామా కోసం వస్తున్న డిమాండ్లను సీఎం కుమారస్వామి తోసిపుచ్చారు. 'నేనెందుకు రాజీనామా చేయాలి? ఆ అవసరమేమొచ్చింది?' అని ఆయన ప్రశ్నించారు. 2009-10లో మంత్రులు సహా 18 మంది ఎమ్మెల్యేలు నాటి సీఎం యడ్యూరప్పను వ్యతిరేకించారని, కానీ ఆయన రాజీనామా చేయలేదని కుమరస్వామి గుర్తు చేశారు. కుమారస్వామి రాజీనామాను డిమాండ్ చేస్తూ యెడ్యూరప్ప నేతృత్వంలో బీజేపీ నేతలు అసెంబ్లీ ఎదుట ఆందోళన చేసిన సంగతి తెలిసిందే

పార్లమెంట్ ఆవరణలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ ఎంపీలు

అవిశ్వాసాన్ని ఎదుర్కొంటాం: మంత్రివర్గం

అధికార పక్షాలకు చెందిన 16 మంది ఎమ్మెల్యేల రాజీనామాతో ప్రభుత్వ మనుగడ డోలాయమానంలో పడినా తాము విశ్వాస పరీక్షను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కర్ణాటక క్యాబినెట్ విశ్వాసం వ్యక్తం చేసింది. సీఎం కుమారస్వామి అధ్యక్షతన గురువారం సాయంత్రం సమావేశమైన క్యాబినెట్ అవిశ్వాసాన్ని ధైర్యంగా, ఐక్యంగా ఎదుర్కొంటామన్నది. సమావేశ వివరాలను రాష్ట్ర మంత్రి కృష్ణ బైరెగౌడ మీడియాకు చెప్పారు. 'రాజకీయ పరిణామాలపై.. ప్రత్యేకించి ప్రభుత్వం ప్రస్తుత సంక్షోభ పరిస్థితిపై చర్చించాం. ఈ సమస్యకు గల కారణాలను, పరిష్కారాలపైనా మాట్లాడుకున్నాం' అని చెప్పారు. కేంద్రాన్ని అడ్డం పెట్టుకొని కర్ణాటక ప్రభుత్వాన్ని కూలదోయడానికి బీజేపీ ప్రయత్నించడం ఇది ఆరోసారి ఆరోపించారు. 'ఇంతవరకు బీజేపీ చేసిన దాడులన్నంటినీ తట్టుకున్నాం. ఈసారి ఆ దాడి కొంత తీవ్రంగా ఉన్న మాట వాస్తవమే. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే పరిస్థితులను ధైర్యంగా, ఐక్యంగా ఎదుర్కోవాలని నిర్ణయించాం' అని కృష్ణ బైరెగౌడ చెప్పారు.

గురు పౌర్ణమి రోజు సెలవు ఎందుకు?

మరో రెండు గంటలు అదనంగా పనిచేసి గురువులను గౌరవిద్దాం: నితీశ్‌కుమార్

పాట్నా: గురు పౌర్ణమినాడు సెలవు ప్రకటించాలన్న ఎమ్మెల్సీల విజ్ఞప్తిని బీహార్ సీఎం నితీశ్‌కుమార్ తిరస్కరించారు. అంతేగాక ఆ రోజు మరో రెండు గంటలు అదనంగా పనిచేసి తమ గురువులను గౌరవించాలని సూచించారు. గురువారం బీహార్ శాసనమండలి సమావేశం కాగానే సభ్యుడు సంజీవ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన గురు పౌర్ణమి ఉన్నదని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరారు. దీనికి అధికార జేడీఎస్ సభ్యులు కూడా మద్దతు ప్రకటించారు. దీంతో సీఎం నితీశ్‌కుమార్ కలుగజేసుకుంటూ గురు పౌర్ణమి రోజు సెలవు ప్రకటిస్తే విద్యార్థులకు పాఠాలు ఎవరు చెబుతారని, అందుకే ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు చెప్పారు.

గ్రీన్‌కార్డులపై పరిమితి తొలిగింపు!

బిల్లును ఆమోదించిన అమెరికా ప్రతినిధుల సభ

తదుపరి దశలో సెనేట్, అధ్యక్షుడు ఆమోదిస్తే చట్టంగా అమలు

భారత్ తదితర దేశాల నిపుణులకు లబ్ధి

వాషింగ్టన్, జూలై 11: గ్రీన్ కార్డుల కోసం భారత్ వంటి దేశాల నుంచి వేల సంఖ్యలో వేచి చూస్తున్న వారికి ఊరట కలిగించే నిర్ణయాన్ని అమెరికా ప్రతినిధుల సభ తీసుకుంది. గ్రీన్‌కార్డులను ఒక దేశానికి ఏడు శాతం మాత్రమే మంజూరు చేయాలనే నిబంధనను ఎత్తివేసే, కుటుంబ ఆధారిత గ్రీన్‌కార్డులపై విధించిన పరిమితిని పెంచే బిల్లుకు ప్రతినిధుల సభ గురువారం భారీ మెజారిటీతో ఆమోదం తెలిపింది. దీంతో అమెరికాలో పనిచేస్తూ అక్కడే శాశ్వత నివాసం ఏర్పరచుకోవాలని భావించే వేల మంది ప్రతిభావంతులకు ఊరట లభించింది. ఈ బిల్లును ప్రతినిధుల సభ 365:65 ఓట్ల మెజారిటీతో ఆమోదించింది. అయితే ఈ బిల్లును ఇంకా సెనేట్ ఆమోదించాల్సి ఉంది. అంతిమంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దానిపై తన ఆమోద ముద్ర వేస్తేనే అది చట్టంగా మారుతుంది. ఈ బిల్లు చట్టంగా మారితే, ఒక్కో దేశానికి జారీ చేసే కుటుంబ ఆధారిత ఇమ్మిగ్రెంట్ వీసాల సంఖ్య ప్రస్తుతమున్న ఏడు శాతం నుంచి 15 శాతం వరకు పెరుగవచ్చని భావిస్తున్నారు. అలాగే ఉపాధి ఆధారిత వీసాలపై విధించిన నిషేధం కూడా తొలిగిపోనుంది. గ్రీన్ కార్డును పొందిన అమెరికాయేతర పౌరుడు ఆ దేశంలో పనిచేస్తూ శాశ్వతంగా నివాసాన్ని ఏర్పరచుకోవచ్చు. ఈ బిల్లు వల్ల భారత్ వంటి దేశాలకు చెందిన నిపుణులు ఎక్కువగా లబ్ధి పొందనున్నారు. ఒక్కో దేశం నుంచి వచ్చే దరఖాస్తుల్లో ఏడు శాతం మందికి మాత్రమే గ్రీన్‌కార్డులు జారీ చేయాలన్న ప్రస్తుత ఇమ్మిగ్రేషన్ విధానం కారణంగా హెచ్1బీ వీసాపై అమెరికా వెళుతున్న భారత ఐటీ నిపుణులు ఎక్కువగా ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు దశాబ్దాలుగా గ్రీన్‌కార్డు కోసం వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలో తీసుకొచ్చిన తాజాబిల్లు 2020-22 ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధి ఆధారిత వీసాల జారీకి పరివర్తన నిబంధనలను కూడా విధించనుంది. ఈబీ-2 (ఆధునిక డిగ్రీలు లేదా అసాధారణ సామర్థ్యం గలవారు), ఈబీ-3 (నిపుణులు, ఇతర ఉద్యోగులు), ఈబీ-5 (పెట్టుబడిదారులు) విభాగాల వారికి వీసాల జారీలో కొంత శాతం ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించనున్నారు. అయితే అత్యధికంగా వీసాలు పొందిన రెండు దేశాలకు చెందిన వారికి మాత్రం ఈ రిజర్వేషన్ వర్తించదు. ఇక రిజర్వు చేయని వీసాలలో 85 శాతం వీసాలను ఏదైనా ఒకే దేశానికి చెందిన వారికి ఇచ్చే అవకాశం కూడా ఉంటుంది. మొత్తంగా ఈ బిల్లుపై ట్రంప్ తన ఆమోద ముద్ర వేయడానికి ముందు రిపబ్లికన్ పార్టీ సభ్యులు అధికంగా ఉన్న సెనేట్‌ను దాటాల్సి ఉంటుంది. బిల్లును ప్రతినిధుల సభ ఆమోదించడం పట్ల అమెరికా వ్యాప్తంగా ఉన్న భారత నిపుణులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే అమెరికాలోని టాప్ ఐటీ కంపెనీలు కూడా హర్షం వ్యక్తం చేశాయి. సెనేట్ కూడా ఈ బిల్లుకు సాధ్యమైనంత త్వరగా ఆమోదం తెలుపాలని అవి విజ్ఞప్తి చేశాయి. అమెరికాలో విద్వేష హత్యకు గురైన తెలుగు యువకుడు శ్రీనివాస్ కూచిబొట్ల భార్య సునయన దుమాల.. బిల్లు ఆమోదం పొందడంపై స్పందిస్తూ, 'ఈ సమయం కోసం ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్నాం. మొత్తానికి మా శ్రమ ఫలించింది' అన్నారు.

పాక్‌లో ఘోర రైలు ప్రమాదం

గూడ్సు రైలును ఢీకొట్టిన ప్యాసింజర్ రైలు

16 మంది మృతి.. 80 మందికిపైగా గాయాలు

లాహోర్: పాకిస్థాన్‌లో ఘోర రైలు ప్రమాదం సంభవించింది. గూడ్సు రైలును ప్యాసింజర్ రైలు బలంగా ఢీకొట్టడంతో 16 మంది మరణించారు. 80 మందికిపైగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన గురువారం పంజాబ్ రాష్ట్రంలోని వాల్టర్ రైల్వే స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. ఖ్వెట్టాకు బయలుదేరిన అక్బర్ ఎక్స్‌ప్రెస్ రైలు వాల్టర్ రైల్వేస్టేషన్ వద్దకు రాగానే అది ప్రయాణించాల్సిన పట్టాలను దాటుకొని వేరే పట్టాల గుండా ముందుకు సాగి ఎదురుగా ఉన్న గూడ్సు రైలును బలంగా ఢీకొట్టింది. దీంతో 16 మంది అక్కడికక్కడే మరణించారు. విషయం తెలిసిన వెంటనే సైన్యం, రైల్వే సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలను చేపట్టారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను బయటికి తీశారు. గాయపడిన ప్రయాణికులను సమీప దవాఖానకు తరలించారు. కాగా ప్రమాదం ధాటికి ప్యాసింజర్ రైలు ఇంజిన్ ఘోరంగా దెబ్బతిన్నది. మూడు బోగీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద తీవ్రత దృష్ట్యా మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. మరోవైపు ఈ దుర్ఘటనపై పాక్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ, ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సంతాపం తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నదని పాక్ రైల్వే మంత్రి తెలిపారు.

నాన్నా! మమ్మల్ని వేటాడకండి!

కులాంతర వివాహం చేసుకున్న యూపీ బీజేపీ ఎమ్మెల్యే కుమార్తె విన్నపం

భర్త అజితేశ్‌తో సాక్షి మిశ్రా

లక్నో, జూలై 11: కులాంతర వివాహం మరోసారి దేశవ్యాప్త చర్చకు దారి తీసింది. ఉత్తర్ ప్రదేశ్ బరేలీ జిల్లా బిఠారీ చైన్‌పూర్ ఎమ్మెల్యే రాజేశ్ మిశ్రా (బీజేపీ) కుమార్తె సాక్షి మిశ్రా (23), దళిత సామాజిక యువకుడ్ని పెండ్లి చేసుకోవడంతో ఆ జంటకు బెదిరింపులు ఎదురయ్యాయి. తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఎమ్మెల్యే కుమార్తె ఒక వీడియోను విడుదల చేసింది. 'నా ఇష్టపూర్వకంగానే అజితేశ్‌ను పెండ్లి చేసుకున్నాను. నా తండ్రి మా ఇద్దర్ని చంపేందుకు గుండాలను పంపారు. మేము వారి నుంచి తప్పించుకుని తిరుగుతున్నాం. నా తండ్రి వల్ల మా ఇద్దరి ప్రాణాలకు ముప్పు ఉంది. మాకు పోలీసు రక్షణ కావాలి' అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే 'నాన్నా.. మమల్ని ప్రశాంతంగా బతుకనీయండి. అజితేశ్, ఆయన కుటుంబ సభ్యులకు దూరంగా ఉండండి. మాకేమైనా జరిగితే నా తండ్రి, సోదరుడు విక్కీ, రాజీవ్ రాణా బాధ్యులు. మా ప్రాణాలకు ముప్పు ఉంది. బరేలీ ఎంపీ, ఎమ్మెల్యేలు నా విషయంలో నా తండ్రికి ఎలాంటి సహాయం చేయవద్దని నా మనవి' అని సాక్షి మిశ్రా పేర్కొన్నారు. ఆమె భర్త అజితేశ్ కుమార్ కూడా ఆమె పక్కన కనిపించారు. 'మేమున్న హోటల్ వద్దకు గుండాల గుంపు వచ్చింది. మేము వారి నుంచి తృటిలో తప్పించుకున్నాం' అని కుమార్ అన్నారు. తన కుమార్తె వీడియో సందేశంపై ఎమ్మెల్యే రాజేశ్ మిశ్రా గురువారం స్పందించారు. తన కుమార్తె మేజర్ అని, ఆమె ఇష్టంతో చేసుకున్న పెండ్లిపై తనకు ఎలాంటి వ్యతిరేకత లేదన్నారు. తన కుమార్తెకు, ఆమె భర్తకు మధ్య వయసులో 9 ఏండ్లపైగా వ్యత్యాసం ఉందని, అతడికి సంపాదన కూడా సరిగా లేదన్నారు. తన బిడ్డ భవిష్యత్‌పై ఇవే తన ఆందోళనలని ఆయన తెలిపారు. మరోవైపు రక్షణ కల్పించాలన్న సాక్షి మిశ్రా వీడియో విన్నపంపై డీఐజీ ఆర్కే పాండే స్పందించారు. ఆ జంటకు తగిన రక్షణ కల్పించాలని సీనియర్ ఎస్పీని ఆదేశించారు. అయితే వారిద్దరూ ఎక్కడ ఉన్నారన్నది స్పష్టంగా చెప్పకపోవడంతో వారికి ఎక్కడ రక్షణ కల్పించాలో అన్నది పోలీసులకు తెలియడం లేదని ఆర్కే పాండే చెప్పారు.

ఫోర్బ్స్ జాబితాలో అక్షయ్ కుమార్

భారత్ నుంచి ఆయనకు మాత్రమే లభించిన స్థానం

న్యూఢిల్లీ: ఈ ఏడాది ఫోర్బ్స్ ప్రకటించిన ప్రపంచవ్యాప్తంగా అత్యంత పారితోషికం తీసుకుంటున్న 100 మంది ప్రముఖుల్లో భారత్ నుంచి బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్‌కు మాత్రమే చోటు లభించింది. రూ.444 కోట్ల ఆదాయంతో ఆయన ఫోర్బ్స్ జాబితాలో 33వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 2018 జాబితాలోనూ అక్షయ్ కుమార్ 76వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 2018 జాబితాలో 82వ స్థానంలో నిలిచిన నటుడు సల్మాన్‌ఖాన్, 2017 జాబితాలో 65వ స్థానంలో నిలిచిన నటుడు షారుఖ్‌ఖాన్‌లకు ఈ ఏడాది చోటు లభించలేదు. అమెరికాకు చెందిన గాయకుడు టేలర్ స్విఫ్ట్ ఈ ఏడాది జాబితాలో తొలి స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

ప్రోత్సాహకాల ఊసేది

బడ్జెట్‌పై రాజ్యసభలో విపక్షాల పెదవి విరుపు

సంస్కరణల ప్రక్రియను వదిలేశారని విమర్శ

ఇది పేదల, రైతుల అనుకూల బడ్జెట్: బీజేపీ

న్యూఢిల్లీ, జూలై 11: దేశంలో పెట్టుబడులు, ఉద్యోగాలు కల్పించడానికి బడ్జెట్‌లో ప్రోత్సాహకాలే లేవని, సాహసోపేత సంస్కరణలే కరువయ్యాయని విపక్షం పేర్కొంది. బడ్జెట్‌పై రాజ్యసభలో జరిగిన చర్చలో అధికార బీజేపీ విపక్షాల వాదనను తిప్పికొట్టింది. తమ బడ్జెట్ పేదలు, రైతుల అనుకూల బడ్జెట్ అని అభివర్ణించింది. కాంగ్రెస్ సభ్యుడు పీ చిదంబరం బడ్జెట్‌పై చర్చలో పాల్గొంటూ.. దేశ ఆర్థిక వ్యవస్థను 2024-25 నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లకు తీసుకెళ్తామన్న ప్రభుత్వ ప్రకటనను తోసిపుచ్చారు. ఆర్థిక వ్యవస్థ దానంతట అదే ఆరు, ఏడేండ్లలో రెట్టింపవుతుందని, దానికి ప్రధాని, ఆర్థిక మంత్రి అవసరం లేదన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో పెద్ద ఆకట్టుకోదగిన అంశాలే లేవన్నారు. పెట్టుబడులు, పొదుపును పెంచేందుకు చర్యలే కాన రాలేదన్నారు. ఇతర విపక్ష సభ్యులు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నిరాశానిస్పృహల మధ్య ఉన్న రైతులను ఆదుకునేందుకు గిట్టుబాటు ధరలు ప్రకటించడంతోపాటు రుణ మాఫీ కల్పించాలన్నారు. వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక మందగమనం, ఉద్యోగ లేమి, పారిశ్రామిక స్తబ్ధత తదితర అంశాలపై ప్రభుత్వం మౌనం వహిస్తున్నదని విపక్ష సభ్యులు ఆరోపించారు. విపక్షాల విమర్శలను బీజేపీ సభ్యుడు ప్రభాత్ ఝా తిప్పికొట్టారు. తమ బడ్జెట్ పేదల, రైతుల అనుకూలమైనదన్నారు. వ్యవసాయ రంగానికి గణనీయంగా నిధుల కేటాయింపులు పెరిగాయని, తద్వారా వృద్ధిరేటు పెంచడానికి తోడ్పడుతుందని చెప్పారు. రాజ్యసభలో స్వతంత్ర్య సభ్యుడు, కేరళ ఎంపీ వీరేంద్ర కుమార్

భారతదేశంలో బుల్లెట్ ట్రేన్ అనే ఆలోచనే అసంబద్ధమైనది. అదొక గాలి మేడ. అబద్ధపు ప్రచారం. బుల్లెట్ ట్రేన్‌లకు ప్రత్యేక తరహా నిర్మాణ వ్యవస్థ అవసరం. అలాంటిది దేశంలో లేదు, అసాధ్యం. దేశంలో అలాంటివి ఆచరణాత్మకం కాదు.

సుదీప్ బందోపాధ్యాయ్, తృణమూల్ కాంగ్రెస్ నేత

ఇప్పుడు బుల్లెట్ ట్రేన్‌లు ముఖ్యం కాదు. రైళ్లలో ఇప్పటికీ పారిశుద్ధ్య పనులను మనుషులతోనే చేయిస్తున్నాం. కాంట్రాక్ట్ కార్మికులుగా మల మూత్రాలను ఎత్తిపోసే పనిలో ఉండటం పట్ల మనం సిగ్గుపడాలి. ఇదింకా కొనసాగటం అవమానకరం.

కనిమొళి, డీఎంకే నేత

చరిత్రలో నేడు

1879

జర్మనీలో వ్యవసాయ, పరిశ్రమల సుంకాల విధింపు.

1902

మహిళా ఓటు హక్కును అంగీకరించిన ఆస్ట్రేలియా పార్లమెంట్.

1933

1వ కనీస వేతన చట్టాన్ని ఆమోదించిన అమెరికా బిగువ సభ.

కెనడాలో గత ఆరు నెలల్లో రెండు లక్షలకు పైగా కొత్త శాశ్వత ఉద్యోగ కల్పన జరిగింది. నిరుద్యోగం అతి తక్కువగా ఉన్నది. వేతనాలు పెరిగాయి. అయినా డబ్బు సరిపోవడం లేదని ప్రజలు బాధపడిపోతున్నారు. ఆర్థిక భద్రత లేదని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఇందుకు కారణం ద్రవ్యోల్బణం. ఆహార పదార్థాల ధరలు పెరిగాయి. జీతంలో సగం ఇంటి అద్దెకే పోతున్నది. 31 శాతం మంది తాత్కాలిక ఉద్యోగాలు లేదా బొటాబొటి స్వయం ఉపాధి కలిగి ఉన్నారు. ప్రభుత్వం గృహ నిర్మాణం వంటి పథకాలతో పాటు పటిష్టమైన ఆర్థిక విధానాన్ని అమలు చేయాలె.

ది గ్లోబ్ అండ్ మెయిల్

ఆస్ట్రేలియా రాజ్యాంగంలో భూమి పుత్రులకు ప్రత్యేక హోదా కల్పించే అంశంపై మూడేండ్లలోగా ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతామని ఆస్ట్రేలియా స్థానిక జాతుల మంత్రి కెన్ వ్యాట్ ప్రకటించారు. నల్ల జాతీయులకు, శ్వేతజాతీయులకు మధ్య సదవగాహన కలిగేవిధంగా, ప్రజాభిప్రాయ సేకరణలో ఆమోదం పొందే ప్రతిపాదన రూపొందించడం ఒక పెద్ద సవాలు. గతంలో ప్రత్యేకించి రైటిస్టులు భూమి పుత్రులపై సాగించిన అకృత్యాలను ఒప్పుకోవడానికి నిరాకరించేవారు. కానీ స్వయంగా ఈ అకృత్యాలకు గురైన కుటుంబం నుంచే వచ్చిన వ్యాట్ వారి గొంతు వినిపిస్తున్నారు.

ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్

సాహసోపేత నిర్ణయం

తెలంగాణ సాధించడమే కాకుండా రాష్ట్రాన్ని సామాజికార్థికాభివృద్ధి బాటలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ తాజాగా అవినీతి వృక్షాన్ని సమూలంగా పెకిలించి వేయాలని నిర్ణయించడం సాహసోపేతం. వాస్తవానికి ఇదొక సంచలన ప్రకటన. సాధారణంగా ఏ పాలకులైనా అవినీతి నిర్మూలన జోలికి పోరు. ఎన్ని విధానాలు రూపొందించినా అధికార గణాలకు ఆగ్రహం కలుగుతుందనే కారణంగా పరిపాలన సంస్కరణలకు జంకుతారు. ఒక్కోసారి మార్పులు చేపట్టినా, ఒత్తిడులకు లొంగిపోయి వదిలివేస్తారు. కానీ స్వభావరీత్యా కేసీఆర్ ఉద్యమకారుడు కావడం, సాధారణ రాజకీయ నాయకుడు కాకుండా పాలనాదక్షుడు కావడం వల్ల ఈ సాహసానికి దిగారనవచ్చు. మన దేశంలో ఇప్పటివరకు ఏ ప్రధాని, ముఖ్యమంత్రి ఈ అంశాన్ని చేపట్టడానికి సాహసించలేదు. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించిన ప్రకారం–2018 అవినీతి అభిప్రాయ సూచికలో మన దేశం 180 దేశాలలో 78వ స్థానంలో ఉన్నది. ఎంత అయిష్టంగా ఉన్నా, తప్పనిసరై అధికారుల చేతులు తడిపిన అనుభవం అనేకమంది ఉన్నత విద్యావంతులకు కూడా ఉన్నది. మన వంటి వర్ధమాన దేశంలో అధికార గణం ఇనుప సంకెల మాదిరిగా మార్పునకు అంగీకరించకుండా ప్రజలపై పెత్తనం చేస్తుందనేది తెలిసిందే. ఇది ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగినో, అధికారినో తప్పుపట్టడం కాదు. స్థూలంగా వ్యవస్థ స్వభావం అటువంటిది. అయినప్పటికీ సాంకేతికరంగం తెచ్చిపెట్టిన సౌలభ్యం, చట్టాలలో మార్పులు, పారదర్శకత, పాలనా సంస్కరణలు, సమర్థపాలన ఆధారంగా అవినీతి రక్కసిని మట్టుపెట్టాలనే దృఢ నిశ్చయం కేసీఆర్‌లో కనిపిస్తున్నది. కేసీఆర్ ఉన్నతస్థాయి విధాన నిర్ణయాలలో అవినీతికి తావులేకుండా చేశారనేది తెలిసిందే. కానీ మొత్తం పరిపాలనా వ్యవస్థను అవినీతి రహితం చేయడానికి ఎంతో కృషి అవసరం.

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించే పంథాపై కేసీఆర్‌కు ఎంత స్పష్టత ఉన్నదో, రాష్ట్ర సాధన తర్వాత సత్వరిపాలన, సత్వరాభివృద్ధిపై కూడా అంతే స్పష్టత ఉన్నది. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన నిర్దిష్టమైన వ్యూహం, కార్యాచరణతో కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. తాను ఎంచుకున్న కార్యక్రమం ఒక్కో అడుగు వేస్తూ తెలంగాణలో పరివర్తన తీసుకొస్తున్నారు. గత పాలకులు అరువై ఏండ్లలో సాధించలేనిది ఒక ముఖ్యమంత్రి అనేక ప్రతికూల పరిస్థితుల మధ్య ఐదేండ్ల పాలనలో చేసి చూపడం అపూర్వం.

ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు, సత్వరిపాలనకు మూడు విధానాలను ప్రకటించారు. ఇందులో ఒకటి గ్రామీణ విధానం. గ్రామీణ ప్రాంత ప్రజలను వేధిస్తున్న సమస్యలను విముక్తి కలిగించడమే ఈ విధాన లక్ష్యం. మరొకటి రెవెన్యూ విధానం. అవినీతి లేని పరిపాలనను అందించడం దీని ఉద్దేశం. మూడవది నగర విధానం. ఇదికూడా నగర ప్రాంతాలలో పటిష్టమైన పాలన అందించడంతో పాటు అవినీతిని నిర్మూలించడమే లక్ష్యంగా గలది. ఈ మూడు విధానాల ద్వారా గుణాత్మక పరిపాలనను నెలకొల్పాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నారు. చట్టాలు పటిష్టంగా రూపొందించి, అధికారులకు, ప్రజలకు అవగాహన కలిగించాలని కేసీఆర్ భావిస్తున్నారు. గ్రామీణ పాలనపై విధి విధానాలపై కేసీఆర్ చెబుతున్నందువల్ల ఇప్పటికే స్థానిక రాజకీయ వర్గాలలో స్పష్టత ఏర్పడ్డది. ప్రజలు కూడా స్థానిక పాలనకు అనుగుణంగా మానసికంగా సిద్ధపడి ఉన్నారు. మూడునెలల కాలంలోనే గ్రామీణ ప్రాంతాల్లో గుణాత్మక పరివర్తన వస్తుందని కేసీఆర్ చెప్పడం గమనార్హం. గ్రామస్థాయిలో పారదర్శకత, జవాబుదారీతనం నెలకొన్నప్పుడు పథకాల అమలు పకడ్బందీగా సాగుతుంది. సమస్యలకు పరిష్కారం కూడా లభిస్తుంది. గ్రామస్థాయిలో తర్ఫీదైన నాయకులు ఒక దశాబ్దం గడిచేనాటికి మరింత ఎదిగి రాజకీయరంగాన్ని మరింత సారవంతం చేస్తారు. ఇందులో మహిళలతో పాటు భిన్నవర్గాలకు చెందినవారు ఎదిగి సామాజిక భిన్నత్వాన్ని ప్రతిబింబిస్తారు.

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించే పంథాపై కేసీఆర్‌కు ఎంత స్పష్టత ఉన్నదో, రాష్ట్ర సాధన తర్వాత సత్వరిపాలన, సత్వరాభివృద్ధిపై కూడా అంతే స్పష్టత ఉన్నది. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన నిర్దిష్టమైన వ్యూహం, కార్యాచరణతో కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. తాను ఎంచుకున్న కార్యక్రమం ఒక్కో అడుగు వేస్తూ తెలంగాణలో పరివర్తన తీసుకొస్తున్నారు. గత పాలకులు అరువై ఏండ్లలో సాధించలేనిది ఒక ముఖ్యమంత్రి అనేక ప్రతికూల పరిస్థితుల మధ్య ఐదేండ్ల పాలనలో చేసి చూపడం అపూర్వం. సులభతర వ్యాపార విధానం ఎంత విజయవంతంగా సాగుతున్నదో మిషన్‌భగీరథ, ఉచిత కరెంటు, గ్రామీణ రహదారుల నిర్మాణం కూడా అంతే ప్రాధాన్యం పొంది అమలుకు నోచుకున్నాయి. కాళేశ్వరం తదితర నీటి ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయి. జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఈ విధంగా అన్నిరంగాలను గాడిలో పెట్టిన తర్వాత ఇప్పుడు కేసీఆర్ తదుపరి కార్యాచరణగా అవినీతి నిర్మూలనపై దృష్టిపెట్టారు. అయితే అవినీతి పరిపాలనా సంబంధమైనదే కాదు, సామాజిక సంస్కృతికి సంబంధించినది కూడా. బుద్ధుడి వంటి అనేకమంది ప్రవక్తలు, సంస్కర్తలు బోధించినా సమాజంలో విలువలు పూర్తిగా పాదుకోలేదు. వారి బోధనల వల్లనే సమాజం ఈ మాత్రం ధర్మబద్ధంగా ఉందనేది అంగీకరించలసిందే. కానీ సమాజంలో నిరంతర సంస్కరణలు అవసరం. మానవులలో ధర్మబద్ధత అంతరంగం నుంచి కూడా రావాలె. కేసీఆర్ అవినీతి రహిత పాలనకు అవసరమైన ప్రాతిపదికను నెలకొల్పుతారు. ప్రజలు ప్రత్యేకించి విద్యావంతులు చైతన్యవంతులై కేసీఆర్ పిలుపును స్వీకరించాలె. అవినీతి నిర్మూలన కోసం తమవంతు కృషి చేయాలె.

జనగళం

బీసీసీఐ మేల్కోవాలె

మూడోసారి ప్రపంచకప్‌ను ముద్దాడాలనుకున్న భారత క్రికెట్ జట్టు కలలు సెమీస్‌లోనే ఆవిరైపోయాయి. ఈసారి ఎలాగైనా ప్రపంచకప్ గెలిచితీరుతామని ఆడంబర ప్రకటనలు చేసిన క్రికెటర్లు పసికూనలైన న్యూజీలాండ్ చేతిలో ఘోర పరాజయం పొందడం కోట్లాది భారత క్రికెట్ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. లీగ్ స్థాయిలో ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ చేతిలో చావు తప్పి కన్ను లొట్టబోయిన చందాన గెలిచిన భారత జట్టుకు నిపుణులు అప్పుడే ప్రమాద ఘంటికలు మోగించినా దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. జట్టు నాయకుడు కోహ్లీతో పాటు మేనేజ్‌మెంట్ కూడా తీవ్ర నిర్లక్ష్యం వహించింది. సెమీస్‌లో న్యూజిలాండ్‌తో తుదిజట్టు కూర్పులో షమీని తీసుకోకపోవడం, వరుసగా విఫలమౌతున్న చాహల్, దినేశ్ కార్తీక్‌ల తీసుకోవడమే పెద్ద తప్పు. ఇక న్యూజీలాండ్‌ను 240 పరుగులకే కట్టుదిట్టం చేసినా అనిశ్చితిగా ఉన్న పిచ్‌పై టాప్ ఆర్డర్ బ్యాట్‌మెన్లు నిర్లక్ష్యంగా ఆడారు. బలవంతంగా 221 పరుగులు చేసి ఇంకా మూడు బంతులు మిగిలి ఉండగానే ఆలౌట్ కావడం పట్ల ప్రతి భారత అభిమాని నిరుత్సాహానికి గురయ్యాడు. అంతకుముందు మ్యాచ్‌లో సెంచరీ సాధించిన కె.ఎల్.రాహుల్‌లో ఆత్మవిశ్వాసం అనేది మచ్చుకైనా కనిపించలేదు. టాప్ ఆర్డర్ విఫలమైనప్పుడు మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్‌లు మ్యాచ్ చేతుల్లోకి తీసుకోవాలి, కానీ మొన్నటి మ్యాచ్‌లో అది జరుగలేదు. నాలుగు వికెట్లు పడ్డాక ఎక్కువసేపు ఆడి పరుగులు రాబట్టగల ధోనీకి బదులు రిషబ్‌పంత్‌ను పంపడం కూడా మరొక పెద్ద తప్పు. ముఖ్యమైన పోటీలో ఇటువంటి వ్యూహాత్మక తప్పిదాలను చేయడంపై జట్టు సారథి విరాట్ కోహ్లీనే పూర్తి బాధ్యత వహించాలి. ప్రపంచకప్ ముందు ముఖ్యమైన ఆటగాళ్ళు ఐపీఎల్‌లో ఆడటం మంచిదికాదని అనేకమంది మాజీ ఆటగాళ్లు హెచ్చరించినా బీసీసీఐ పట్టించుకోలేదు. కాసుల వేటలో సర్వశక్తులు ధారపోసిన మన ఘనమైన ఆటగాళ్లు ప్రపంచకప్ పోటీకి వచ్చేసరికి నీరుగారిపోయారు. పెద్ద పోటీలలో ఆత్మస్థైర్యం, పోరాడే తత్వం మొదటినుంచి కనబరుచకపోయారు. ఓటమిపై స్పందిస్తూ విరాట్ కోహ్లీ కాలం కలిసిరాలేదని చిన్నపిల్లాడిలా మాట్లాడటం అతని బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తున్నది. ఇప్పటికైనా బీసీసీఐ మేల్కోవాలి.

- సి.సాయిప్రతాప్, ఏఎస్‌రావునగర్, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

జాతీయం

నరేశ్‌చంద్ర సక్సేనా

మహిళల హక్కులు మరిచారు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మహిళల సాధికారత కోసం ప్రత్యేక పథకాలను ప్రకటించాల్సిన అవసరం ఉన్నది. భూ రికార్డుల్లో మహిల పేరును నమోదు చేసేవిధంగా ప్రత్యేక చట్టం ద్వారా సరిచేయాల్సిన ఆవశ్యకత ఉన్నది. మహిళల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక కృషి జరుగాల్సి ఉన్నది. గ్రామం, తహసీల్ స్థాయిలో మహిళలకు ప్రాధాన్యం గురించి చైతన్యపరుచాలి

గ్రామీణ భారతంలో ఆదాయ సముపార్జనకు భూమి, చేయటానికి పని ఉండటమనేది ప్రధానం. ఈ విషయంలో మన పాలక ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకొని ఆలోచించిన దాఖలాలు కనిపించటం లేదు. కానీ వ్యవసాయోత్పత్తుల్లో మహిళలదే కీలక పాత్ర ఉంటున్నది. ఎందుకంటే గత రెండు దశాబ్దాల కాలంగా వ్యవసాయరంగంలో కరవు పరిస్థితుల కారణంగా నెలకొన్న సంక్షోభంతో పురుషులు వ్యవసాయేతర పనులకు మారిపోవటం కారణంగా వ్యవసాయమంతా మహిళలపైనే ఆధారపడి ఉంటున్నది. ఈ పరిస్థితులన్నీ వ్యవసాయరంగాన్ని మరింత సంక్షోభ పరిస్థితుల్లోకి నెట్టివేసింది. ఇంకోవైపు వ్యవసాయంలో చేపడుతున్న యాంత్రీకరణ కారణంగా నానాటికీ మహిళలకు గ్రామాల్లో పని దొరుకని స్థితి ఏర్పడుతున్నది. వ్యవసాయం నుంచి దూరమైన మహిళకు మరో పని ఎంచుకునే స్థితి గ్రామాల్లో ఉండదు. పట్టణాల్లో కూడా అన్నిరంగాల్లో పురుషులకే పెద్దపీట ఉంటున్నది. దీంతో గ్రామీణ భారతంలో రోజురోజుకూ మహిళకు పనిదొరుకని పరిస్థితి ఏర్పడటం మరో సంక్షోభానికి దారితీస్తున్నది.

పితృస్వామ్య సామాజిక విలువల కారణంగా భూమిపై యాజమాన్య హక్కులన్నీ పురుషుల చేతుల్లోనే ఉన్నవి. బీనా అగర్వాల్ చేసిన అధ్యయనం ప్రకారం.. దేశంలో 2–5 శాతం వ్యవసాయ యోగ్య భూమి మాత్రమే మహిళల చేతుల్లో ఉన్నది. అంటే ఆ భూమిపై మహిళలు హక్కు కలిగి ఉన్నారు. ఈ విధమైన సామాజిక పరిస్థితుల మూలంగా భూమి మాత్రమే కాదు, కుటుంబాలు కలిగి ఉండే ఇల్లు, ఇతర ఆదాయ వనరులపై ఎలాంటి హక్కు మహిళలకు లేదు. దీంతో ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో గుణాత్మక మార్పు ఉండటం లేదు. వ్యవసాయ సంబంధమైన భూమితో పాటు, ఇతర వ్యవసాయ వినియోగ పరికరాలు, ట్రాక్టర్లు, యంత్రాలన్నింటిపై మహిళలకు ఏ విధమైన యాజమాన్య హక్కు ఉండటం లేదు. ఫలితంగా వ్యవసాయరంగంలో వస్తున్న అభివృద్ధి, సాంకేతికరంగాల్లో మహిళలకు స్థానం, పాత్ర ఉండటం లేదు. మరోవైపు పెరుగుతున్న వ్యవసాయోత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం ఉండటం లేదు. దీంతో మహిళల సాధికారత అటుంచి అనేక విధాలుగా మహిళ పరాధీనురాలిగానే ఉంటున్నది. మహిళలపై గృహహింస, అణిచివేతలు సాధారణమైపోయాయి. ఈ క్రమంలోంచే వ్యవసాయరంగంలో మహిళల నిర్ణయాత్మక పాత్రకు గుర్తింపు లేకపోవటమే కాదు, వివక్షకు గురవుతున్నది. వ్యవసాయరంగంలో మహిళలదే అగ్రస్థానమైనా మహిళల శ్రమకు విలువ ఉండటం లేదు. కాలానుగుణంగా దినకూలీ వేతనాలు ఉండటం లేదు. ఈ విధమైన సామాజిక దోపిడీ, అణిచివేత, వివక్షల కారణంగా భ్రూణహత్యలు చోటుచేసుకుంటున్నాయి. ఏదేమైనా.. భూమిపై యాజమాన్య హక్కులు కల్పించకుండా మహిళలకు గుర్తింపు, గౌరవం దక్కడం లేదు. ఈ మూలాల్లోంచే వ్యవసాయ కో–ఆపరేటివ్ సొసైటీలు, ఇతర వ్యవసాయ సంబంధ సంఘాల్లో మహిళలకు ప్రాతినిధ్యం దక్కటం లేదు.

1956కు మందు భూమి, ఇతరాలపై ఆ సమాజంలో పరంపరాగతంగా వస్తున్న వంశపారంపర్య హక్కులే ఆ కుటుంబ వ్యక్తులకు సంక్రమించేవి. అలాగే మహిళలకు సమాన హక్కులని చెప్పబడుతుండేవి. హిందూ వారసత్వ హక్కు చట్టం కూడా ఇదే చెప్పింది. ఈ మూలాల్లోంచే హిందూవారసత్వ హక్కు చట్టం 1956 వచ్చింది. ఇందులో వారసత్వ హక్కు అని చెప్పారు కానీ స్పష్టత లేదు. 1950 తర్వాత భారత దేశంలో చోటుచేసుకున్న భూ వారసత్వ హక్కులో స్త్రీ, పురుషులకు సమాన హక్కు అని పేర్కొనకపోవటం వల్ల సమానత్వం నామ మాత్రం అయిపోయింది. ఈ విషయాన్ని నాటి మహిళా హక్కుల సంఘాలు కూడా గుర్తించి ప్రశ్నించిన పరిస్థితి లేదు. అందుకోసం ప్రభుత్వ విధానాలు, చేపట్టిన సంస్కరణల్లో మహిళలకు స్థానం కనిష్టంగా మారిపోయింది. అలాగే భూ హక్కులనేవి ప్రధాన సమస్య కాకుండా పోయింది. ఈ నేపథ్యంలో జాతీయ సలహా మండలి సభ్యునిగా నేను సోనియాగాంధీకి మహిళలకు భూమిపై హక్కులు కల్పించాల్సిన అవసరాన్ని గురించి వివరించాను. నేను చెప్పిన విషయంతో నోట్‌ను తయారుచేసి కేంద్ర 'లా మినిస్ట్రీ'కి పంపించారు. తత్ఫలితంగానే హిందూ వారసత్వ హక్కు చట్టం 2005లో మార్పులు చోటుచేసుకున్నాయి. వివక్షకు పునాదిగా ఉన్న వాటిని ఆ చట్టం నుంచి తొలిగించారు. ఇది హిందువులతో పాటు, సిక్కులు, బౌద్ధులు, జైనులకు కూడా వర్తిస్తుంది. దీంతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన హక్కులు భూమిపై సంక్రమించాయి.

ఈ చట్టంతో దేశవ్యాప్తంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాదిమంది మహిళలు ప్రయోజనం పొందగలుగుతారు. కానీ ఆ చట్టం అమలుచేయటం గురించి కేంద్ర భూ వనరుల శాఖ కానీ, కేంద్ర శిశుసంక్షేమ శాఖ కానీ రాష్ట్రాలకు ఎలాంటి లేఖ రాయలేదు. దీనికి తోడు రాష్ట్రాలు కూడా ఈ చట్టం అమలు విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చూపాయి. ఇదిలా ఉండగానే యూపీలో కుటుంబంలోని అవివాహిత మహిళలు, బిడ్డలకు మాత్రమే భూమిపై వారసత్వ హక్కు ఉంటుందనీ, వివాహితులైతే ఆ హక్కు వర్తించదని మరో చట్టం చేసింది. నిజానికి కేంద్రం చేసిన చట్ట స్ఫూర్తికి ఇది విరుద్ధమైనది. ఎవరో ఒకరు కోర్టుకు పోయి ఈ చట్టవిరుద్ధమైన దాన్ని వెనక్కి తీసుకునే విధంగా చేస్తారని ఆశిద్దాం. ఇక రాజస్థాన్‌లో చేసిన చట్టంలో సెక్షన్ 46(1) అనేది మహిళలను కనీసం మనుషులుగా, వ్యక్తిత్వం కలవారిగా గుర్తించ నిరాకరించిన విధంగా వ్యక్తపరిచింది. అయినా స్థూలంగా, చట్టపరంగా మహిళలకు అనుకూలంగా చట్టపరమైన హక్కులకు సమర్థన వచ్చింది. కానీ చాలా సందర్భాల్లో మహిళలకు వివాహ సంబంధమైన సమస్యలు తలెత్తినప్పుడు, లేదా విడిపోయినప్పుడు తల్లిగారి ఇంటివైపు నుంచి సమర్థన, సహాయం కూడా అందటం లేదు. చాలా సందర్భాల్లో ఇరువైపుల నుంచీ మద్దతు లభించని స్థితి ఉంటున్నది.

ఇదిలా ఉంటే న్యాయసమ్మతంగా హక్కుదారులుగా భూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయటంలో కూడా అనేక విధాలుగా అవరోధాలు ఎదుర్కొంటున్నారు. చాలా సందర్భాల్లో హక్కుదారుగా పేరున్నా వాస్తవ రూపంలో వారికి దానిపై మహిళలకు యాజమాన్య హక్కును చెలాయించలేని స్థితి ఉంటున్నది. ఇంకా పితృస్వామిక సమాజంలోనైతే ఈ విధమైన హక్కులు మృగ్యం. మాతృస్వామ్య సామాజిక విలువలున్న మేఘాలయలోనూ స్త్రీలకు ఏ విధమైన హక్కులుండటం లేదు. ఇక ఆధునిక కార్పొరేట్ సంస్కృతి, మార్కెట్ వ్యవస్థల్లోనూ సర్వత్రా పురుషులదే ఆధిపత్యం, పెత్తనం. అమ్మకాలు, కొనుగోళ్లు, అప్పులు తీసుకోవటంలోనూ మహిళల పాత్ర నామమాత్రం. సర్వత్రా పరాధీనతలో పనిచేయాల్సిన దుస్థితి ఉంటున్నది. వివక్ష, అణిచివేతల్లో రూపం వేరైనా మహిళల స్థానం మాత్రం కడగొట్టుదిగానే ఉంటున్నది.

ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మహిళల సాధికారత కోసం ప్రత్యేక పథకాలను ప్రకటించాల్సిన అవసరం ఉన్నది. భూ రికార్డుల్లో మహిల పేరును నమోదు చేసేవిధంగా ప్రత్యేక చట్టం ద్వారా సరిచేయాల్సిన ఆవశ్యకత ఉన్నది. మహిళల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక కృషి జరుగాల్సి ఉన్నది. గ్రామం, తహసీల్ స్థాయిలో మహిళలకు ప్రాధాన్యం గురించి చైతన్యపరుచాలి. తద్వారా అన్నిరంగాల్లో పితృస్వామిక భావజాలంతో నిండి ఉన్న స్థితిని మహిళలకు సానుకూలంగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

మహిళలు పనిచేస్తున్నచోట మహిళలకు అనుకూలంగా ప్రత్యేక వసతులుండటం లేదు. దేశవ్యాప్తంగా చేసిన అధ్యయనం ప్రకారం 5 వేల మార్కెట్లలో మహిళలకు కనీస వసతులు లేవు. ఈ స్థితిలో కేంద్ర ఆర్థికమంత్రి ప్రత్యేక చొరవతో 2024 నాటికి కనీసం 30 శాతం భూ రికార్డులు మహిళల పేరుతో ఉండేట్లు చర్యలు తీసుకోవాలి.

మరోవైపు మహిళలు పనిచేస్తున్నచోట మహిళలకు అనుకూలంగా ప్రత్యేక వసతులుండటం లేదు. దేశవ్యాప్తంగా చేసిన అధ్యయనం ప్రకారం 5 వేల మార్కెట్లలో మహిళలకు కనీస వసతులు లేవు. ఈ స్థితిలో కేంద్ర ఆర్థికమంత్రి ప్రత్యేక చొరవతో 2024 నాటికి కనీసం 30 శాతం భూ రికార్డులు మహిళల పేరుతో ఉండేట్లు చర్యలు తీసుకోవాలి. మహిళలకు భూమిపై హక్కులు కల్పించేవిధంగా సమాజంలో చైతన్యం తేవటానికి కరపత్రాలు, మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలి.

ఇప్పుడు అధికారం, ఆధిపత్యం పంపకం జరుగటంతో పాటు ఆదాయ పంపకం కూడా జరుగాలి. ఇలా జరిగినప్పుడే సామాజిక అంతరాలు, వివక్షలు రూపుమాసిపోతాయి. భూమి మొదలు సమస్త స్థిర, చర ఆస్తులపై మహిళలకు కూడా హక్కు, యాజమాన్యం లభించినప్పుడే మహిళాసాధికారత సాధ్యమవుతుంది. ఈ విధమైన సంస్కరణలకు అంకురార్పణ జరిగినప్పుడే మహిళా సంక్షేమం, అభ్యున్నతికి అవకాశం ఉంటుంది. ఇలాంటి మౌలిక విషయాలు, సమస్యల పట్ల ఆర్థిక మంత్రి దృష్టి సారించినప్పుడే మహిళల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

(వ్యాసకర్త: ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యులు) 'ది వైర్' సౌజన్యంతో...

జాతీయ బీసీ కమిషన్ కర్తవ్యాలు

విశ్లేషణ

బి.ఎస్.రాములు

102వ రాజ్యాంగ సవరణతో జాతీయ బీసీ కమిషన్, జాతీయ ఎస్సీ కమిషన్ వలె పూర్తిస్థాయి రాజ్యాంగ ప్రతిపత్తికి నోచుకున్నది. తమ పరిధిలోని విషయాల్లో జాతీయ బీసీ, ఎస్సీ కమిషన్ ఎన్నో కర్తవ్యాలు నిర్వహించాల్సి ఉన్నది. సమస్త రంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సామాజిక న్యాయం, సమానావకాశాలు, రాజ్యాంగ మౌలిక లక్ష్యాలు నిర్దేశిత రిజర్వేషన్లు, అవకాశాలు అందుతున్నాయో లేదో పర్యవేక్షిస్తూ, ఆ లక్ష్యాలను పూర్తిచేయాల్సిన బాధ్యత ఈ కమిషన్‌పై ఉన్నది. అందుకు రాజ్యాంగం కల్పించిన అధికారాలను విస్తృతంగా ఉపయోగించుకున్నప్పుడే ఇది సాధ్యపడుతుంది.

రాజ్యాంగ సవరణ కన్నా ముందే తెలంగాణ సీఎం కేసీఆర్ తెలంగాణ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన హోదా కల్పిస్తూ చట్టసవరణ చేశారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రమైనప్పటికీ దేశానికి ఆదర్శంగా వందలాది అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పారిశ్రామిక అభివృద్ధి, కులవృత్తుల ఆధునీకరణతో సగటు ఆదాయం పెరిగి ప్రభుత్వ ఆదాయం పెరుగుతూ వస్తున్నది. కేసీఆర్ ప్రవేశపెట్టిన దేశానికే ఆదర్శంగా నిలిచిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఓవర్సీస్ విదేశీ చదువులకు రెండేండ్ల పాటు ఆర్థికసాయం ఎంతో ప్రాధాన్యమైనవి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ప్రజాస్వామిక హక్కులతో పాటు భారత రాజ్యాంగంలోని 15, 16, 31బీ, 46, 330, 338, 338 ఏ, 338బీ, 339, 340, 341, 342 ఆర్టికల్స్ ప్రధానమైనవి. ఇవి బీసీ, ఎస్సీ, ఎస్టీలను ప్రత్యేక శ్రద్ధతో సమస్థరంగాల్లో అభివృద్ధి పర్చడానికి రాజ్యాంగంలో చేర్చబడ్డాయి. గ్రామీణ స్థాయి దాకా ఈ ఆర్టికల్స్ పట్ల, ప్రజాస్వామిక హక్కుల పట్ల అవగాహన కలిగించే చిన్నచిన్న పుస్తకాలను ప్రాంతీయ భాషల్లో ప్రచురించి కోట్లాది ప్రజలకు చేరేటట్టు చేయడం అవసరం.

దేశంలోని అన్ని విద్యాసంస్థల్లో ప్రైవేటు, ప్రభుత్వ, కేంద్ర, రాష్ట్ర విద్యా సంస్థల్లో, ఉద్యోగ రంగాల్లో, పారిశ్రామిక, ఆర్థిక, వ్యాపారరంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల దామాషా ఏ మేరకు ఉందో ఆరు నెలలకు ఓ సారి లెక్కలు తీయడం అవసరం. బీసీ, ఎస్సీ, ఎస్టీలు కూడా 50 శాతం రిజర్వేషన్లు అమలు జరుపడానికి ఎప్పటికప్పుడు ఈ వివరాలను అన్నిశాఖల నుంచి తెప్పించడం, ఖాళీలను రోస్టర్ ప్రకారంగా భర్తీ చేయడం గురించి ఆదేశాలు జారీచేయడం అవసరం. జాతీయ బీసీ కమిషన్, ఎస్సీ కమిషన్ రిజర్వేషన్ల గురించి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినప్పుడే 50 శాతం మేరకు రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తాయి. ఓపెన్ కాంపిటీషన్‌లో, జనరల్ కేటగిరిలో 7–11 శాతం దాకా బీసీ, ఎస్సీ, ఎస్టీలు సాధించగలుగుతున్నారు. కనుక వాటిని జనరల్ కేటగిరిలో నింపేటట్టు చూసి 50 శాతం రిజర్వేషన్లు అమలయ్యేట్టు చూస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీలు 57–61 శాతం దాకా విద్యా, ఉద్యోగ, పారిశ్రామిక, వ్యాపార, రాజకీయరంగాల్లో ఎదుగుతారు. యాభై శాతం రిజర్వేషన్ల కోసం జాతీయస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ప్ర

ప్రైవేట్ ఉద్యోగుల సంఘం నాయకులకు గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో టీఆర్ఎస్ సభ్యత్వాలను అందజేస్తున్న ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

మేడ్చల్ జిల్లా ఘీర్జాబిగూడలో మహిళకు సభ్యత్వాన్ని అందజేస్తున్న కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న సభ్యత్వం వివరాలను పరిశీలిస్తున్న నియోజకవర్గ ఇంచార్జి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

లక్ష్యం దిశగా సభ్యత్వాలు

టీఆర్ఎస్ సభ్యత్వాలకు విశేష స్పందన

పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా జోరందుకున్నది. పార్టీ నాయకులు, కార్యకర్తలు వాడవాడలా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, ఇతర నాయకులు పెద్దఎత్తున పాల్గొంటున్నారు. సభ్యత్వ నమోదులో లక్ష్య సాధన దిశగా సాగుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకు శాంతిభూషణ్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి వేముల భాస్కర్ గురువారం హైదరాబాద్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతులమీదుగా టీఆర్ఎస్ సభ్యత్వాలు తీసుకున్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఉద్యోగులు టీఆర్ఎస్ సభ్యత్వ నమోదులో మరింత చురుగ్గా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు, ప్రభరెడ్డి, ఎల్లాగౌడ్, టీఆర్ఎస్ జిల్లా నాయకులు వెంకటయ్య, సాయిలు, షకీల్ పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లా ఉప్పల్ డిపో వద్ద జరిగిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదులో కార్మిక మంత్రి చామకూర మల్లారెడ్డి పలువురికి సభ్యత్వాలను అందజేశారు. దేశంలోనే నంబర్‌వన్ సీఎంగా కేసీఆర్ నిలిస్తే తెలంగాణలో టీఆర్ఎస్ నంబర్‌వన్ పార్టీగా నిలిచిందని మల్లారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలను లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 90వేల నమోదైనట్టు చెప్పారు.

పాలమూరులో..

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం అల్వాన్‌పల్లి, కుర్వగడ్డపల్లితోపాటు మిడ్జిల్ మండలం కంచనపల్లిలో జడ్చర్ల, షాద్‌నగర్ ఇంచార్జి చాడ కిషన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి టీఆర్ఎస్ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో పూర్తి చేసిన సభ్యత్వ నమోదు ఆన్‌లైన్ కేంద్రాన్ని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. సభ్యత్వ నమోదు వివరాలను ఆన్‌లైన్‌లో క్రోడీకరించే వివరాలను ఆయన పరిశీలించారు.

ఖమ్మంలో..

ఖమ్మం నగరంలోని 33వ డివిజన్‌లో ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ కార్యకర్తలకు క్రియాశీల సభ్యత్వాలను అందజేశారు. తిరుమలాయపాలెం మండలంలో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, బోనకల్లు మండలంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాలు అందజేశారు. సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లోనూ సభ్యత్వ నమోదు ప్రక్రియలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని 6వ వార్డులో పలువురికి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సభ్యత్వాలను అందజేశారు. భద్రాచలం పట్టణంలో నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జి తెల్లం వెంకట్రావ్ సభ్యత్వ నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి సభ్యత్వాలు అందజేశారు. కరీంనగర్‌లోని 22వ డివిజన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు. గంగాధర మండలం బూర్గుపల్లిలో రామడుగు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చేతులమీదుగా సభ్యత్వ రసీదులు అందుకున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం కంచనపల్లిలో సభ్యత్వాలను అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి. చిత్రంలో నియోజకవర్గ ఇంచార్జి చాడ కిషన్‌రెడ్డి

వరంగల్‌లో..

వరంగల్ నగరంలోని పలు డివిజన్లలో గురువారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో రైతుల తోపాటు అడ్డి, ఖరీదు వ్యాపారులు, వివిధ కార్మిక వర్గాలకు పార్టీ సభ్యత్వం అందజేశారు. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలో జరిగిన సభ్యత్వ నమోదులో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పాల్గొని పలువురికి సభ్యత్వాలు అందజేశారు. గ్రామంలో ముందుగా పొట్లపల్లి కృష్ణారావుకు సభ్యత్వం అందజేసి పార్టీలోకి ఆహ్వానించారు. ములుగు జిల్లా పత్తిపల్లి, పొట్లాపురం, అబ్బాపురం, ములుగులో జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ పాల్గొన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహించిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. టీఆర్ఎస్‌కు పోటీ లేదని, సభ్యత్వ నమోదుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఉప్పల నర్సింలు గుప్తా, కోశాధికారి పబ్బ చంద్రశేఖర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సంతోష పాల్గొన్నారు.

ఖమ్మం నగరంలో టీఆర్ఎస్ కార్యకర్తలకు క్రియాశీల సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్

కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చేతుల మీదుగా పార్టీ సభ్యత్వం తీసుకొంటున్న రామడుగు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు

వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో చాంబర్ అధ్యక్షుడు బిడ్డి కుమారస్వామికి సభ్యత్వమిస్తున్న ఎమ్మెల్యే నన్నపునేని

వరంగల్ అర్బన్ జిల్లా పెద్దపెండ్యాలలో పొట్లపల్లి కృష్ణారావుకు సభ్యత్వమిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో సభ్యత్వం అందజేస్తున్న రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి

ములుగు జిల్లా పత్తిపల్లిలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ జగదీశ్వర్

మెదక్ జిల్లా తూప్రాన్‌లో టీఆర్ఎస్ సభ్యత్వాలు అందజేస్తున్న అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నేడు భద్రాచలంలో తొలి ఏకాదశి వేడుకలు

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి తొలి ఏకాదశి పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకుడు పొడిచేటి జగన్నాథాచార్యులు తెలిపారు. ఉదయం స్వామివారికి అంతరాలయంలో మూల మూర్తులకు వజ్రవైడూర్య మరకత మాణిక్యాలతో, బెంగుళూరు వారు స్వామివారికి సమర్పించిన రూ.5 కోట్ల విలువ చేసే బంగారు కవచాలతో ఉత్సవ మూర్తులకు అంతరాయలంలో ఏకాంత తిరుమంజనం గావిస్తారు. తదుపరి ఉపాలయంలో శ్రీలక్ష్మీతాయారు అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రాకార మండపంలో 108 మందితో విష్ణు సహస్ర నామ పారాయణం, 5 గంటలకు ఆరాధన, 6 గంటలకు సంధ్యా హారతులు, 7 గంటలకు రాజదర్బార్, 8 గంటలకు తిరువీధిసేవ, 9 గంటలకు చుట్టుసేవ, 10 గంటలకు ఆరాధన, ఆరగింపు నిర్వహించనున్నట్లు వివరించారు. గురువారం శ్రీకృష్ణచైతన్య సంఘం ఆధ్వర్యంలో భక్తులు గోటి తలంబ్రాల కోసం కొత్త వరి ధాన్యాల విత్తనాలకు ప్రత్యేక పూజలు చేశారు.

మండలాల పరిధి మార్పు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని మల్లాపూర్, ధర్మసాగర్ గ్రామాలను ఇంద్రవెల్లి మండలానికి మారుస్తూ ప్రభుత్వం తుది నోటిఫికేషన్ విడుదల చేస్తూ ఉత్వర్వులు జారీ చేసింది.

నేటి నుంచి రాష్ట్రస్థాయి కంటి వైద్య సదస్సు

కరీంనగర్ హెల్త్: రాష్ట్ర కంటి వైద్యుల ఐదో రాష్ట్రస్థాయి సదస్సును కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో నిర్వహించనున్నట్లు కరీంనగర్ ఆప్తాల్మాజికల్ అసోసియేషన్ కాన్సర్సెస్ సెక్రెటరీ డాక్టర్ పీ శ్రీధర్ తెలిపారు. గురువారం కరీంనగర్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగే సదస్సులో 650 మంది కంటి వైద్యులు పాల్గొంటారన్నారు. సమావేశంలో సీనియర్ వైద్యులు జగన్‌మోహన్ రావు, రవీంద్ర, వెంకట్‌రెడ్డి, ప్రవీన్, రామకృష్ణ, రఘు పాల్గొన్నారు.

సంచార కులాలపై అధ్యయనం

రెండోరోజూ కొనసాగిన బీసీ కమిషన్ క్షేత్ర పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన సంచార కులాలను బీసీ జాబితాలో చేర్చాలని వచ్చిన ప్రతిపాదనల మేరకు సంచార కులాల జీవనం, స్థితిగతుల వివరాలను తెలుసుకునేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ చేపట్టిన క్షేత్రస్థాయి విచారణ రెండోరోజైన గురువారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు హైదరాబాద్‌లోని ఉస్మాన్‌షాహీ, బేగంబజార్, మంగల్‌హాట్‌లో పర్యటించారు. అహిర్‌యాదవ కులానికి చెందిన కుటుంబాలను కలిసి సమగ్ర వివరాలను సేకరించారు. బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వేంపేట, మేడిపల్లి గ్రామాల్లో పర్యటించి బాగోతుల కులస్థుల జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వేంపేటలో దయనీయ స్థితిలో ఉన్న ఓ వృద్ధుడికి ఆర్థిక సాయం చేశారు. అలాగే మల్లాపూర్ మండలం ముత్యంపేటలో గౌడజెట్టి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారందించిన సమాచారం ఆధారంగా ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని వెల్లడించారు. బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో పర్యటించారు. సూర్యాపేట కుడకుడ రోడ్డులో నివసిస్తున్న బ్రటి కమ్మరి కుటుంబాల స్థితిగతులను తెలుసుకున్నారు. తిరుమలగిరి మండలం మామిడాల, నాగారం మండలం వర్ధమానుకోటలో తెల్సూరి గొల్ల కులస్థులతో మాట్లాడారు. తొర్రూరు మండలం పోలెపల్లి, చీకటాయపాలెం గ్రామాల్లో తెరచీరల కులానికి చెందిన కుటుంబాల జీవన విధానం, వారి సాంస్కృతిక నేపథ్యం, వంటి వివరాలను సేకరించారు. సిద్ధిపేట జిల్లాలోని నాలుగు మండలాల్లో అధికారులతో కలిసి బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయగౌడ్ పర్యటించారు. సంచార జాతికి చెందిన కాకిపడగల కులస్థుల జీవన స్థితిగతులను తెలుసుకున్నారు.

హైదరాబాద్‌లో మహిళతో మాట్లాడుతున్న బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు

జగిత్యాల జిల్లా ముత్యంపేటలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్

సూర్యాపేట జిల్లా మామిడాలలో సంచార జాతులపై అధ్యయనం చేస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరి గౌరీశంకర్

సిద్దిపేట జిల్లాలో సంచార జాతుల వారితో మాట్లాడుతున్న బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయగౌడ్

లైంగిక దాడి కేసుల్లో ఇద్దరికి జీవిత ఖైదు

ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ/కరీంనగర్ లీగల్: అత్యాచారం, లైంగికదాడియత్నం కేసుల్లో ఇద్దరు నిందితులకు జీవితఖైదు పడింది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ గుండివాగుకు చెందిన గిరిజన మహిళపై షేక్‌ఇసా లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలు ఫిర్యాదుతో ఇచ్చోడ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం ప్రత్యేక పీపీ రమణారెడ్డి కేసు రుజువు చేయగా, ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి జీవిత ఖైదుతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కరీంన గర్ జిల్లా రామడుగు ప్రేమ పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి అత్యాచారం చేసిన నేరంలో నిందితుడు మచ్చ అజయ్(20)కు జీవిత ఖైదు, రూ.40 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం తీర్పునిచ్చారు.

తుపాకుల సరఫరా ముఠా అరెస్టు

వరంగల్ క్రైం: తుపాకులు సరఫరా చేస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను వరంగల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీపీ రవీందర్ కథనం ప్రకారం.. న్యూడెమోక్రసీ పార్టీ సానుభూతిపరుడు జన్ను కోటి, ప్రజా ప్రతిఘటన పార్టీలో పని చేసిన వాయినాల రవిలు సంతోష్‌తో కలిసి ఉత్తరాది రాష్ట్రాల్లో తుపాకులు కొనుగొలు చేసి ఎక్కువ ధరకు అమ్మాలని పథకం రచించారు. ఈ క్రమంలో గతంలో న్యూడెమోక్రసీలో పని చేసిన అబ్బర్ల రాజయ్య, మొగిలి ప్రతాప్‌రెడ్డి తుపాకులతో బెదిరించి డబ్బులు వసూలు చేయాలని జన్ను కోటితో ఒప్పందం కుదుర్చుకున్నారు. మధ్యప్రదేశ్‌లో కోటి, సంతోష్, రవి, మల్లికార్జున్‌లు 9 ఎంఎం పిస్తోల్ కొనుగోలు చేసి గురువారం ప్రతాప్‌రెడ్డి, రాజయ్యలకు దానిని ఇవ్వడానికి గిర్నిబావికి రాగా పోలీసులు అదుపులోకి తీసుకుని 9 ఎంఎం పిస్తోల్, రెండు బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల సమాచారంతో మరో నిందితుడు మల్లికార్జున్‌ను కొమ్మాలలో అదుపులోకి తీసుకుని ఆయన నుంచి మరో 9 ఎంఎం పిస్తోల్, 4 బుల్లెట్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు సీపీ వెల్లడించారు.

బాసర ట్రిపుల్ ఐటీ

అసిస్టెంట్ ప్రొఫెసర్ అరెస్టు

ఏ1 నిందితుడు రవి వరాలపై నిర్భయ, ఫోక్సో కేసు నమోదు

సహకరించిన మరో ఇద్దరు అరెస్టు

బాసర: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో కలకలం రేపిన కీచక అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి వరాలను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం బాసర పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ శశిధర్ రాజు మీడియాకు వివరాలను వెల్లడించారు. కళాశాలలో 2011లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కెమిస్ట్రీ విభాగంలో హెచ్‌వోడీగా రవి వరాల కాంట్రాక్టు పద్ధతిలో ఎంపికయ్యాడు. ఆయన కన్నా తక్కువ చదివిన (పీజీ) వారికి సమాన వేతనం ఉండటంతో డబ్బులకు ఆశ పడ్డాడు. డబ్బులు ఎలాగైనా సంపాదించాలనే కక్కుర్తితో పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను టార్గెట్ చేశాడు. పరీక్ష రాసిన విద్యార్థులు ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయితే, మళ్లీ ఒక నెల రోజుల్లో పరీక్ష రాసే అవకాశం ఇచ్చాడు. విద్యార్థులు రాసిన సమాధాన పత్రాలు పరీక్ష అనంతరం వాల్యూయేషన్ ఇంచార్జి విశ్వనాథ్ వద్దకు వెళ్తుంటాయి. విశ్వనాథ్‌కు సైతం సరైన వేతనం లేకపోవడంతో రవి వరాల డబ్బుల ఆశ చూపి విద్యార్థుల సమాధాన పత్రాలను ఎవరికి తెలియకుండా తీసుకొని ఇంటికి తీసుకెళ్లేవాడు. రవి వరాల, విశ్వనాథ్‌కు మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధాకర్ కూడా సహకరించేవాడు. రవి వరాల సంబంధిత విద్యార్థులను నిజామాబాద్‌లోని తన ఇంటికి పిలిపించుకొని ఒక్కో సబ్జెక్టుకు రూ.15వేలు తీసుకునే వాడు. ఇలా దాదాపు రూ. 5 లక్షల వరకు డబ్బు సంపాదించాడు. రవి వరాలపై విచారణ జరిపిన పోలీసులు కఠిన కేసులు నమోదు చేశారు. నిర్భయతో పాటు ఫోక్సో కింద కేసు నమోదు చేసి ఏ-1 నిందితుడిగా గుర్తించారు. అతనికి సహకరించిన విశ్వనాథ్‌ను ఏ-2గా, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధాకర్‌ను ఏ-3గా కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ శశిధర్‌రాజు తెలిపారు. విశ్వనాథ్, సుధాకర్‌ను విధుల నుంచి తొలగించినట్టు కళాశాల అధికారులు తెలిపారు.

ఇల్లు నిలబెట్టిన కొలువు

మొదట కల్యాణలక్ష్మి.. కేసీఆర్ కిట్.. ఇప్పుడు టీచర్ ఉద్యోగం

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఈశ్వరమ్మ

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: చంటి బిడ్డను ఎత్తుకుని ఉన్న ఈమె పేరు మంద ఈశ్వరమ్మ. స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉద్యోగం కోసం 2018 ఫిబ్రవరిలో పరీక్ష రాసింది. ఫలితాల కోసం ఎన్నో ఆశలు పెట్టుకొని ఎదురుచూసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలో 1,978 పోస్టులకు సుమారు 50 వేల మంది పోటీ పడగా.. ఈశ్వరమ్మకు రాష్ట్రస్థాయిలో 92వ ర్యాంకు, ఉమ్మడి జిల్లాలో 16వ ర్యాంకు వచ్చింది. ఉద్యోగం వచ్చినందుకు అందరిలా ఆమె కూడా ఎంతో సంతోషపడింది. ఒకవేళ ఉద్యోగం రాకుంటే ఆమె పరిస్థితి దయనీయంగా ఉండేది. నిరుపేద కుటుంబానికి చెందిన ఈశ్వరమ్మ పుట్టిన ఊరు మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలం గార్లపాడు. చిన్నప్పుడే తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అన్నల వద్ద పెరిగింది. 2014లో ఈశ్వరమ్మను జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం పుటాన్‌దొడ్డికి చెందిన శ్రీనివాసులుకు ఇచ్చి వివాహం చేశారు. గతంలో ఒకసారి డీఎస్సీ రాసినా కొద్దిలో ఉద్యోగాన్ని దక్కించుకోలేకపోయింది. ఈసారి తప్పనిసరిగా ఉద్యోగం సాధించాలని ఆమె భర్త శ్రీనివాసులు హైదరాబాద్‌లో కోచింగ్ ఇప్పించాడు. ప్రైవేటు కంపెనీలో పని చేసే శ్రీనివాసులుకు కంపెనీ మూతపడి ఉద్యోగం పోయింది. దీంతో ఎలాగైనా ఈసారి ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ఈశ్వరమ్మ చదివింది. ఇటీవల విడుదల చేసిన టీఆర్‌టీ ఉద్యోగాల్లో ఆమెకు స్కూల్ అసిస్టెంట్ తెలుగు పోస్టు వరించింది.

సీఎంకు కృతజ్ఞతలు

గురువారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు మహబూబ్‌నగర్ వచ్చిన ఆమె తనకు ఉద్యోగం రావడంతో భావోద్వేగానికి లోనైంది. కేసీఆర్ వల్లనే తనకు ఉద్యోగం వచ్చిందని ఆనందబాష్పాలు రాల్చింది. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన తనకు ఉద్యోగం రావడంతో కుటుంబం నిలబడిందన్నారు. చంటి బిడ్డను ఒడిలో కూర్చోబెట్టుకుని ఆర్‌వీఎం కార్యాలయం వద్ద ఏడుస్తూ ఉంటే..అక్కడి వారంతా ఉద్యోగం రానందుకు ఏడుస్తుందేమో అని వచ్చి ఓదార్చే ప్రయత్నం చేశారు. కానీ ఆమె ఇన్నాళ్లు తను పడిన మానసిక సంఘర్షణ నుంచి బయటపడిన వేళను గుర్తుకుతెచ్చుకుంటూ కన్నీరు పెట్టుకున్నది. ఇక తన కష్టాలన్నీ దూరమయ్యాయనీ, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. 2014లో తన పెండ్లికి కల్యాణలక్ష్మి చెక్కును, 2018లో తన కూతురుకు కేసీఆర్ కిట్ అందించిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నది. సీఎం కేసీఆర్ వల్లే తన జీవితం నిలబడిందని సంతోషం వ్యక్తం చేసింది. ఇది ఒక్క ఈశ్వరమ్మ హృదయస్పందనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగాలు సాధించిన అనేక మంది గుండె చప్పుడు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా మన ఉద్యోగాలు మనం సాధిస్తున్నామని చెప్పేందుకు నిదర్శనం ఈ ఘటన.

చంటి బిడ్డతో మహబూబ్‌నగర్ ఆర్వీఎం కార్యాలయం వద్ద మంద ఈశ్వరమ్మ

ఎంజీఎంలో మెరుగైన వైద్యసేవలకు ప్రత్యేక నిధి

వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ: ఉత్తర తెలంగాణ వైద్య సేవల్లో కలికితురాయి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యసేవల మెరుగు కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం యోచిస్తున్నది. ప్రభుత్వం అందించే ఆర్థిక తోడ్పాటుకు ఎన్ఆర్ఐ సహా ప్రముఖుల నుంచి విరాళాల రూపంలో నిధులు సేకరించాలని భావిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వ్యాపారవేత్తలు, వివిధ రంగాల్లో స్థిరపడిన వారి నుంచే కాకుండా దేశ విదేశాల్లో ఉన్న వరంగల్ వాసుల నుంచి నిధుల సేకరించాలనుకుంటున్నారు. వరంగల్ అర్బన్ కలెక్టర్ చైర్మన్‌గా ఆస్పత్రి విరాళ సేకరణ నిధి పేరిట బ్యాంకులో ప్రత్యేక ఖాతా తెరవాలని భావిస్తున్నారు. గురువారం ఎంజీఎం సూపరింటెండెంట్ కార్యాలయంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తో కలిసి కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ ఆస్పత్రి వైద్యసేవలపై సమీక్షించారు. ఇటీవల వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆస్పత్రిని సందర్శించి పరిస్థితిని సమీక్షించిన అనంతరం కలెక్టర్ గురువారం సమీక్షించారు. ఎంజీఎం అభివృద్ధి కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్, ఎంజీఎం చైర్మన్ పేరుతో ప్రత్యేక అకౌంట్ ఏర్పాటు చేసి దాతల నుంచి విరాళాలు సేకరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆస్పత్రిలో వివిధ విభాగాల స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

వెబ్‌సైట్‌లో టీఆర్టీ అభ్యర్థుల జాబితా

■ పాత జిల్లాల ప్రకారమే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్టీ అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టామని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా 2,509 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ జారీచేయగా 2,058 పోస్టులకు అభ్యర్థులు ఎంపికయ్యారని, 451 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. టీఆర్టీ పోస్టింగ్ ఆర్డర్ల షెడ్యూల్ ప్రకారం 2,058 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వనున్నామని చెప్పారు. పాత జిల్లాల ప్రకారమే భర్తీకి సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు.

పాత జిల్లాలవారీగా స్కూల్ అసిస్టెంట్ పోస్టుల వివరాలు

జిల్లాపేరు	పోస్టులు	భర్తీ	ఖాళీ
అదిలాబాద్	216	149	67
హైదరాబాద్	197	109	88
కరీంనగర్	303	260	43
ఖమ్మం	128	105	23
మహబూబ్‌నగర్	442	374	68
మెదక్	278	210	68
నల్లగొండ	356	341	15
నిజామాబాద్	138	103	35
రంగారెడ్డి	280	251	29
వరంగల్	171	156	15
మొత్తం	2,509	2,058	451

గృహనిర్మాణాలకు ఎండీసీ ద్వారా ఇసుక సరఫరా

■ ఆన్‌లైన్‌లో కొనుగోలుకు బుకింగ్ సదుపాయం

■ టన్నుకు రూ.1,250, రవాణా ఖర్చు అదనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గృహనిర్మాణ అవసరాల దృష్ట్యా నిర్మాణ ప్రాంగణం వద్దకే ఇసుక సరఫరా చేయనున్నట్టు టీఎస్‌ఎండీసీ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. టన్ను ఇసుక ధర రూ.1,250 ఉంటుందని, రవాణా ఖర్చుతో కలిపి రూ. 1,350 నుంచి 1,450 వరకు కావచ్చని ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే సదుపాయం ఉండటంతోపాటు ఒకేసారి 12 టన్నుల ఇసుక కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. www.sand.telangana.gov.in/ tssandportal/masters/home.aspx వెబ్‌సైట్ల ద్వారా కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. ఇసుక 6 టైర్ల టిప్పర్ ద్వారా సరఫరా అవుతుందని, ఆన్‌లైన్ బుకింగ్ అయిన వెంటనే వినియోగదారుడి ఫోన్‌కు ఓటీపీ వస్తుందని, ఈ ఓటీపీని ఇసుక తెచ్చిన ట్రక్ డ్రైవర్‌కు ఇవ్వాలని తెలిపారు. ఇసుక కొనుగోలు చేయదలిచినవారు హైదరాబాద్ చుట్టుపక్కల గల అబ్దుల్లాపూర్‌మెట్, వట్టినాగులపల్లి, బొరాంపేట్ నిల్వకేంద్రంలో ఇసుకను చూసి కొనుగోలు చేసుకోవచ్చని, ఏమైనా సందేహాలుంటే 040-23323150/155242 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇసుక బుకింగ్‌కు టీఎస్‌ఎండీసీ రూపొందించిన వెబ్‌సైట్

భద్రతా వలయంలోకి బీఆర్కే భవన్!

■ పరిసరాల్లో అవసరమైనచోట్ల బారికేడ్ల ఏర్పాటు.. ట్రాఫిక్ మళ్లింపు

■ సెక్యూరిటీ ఏర్పాట్లపై పోలీసుల అధ్యయనం.. రెండురోజుల్లో నివేదిక

■ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పార్కింగ్‌కు చర్యలు

■ డోయిజర్ ఫైళ్ల భద్రతకు ప్రత్యేక గది

సచివాలయం ఏర్పాటు కోసం బీఆర్కే భవన్‌లో ప్రస్తుతం ఉన్న విజిలెన్స్ విభాగం ఫైళ్లు తరలిస్తున్న సిబ్బంది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బూర్గుల రామకృష్ణారావుభవన్, దానిపరిసర ప్రాంతాలు హైసెక్యూరిటీ జోన్‌లోకి వెళ్లనున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రధానకార్యదర్శితో పాటు, వివిధశాఖల కార్యదర్శులు ఇక్కడ కొలువుదీరనుండడంతో.. భద్రతాఏర్పాట్లపై పోలీస్ ఉన్నతాధికారులు అధ్యయనం చేస్తున్నారు. త్వరలో భవనం పరిసరాలను హైసెక్యూరిటీ జోన్‌గా ప్రకటించనున్నారు. భవనం ముందున్న మూడురోడ్లను మూసివేసి.. ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. వీవీఐపీల రక్షణ, పార్కింగ్ స్థలం ఏర్పాటు తదితర అంశాలను అధ్యయనంచేసి నివేదికను సమర్పించాలని ప్రభుత్వం పోలీసుశాఖను కోరింది. ఈ మేరకు పోలీస్ అధికారులు ఒక ట్రెండు రోజుల్లో పూర్తి నివేదికను అందజేయనున్నారు. సమీకృత కొత్త సచివాలయ నిర్మాణం నేపథ్యంలో ప్రస్తుతం సచివాలయంలో ఉన్న శాఖల్లో ప్రధానమైన వాటిని బీఆర్కేభవన్‌కు తరలించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. బీఆర్కేభవన్‌లో ఉన్న కార్యాలయాలన్నింటినీ తరలించగానే సచివాలయంలోని శాఖల తరలింపు మొదలవుతుంది. ఇందు కోసం ఎస్పీఎఫ్, ఐఎస్‌డబ్ల్యూ, సీఎస్‌డబ్ల్యూ, ఐబీ, ఎస్పీ, లా అండ్‌ఆర్డర్, ట్రాఫిక్ ఇలా అన్నివిభాగాల సమన్వయంతో పోలీస్‌శాఖ బీఆర్కేభవన్, ఆ పరిసరాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నది. పోలీసుశాఖకు చెందిన వివిధ బృందాలు ఇప్పటికే పలుసార్లు బీఆర్కే భవన్, దాని పరిసర ప్రాంతాలను సందర్శించాయి. ఈ సందర్భంగా భవనం పరిసరప్రాంతాల్లో వివిధరకాల ఆంక్షలను ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నారు. అటు జీహెచ్‌ఎంసీ గేట్ దగ్గర, ఇటు రిట్జ్ హోటల్ కింద కళాంజలి సమీపంలో, మధ్యలో ఎమ్మెల్యే క్వార్టర్స్ పక్కనేఉన్న రోడ్డులోని హోప్ దవాఖాన వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద బీఆర్కేభవన్ వైపు వెళ్లే జంక్షన్‌లో కూడా బారికేడ్లు ఏర్పాటుచేసి వాహన రాకపోకలను నిలువరించనున్నారు.

పార్కింగ్ ప్రధాన సమస్య..

సచివాలయంలోని శాఖలను బూర్గుల రామకృష్ణారావుభవన్‌కు తరలితే వాహనాల పార్కింగ్ ప్రధానసమస్యగా మారనున్నది. బీఆర్కే భవన్‌లో కొన్ని, దానిముందు రోడ్డుపై మరికొన్ని వాహనాలు పార్క్‌చేసే వెసులుబాటు ఉన్నది. వీటితో పాటు పక్కనేఉన్న ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఖాళీస్థలాన్ని సైతం పార్కింగ్ కోసం ఉపయోగించుకునే విధంగా ట్రాఫిక్ పోలీసులు ప్రభుత్వానికి సూచనలు చేయనున్నారు. భవనం చుట్టుపక్కల ఎలాంటి పరిస్థితులు నెలకొని ఉన్నాయి. దాని చుట్టూ ఎలాంటి రక్షణ వలయం ఏర్పాటు చేయాలి? వీవీఐపీలకు ఏవిధమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి? లాంటి సున్నిత అంశాలను కూడా పోలీసుశాఖ తన నివేదికలో పేర్కొననున్నది.

డోయిజర్ ఫైళ్లకోసం ప్రత్యేక గది

సచివాలయంలోని వివిధ విభాగాల ఫైళ్లు, ఇతర సరంజామా ప్యాకింగ్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారుల సంపూర్ణ సమాచారం నిక్షిప్తమై ఉండే కీలకమైన డోయిజర్ ఫైళ్లను జాగ్రత్తగా తరలించి, భద్రపరిచేందుకు కొత్త ప్రాంగణంలో ప్రత్యేక గదిని కూడా ఏర్పాటుచేయనున్నారు. ప్రస్తుతం ఈ ఫైళ్లను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నియంత్రణలో, సీ బ్లాక్, 6 వ అంతస్తులోని ఓ ప్రత్యేక గదిలో భద్రపరిచారు. బూర్గుల రామకృష్ణారావు భవనంలో ప్రస్తుతం ఉన్న కార్యాలయాలను ఖాళీచేసే ప్రక్రియ చివరిదశకు చేరుకున్నది. అయితే, 4వ అంతస్తులో ఉన్న డాటాసెంటర్‌ను అక్కడే ఉండే అవకాశాలు ఉన్నాయి. జీవోల జారీ, వివిధ ప్రభుత్వశాఖల ముఖ్యమైన అప్లికేషన్ల వినియోగం, రోజువారీ పరిపాలనకు అసౌకర్యం కలగకుండా ఆ డాటా సెంటర్‌ను సచివాలయ అవసరాల కోసం వాడుకోనున్నారు.

సచివాలయ అధికారులకు పదోన్నతులు

■ ఏడుగురు అదనపు కార్యదర్శులకు సంయుక్త కార్యదర్శుల హోదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సచివాలయంలో వివిధశాఖల్లో అదనపు కార్యదర్శులుగా పనిచేస్తున్న ఏడుగురు అధికారులకు ప్రభుత్వం సంయుక్త కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించింది. ముగ్గురు అదనపు కార్యదర్శులను వివిధ పోస్టులకు బదిలీ చేసింది. సంయుక్త కార్యదర్శులుగా పదోన్నతి పొందినవారిలో వీ నరేంద్రకుమార్, కేపీ హరీశ్‌కుమార్, పీ కిరణ్‌కుమార్, టీ శేఖర్, వీ పద్మ, కే రమేశ్, కరుణాకర్ తదితరులు ఉన్నారు. సంయుక్త కార్యదర్శిగా పదోన్నతి పొందిన పీ కిరణ్‌కుమార్‌ను పరిశ్రమ లశాఖ నుంచి పుడ్ కమిషన్ కార్యదర్శిగా బదిలీ చేశారు. పుడ్ కమిషన్ కార్యదర్శిగా ఇప్పటివరకు పనిచేసిన కేఎస్ ప్రసాద్‌ను పరిశ్రమలశాఖకు అదనపు కార్యదర్శిగా, పదోన్నతి పొందిన వీ పద్మను జీఏడీ నుంచి వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శిగా, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఉపకార్యదర్శిగా పనిచేస్తున్న సునీతను జీఏడీ సర్వీసెస్‌కు, జీఏడీ సర్వీసెస్‌లో ఉపకార్యదర్శిగా ఉన్న పద్మావతిని జీఏడీ అకామడేషన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

ఆర్కైవ్స్ తరలింపుపై తర్జనభర్జన

■ సచివాలయంలో 20 లక్షల పురాతన డాక్యుమెంట్లు

■ నిజాంకాలంనాటి పర్సనల్ కలెక్షన్లు..

■ 1665 నాటి డాక్యుమెంట్లూ ఉన్నాయి

■ ఆర్కైవ్స్‌లో భద్రంగా 1883 నాటి ఢిల్లీ గెజిట్

హైదరాబాద్,నమస్తే తెలంగాణ: ఇరవై లక్షల పురాతన డాక్యుమెంట్లు, 1665 సంవత్సరం నాటి పత్రాలు, నిజాం కాలం నాటి వ్యక్తిగత కలెక్షన్లు, 1883 నాటి ఢిల్లీ గెజిట్‌లాంటి ఎన్నో విలువైన డాక్యుమెంట్లు తెలంగాణ సచివాలయంలోని ఆర్కైవ్స్‌లో భద్రంగా ఉన్నాయి. ప్రస్తుతం సచివాలయం తరలింపు నేపథ్యంలో 'ఆర్కైవ్స్' తరలింపుపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. విలువైన చారిత్రక ఆధారాలు మిస్ కాకుండా ఎలా తరలించాలన్నదానిపై చర్చిస్తున్నారు. సచివాలయంలో ఉన్న ఆర్కైవ్స్‌లో దాదాపు 20 లక్షల పురాతన డాక్యుమెంట్లు, 1960 నుంచి1980 వరకు నడిచిన సెక్రటేరియట్ డాక్యుమెంట్లు ఉన్నాయి. రాజుల కాలం నాటి రాజపత్రాలు, ఆనాటి ప్రముఖుల వ్యక్తిగత కలెక్షన్లు కూడా ఉండడం విశేషం. 1665-1667 సంవత్సరాలకు చెందిన ఇంగ్లిష్ ఫ్యాక్టరీస్ ఇండియా స్టేటస్ రిపోర్ట్, 1736-1761 సంవత్సరాల్లో ప్రైవేట్ డెయిరీ ఆఫ్ ఆనందరంగపిళ్లెకి చెందిన డాక్యుమెంట్లు ఉన్నాయి. ముఖ్యంగా 1883 నాటి ఢిల్లీ గెజిట్‌ను తెలంగాణ సచివాలయంలోని ఆర్కైవ్స్‌లో భద్రపరిచారు. 1880 నుంచి గెజిట్స్ ఉన్నాయి. బ్రిటిష్ పాలకుల పబ్లికేషన్లు, 1869 మాన్యువల్ విశాఖపట్నం జిల్లా స్టేటస్ రిపోర్ట్, 1882-83 నాటి మద్రాస్ ప్రెసిడెన్సీ సెన్సెస్ రిపోర్ట్, 1892 హిస్సార్ జిల్లా గెజిట్, 1883 అంబాలా, రోహతక్, కర్నాల్ జిల్లాల గెజిట్లు కూడా ఉన్నాయి. నాటికాలంలో ఒకరి గెజిట్లు మరొకరికి ఇచ్చిపుచ్చుకునే అవకాశం ఉన్నట్టు దీనిని బట్టి అర్థమవుతున్నది. చరిత్ర నిక్షిప్తమైన పురాతనమైన డాక్యుమెంట్లను కదిలిస్తే అవి చెడిపోయే ప్రమాదం పొంచి ఉన్నది. పాతకాలం కాగితాలు కొన్ని పిండి మాదిరిగా అవుతున్నాయి. వీటిని తరలించాలంటే చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని ఆర్కైవ్స్ అధికారులు అంటున్నారు. తమకు అధికారికంగా సమాచారం వచ్చాక తరలింపుపై చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు.

టీడీపీ ఆరోపణలు తప్పని నిరూపిస్తే చంద్రబాబు రాజీనామా చేస్తారా?

■ అసెంబ్లీలో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సవాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన గురువారం తొలిరోజే సభలో గందరగోళం నెలకొంది. రాష్ట్రంలో కరవు, నీటి ఎద్దడి సమస్యపై సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రసంగం ముగిసిన తర్వాత రైతు సమస్యలపై చర్చలో భాగంగా టీడీపీ శాసనసభాపక్ష ఉప నేత నిమ్మల రామానాయుడు సున్నా వడ్డీ పథకం కొత్తదేమీ కాదని వ్యాఖ్యానించడంతో సభలో దుమారం చెలరేగింది. ఈ పథకం గతంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రవేశపెట్టగా.. తమ ప్రభుత్వం సైతం దాన్ని కొనసాగించిందని తెలిపారు. దీనిపై జోక్యం చేసుకున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి టీడీపీ విమర్శలు తప్పని నిరూపిస్తే చంద్రబాబు రాజీనామా చేస్తారా? అని సవాల్ విసిరారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్ర రైతాంగానికి గత టీడీపీ ప్రభుత్వం సున్నా వడ్డీ పథకంపై రూపాయి కూడా ఇవ్వలేదని, అవసరమైతే రికార్డులు తీసుకొస్తానని చెప్పారు. సున్నా వడ్డీ కింద రైతాంగానికి ఎంత డబ్బు ఇచ్చారో చంద్రబాబు చెప్పాలన్నారు. దీంతో సభలో వాగ్వాదం చోటుచేసుకుంది. జగన్ సవాల్‌పై చంద్రబాబు స్పందిస్తూ రికార్డుల్లో ఉన్నది చెప్పడం తన బాధ్యత కాదన్నారు. కాగా, గత ప్రభుత్వం రూ.2300 కోట్ల పెట్టుబడి రాయితీని ఎగ్గొట్టి రైతులను మోసంచేసిందని జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ఆయన శాసనసభలో ప్రకటన చేశారు. పంట నష్టపోయిన రైతులకు సహాయం రూపంలో గతంలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఎద్దేవాచేశారు. విత్తనాల సేకరణ కూడా చేయలేని పరిస్థితి గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిందని మండిపడ్డారు.

గురువారం ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత చంద్రబాబు మాట్లాడుతున్నప్పుడు వింటున్న సీఎం జగన్

'గతేడాది కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా రైతులకు బకాయిలు పెట్టారు. ఐదేండ్లలో రుణాల రీషెడ్యూల్, వడ్డీ చెల్లింపుల మాఫీపై ఆలోచన చేయలేదు. వ్యవసాయ రుణాలు రూ.87,612 కోట్లు మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పారు. కానీ, అది ప్రకటనలకే పరిమితమైంది' అని జగన్ ఎద్దేవా చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు ఏం చేయబోతోందో సభ ముందు ఉంచుతున్నామన్నారు. పంటరుణాలు తీసుకున్న రైతులు గడువులోగా చెల్లిస్తే వడ్డీ ఉండదని తెలిపారు. ప్రమాదంలో రైతు మరణిస్తే గతంలో పట్టించుకున్న దాఖలాలు లేవు. కానీ, ఇప్పుడు మాత్రం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.7 లక్షలు ఇస్తాం అని జగన్ తెలిపారు. ప్రతి ఒక్క ఎమ్మెల్యే వారి నియోజవర్గాల్లో పర్యటించి నీటి ఎద్దడి తెలుసుకోవాలని సీఎం జగన్ సూచించారు. తాగునీటి సమస్య తక్షణ పరిష్కారానికి ప్రతి నియోజకవర్గానికి రూ.కోటి కేటాయిస్తున్నట్లు చెప్పారు. 'ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యేలకు కూడా రూ.కోటి ఇస్తాం. దీనిని సీఎం అభివృద్ధి నిధి నుంచే కేటాయిస్తాం. తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యేలను కోరుతున్నా' అని సీఎం జగన్ అన్నారు.

నల్గొండ పట్టణంలో అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి

సీఎం కేసీఆర్ ముందుచూపుతో ఇంటింటికీ భగీరథ నీరు

మంత్రి జగదీశ్‌రెడ్డి

రూ.160కోట్లతో అభివృద్ధి పనులు

నల్లగొండ, నమస్తే తెలంగాణ: దేశానికి కొత్త పరిపాలన పద్ధతులు, కొత్త పథకాలు అందించింది తెలంగాణ రాష్ట్రమేనని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలో రూ.160 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో గ్రామాల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా నిధులు కేటాయించిందో అదే విధంగా ఈ సారి పట్టణాలను ఆధునీకరించేందుకు ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతం అనే తేడా లేకుండా ప్రతి ఇంటికి తాగునీరు ఇవ్వాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికీ వర్షాలు లేక ఇంత కరువు చోటుచేసుకున్నప్పటికీ తాగునీటి సమస్య లేకుండా ఉందంటే అందుకు సీఎం కేసీఆర్ ముందు చూపే కారణమన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

TSRTC ఈ-టెండర్ ప్రకటన

No. C2/194(3)/2018-OPD(M&C), Dt. 12.07.2019

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వివిధ మార్గమార్గాల (1) వరంగల్ రీజియన్ బస్సు స్టేషన్స్ లో ప్రకటనల (2) సికింద్రాబాద్ రీజియన్ సూపర్‌లక్జరీ, లీలర్ బస్సుల పై ప్రకటనల, (3) వివిధ రీజియన్ల బస్సుల్లో గ్రాఫిక్స్/లైట్స్ అమర్చి ఉంచిన ప్రకటనలు (4) వివిధ బస్సు స్టేషన్ల పైన రూఫ్ టాప్ పోల్స్ నిర్మాణం (5) వివిధ బస్సు స్టేషన్ల మరియు డిపోల్లో గ్రౌండ్ టెస్ట్ మాస్ట్ నిర్మాణం (6) వివిధ బస్సు స్టేషన్లలో వర్షపు వేడుగా మెషీన్స్ నిర్మాణం చేయుట మరియు (7) గ్రేటర్ హైదరాబాద్ మరియు హైదరాబాద్ జోన్ బస్సుల్లో బ్రెయింగ్ బోర్డ్ (యాడ్వర్టైజింగ్ బోర్డ్) పై ప్రకటనల కొరకు కాంట్రాక్టర్ల నుండి ఆన్ లైన్ విధానంలో టెండర్లు కోరుచున్నది. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ : http://www.tsrtc.telangana.gov.in లేదా https://tender.telangana.gov.in ను సంప్రదించగలరు. సందేహ నివృత్తి కొరకు CTM(M&C) & DIR(CP) వారిని ఫోన్ నెం. 9959225400 ని సంప్రదించగలరు.

సం/- చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (M&C) & డైరెక్టర్ (CP)

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR రీజియన్, వరంగల్
సంక్షిప్త టెండరు ప్రకటన: తేది. 08.06.2019
NIT Ref No. 20/2BHK/19-20 (1వ పిలుపు)
పని పేరు: భూపాలపల్లి(మం)లో షేర్ వాల్ టెక్నాలజీలో G+2 నమూనాలో 2BHK ఇళ్ళు (416 ఫ్లాట్లు) నిర్మాణం. ECV: రూ. 2204.80 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ & ముగింపు తేది: 15.07.2019న రా. 9.00 గం|| నుండి 23.07.2019న మ. 3.00 గం|| వరకు. ఫోన్ నం. 0870-2578114. తదుపరి వివరాల కొరకు **www.eprocurement.gov.in** దర్శించండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్, వరంగల్
DIPR RO. No. 598-DP/CL/Advt/1/2019-20, Dt: 11/07/2019

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీ రాజ్ ఇంజినీర్ కార్యాలయం, PIU సూర్యాపేట
సంక్షిప్త టెండరు ప్రకటన
సంక్షిప్త టెండరు ప్రకటన నం. D3/02/2019-20, తేది: 08-07-2019
PIU సూర్యాపేట్‌లో అంగన్‌వాడీ పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదులు, పాఠశాలకు ప్రహరీ గోడల నిర్మాణం మొ|| పనులు చేపట్టుట కొరకు దిగువ సంతకందారునే టెండర్లు కోరబడుతున్నవి. 67 పనుల కొరకు మొత్తం ECV:రూ. 5,27,96,000/-, దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 22.07.2019న సా. 5.00 గం. వరకు. టెండరు షెడ్యూళ్ళ జారీ: 24.07.2019న సా. 5.00 గం. వరకు. టెండర్ల స్వీకరణ తేదీ: 25.07.2019న మ. 3.00 గం.వరకు, టెండర్లు తెరుచు తేదీ: 25.07.2019న మ. 3.30 గం. తదుపరి వివరాలను దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.
DIPR RO.No.605 - DP/CL/Advt/1/2019-20 Dt: 11.07.2019 సం/- జిల్లా PR ఇంజినీర్, PIU సూర్యాపేట

తెలంగాణ స్టేట్
పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
(తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్-టెండరు ప్రకటన-15
03 పనుల కొరకు టెండరు నం.లు T94 నుండి T96/2019-20, తేది: 10.07.2019 కొరకు సివిల్ పనులకు టెండర్లు కోరబడుతున్నవి. వరుసగా ''టెండరు నం, జిల్లాలో గల పని & మొత్తం ECV (రూ. లక్షలలో) దిగువ విధంగా ఉన్నవి: T94- హైదరాబాద్-1-14.22; T95- వరంగల్-1-131.58; T96- మహబూబ్‌నగర్- 1-11.40: **ఆన్‌లైన్‌లో షెడ్యూల్ లభ్యత: 11.07.2019 నుండి. టెండరు నం. T94 కొరకు బిడ్డ దాఖలుకు చివరి తేది/సమయం:** తేది: 15.07.2019/సా.5.00 గం||. **టెండరు నం. T95 & T96 కొరకు బిడ్డ దాఖలుకు చివరి తేది/సమయం:** తేది: 18.07.2019/సా.5.00 గం||. తదుపరి వివరాలను వెబ్‌సైట్: **www.tender.telangana.gov.in**లో చూడవచ్చును.
DIPR RO. No. 242-PP/CL/Advt/1/2019-20, Dt: 11/07/2019 సం/- మేనేజింగ్ డైరెక్టర్

తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్,
ఆఫీస్: మూడవ అంతస్తు, UNI బిల్డింగ్, A.C.గార్డ్స్, హైదరాబాద్
Ph: 040-23392652, 23395750
Ref.No.OP.001/Mixed EPs & BPs-WGL, PAL/EPW/2019-20 Dt. 10-07-2019
యూకలిప్టస్ టింబర్/పల్ప్‌వుడ్ (బెరడులేకుండా) మిశ్రమ ప్లాంటేషన్‌ల నుండి మరియు యూకలిప్టస్ పల్ప్ వుడ్ (బెరడు లేకుండా) యూకలిప్టస్ క్లోనల్ ప్లాంటేషన్ ల నుండి విక్రయం కొరకు ఈ టెండర్ కమ్ ఈ వేలం
తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డివిజన్లు కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి మరియు వరంగల్ యూకలిప్టస్ మరియు బాంబూ మిశ్రమ ప్లాంటేషన్‌లలో గల యూకలిప్టస్ టింబర్/పల్ప్‌వుడ్ (బెరడు లేకుండా) మరియు వరంగల్ మరియు పాల్వంచ డివిజన్‌లలోని యూకలిప్టస్ క్లోనల్ ప్లాంటేషన్‌లలో గల యూకలిప్టస్ పల్ప్‌వుడ్ (బెరడు లేకుండా) మొత్తం కలిపి సుమారు **78,842 MT**ల (యూకలిప్టస్ టింబర్/పల్ప్ వుడ్(బెరడు లేకుండా) మరియు యూకలిప్టస్ పల్ప్‌వుడ్ (బెరడు లేకుండా) తేది: 26-07-2019న తెలంగాణ ఈ ఆక్షన్ పోర్టల్ ఆధ్వర్యంలో ఈ టెండర్ కమ్ ఈ వేలం ద్వారా విక్రయించబడుతుంది. కొనదలచిన బిడ్డర్లు తెలంగాణ ఈ ఆక్షన్ పోర్టల్ యందు నమోదు చేసుకోవాలి. వివరాలు **http://auction.telangana.gov.in**వెబ్‌సైట్‌లో చూడవచ్చును. ఏవైనా వేలము కాని లాట్లు ఉన్న యెడల వాటిని తేది: 23-08-2019 మరల 20-09-2019న వేలం వేయబడును.
సం/- **(పి.రఘువీర్ I.F.S.,)** వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు హైవేల మంత్రిత్వ శాఖ
బహిరంగ ప్రకటన
(కి.మీ. 54/000 నుండి కి.మీ. 76/800 వరకు NH-202 (ఓల్డ్) 163 (న్యూ) యొక్క యాదగిరి - వరంగల్ సెక్షన్ యొక్క ఫోర్ లేనింగ్ కొరకు జాతీయ రహదారుల చట్టం, 1956 యొక్క సెక్షన్ 3-G క్రింద)
కట్టడములు మరియు చెట్లు మొ|| వాటితో పాటుగా దిగువ షెడ్యూలు నందు వివరించబడిన భూములు యాదాద్రి భువనగిరి జిల్లా యొక్క భువనగిరి రెవెన్యూ డివిజన్ నందు కి.మీ. 54/000 నుండి కి.మీ. 76/800 వరకు భారత ప్రభుత్వ అసాధారణ రాజపత్రం యొక్క భాగం-II విభాగం 3, ఉప విభాగం (ii) తేది: 21 జూన్, 2019 నందు ప్రచురింపబడిన నోటిఫికేషన్ S.O. 2031 (E), 2032 (E) & 2033 (E) ప్రకారం జాతీయ రహదారుల చట్టం, 1956 యొక్క సెక్షన్ 3D(1) క్రింద భారత కేంద్ర ప్రభుత్వం యొక్క స్వాధీనతలో గల సదరు భూములు అన్ని రకముల ఆటంకముల నుండి విముక్తమై ఉన్నాయి.
దిగువ కాలం 5 నందు చూపబడిన విధంగా సదరు తేదీలలో కాంపిటెంట్ అథారిటీ (భూ సేకరణ) మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, భువనగిరి డివిజన్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి సమక్షమున ఒరిజినల్ డాక్యుమెంట్లు మరియు సదరు డాక్యుమెంట్ల యొక్క జిరాక్స్ కాపీలతో పాటుగా స్వయంగా కానీ లేదా ఒక ఏజెంట్ ద్వారా కానీ లేదా ఒక లీగల్ ప్రాక్టీషనల్ ద్వారా కానీ హాజరై సదరు భూముల నందు తమ ఆసక్తికి సంబంధించిన కారణములను వివరించవలసిందిగా సదరు భూమి నందు ఆసక్తిగల వ్యక్తుల నందరినీ కోరడమైనది.

క్ర.సం.	జిల్లా పేరు	మండలం పేరు	గ్రామం పేరు	విచారణ తేది & సమయం	విచారణ జరుగు ప్రదేశం
1	యాదగిరి భువనగిరి	ఆలేరు	టంగుటూరు	25-07-2019న ఉ|| 11.00 గం||	తహసీల్ ఆఫీస్, ఆలేర్
2		యాదగిరి గుట్ట	వంగపల్లి	25-07-2019న మ|| 12.00 గం||	తహసీల్ ఆఫీస్, యాదగిరి గుట్ట

షెడ్యూలు
తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారి నం.202 (ఓల్డ్) 163 న్యూ యొక్క కి.మీ. 54/0 నుండి కి.మీ. 76/8 (యాదగిరి - వరంగల్ సెక్షన్) వరకు గల భూమి యొక్క విస్తరణ.

|

ఆస్తి కోసం భార్యాకొడుకుల హత్య

కవిత, దినేశ్‌రెడ్డి (ఫైల్)

నారాయణఖేడ్, నమస్తే తెలంగాణ: భార్య పేర ఉన్న ఆస్తిని కాజేసేందుకు భార్యాకొడుకులను దారుణంగా హతమార్చిన ఘటన సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తిలో గురువారం చోటుచేసుకున్నది. చింతాకి వెంకట్‌రెడ్డి(32) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో ఎకరం భూమిని అమ్మి జల్సాలకు ఖర్చు పెట్టాడు. మిగిలిన నాలుగు ఎకరాల భూమిని కూడా విక్రయిస్తాడన్న అనుమానంతో వెంకట్‌రెడ్డి భార్య కవిత భూమిని తన పేర మార్పిడి చేసుకున్నది. భూమి అమ్ముదామని వెంకట్‌రెడ్డి కొన్ని రోజులుగా భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. ధవారం కవితను హత్య చేశాడు. విషయం ఎవరికైనా చెబుతాడేమోనని నాలుగేళ్ల కొడుకు దినేశ్‌రెడ్డిని హతమార్చి ఇద్దరి మృతదేహాలను ఇంట్లోనే కిరోసిన్ పోసి నిప్పంటించాడు. నారాయణఖేడ్ డీఎస్పీ సత్యనారాయణరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి, డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం ద్వారా విచారణ చేపట్టారు.

సహకార సంఘాల పరిరక్షణకు మహోద్యమం అవసరం

- కేరళ ఆర్థికమంత్రి థామస్ ఐజాక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సహకార సంఘాల పరిరక్షణకు మహోద్యమం చేయాల్సిన అవసరం ఉన్నదని కేరళ ఆర్థికమంత్రి థామస్ ఐజాక్ అన్నారు. ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో షరతులు వ్యవసాయరంగాన్ని దెబ్బతీస్తాయని, ఆహార ఉత్పత్తుల దిగుబడి పడిపోతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానభవన్‌లో జరిగిన సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. యూపీ ఏ, ఎన్డీఏ ప్రభుత్వాల హయాంలో ఉత్పాదకత బాగా తగ్గిపోయి, రైతుల ఆదాయం పడిపోయిందని తెలిపారు. రైతు ఆదాయం పెరగడానికి సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్‌మొల్లా, ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, ఏఐఏడబ్ల్యూయూ నేతలు తిరువక్కనరసు, విజయరాఘవన్, ప్రొఫెసర్ వెంకటేశ్ ఆత్రేయ, నంద్యాల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో కేరళ ఆర్థికమంత్రి థామస్ ఐజాక్

భైంసా మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టు స్టే

- నిర్దేశిత డీలిమిటేషన్ పూర్తిచేయాలని ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిర్మల్ జిల్లాలోని భైంసా మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. వార్డుల పునర్విభజన విషయంలో తెలంగాణ మున్సిపాల్టీల చట్టం నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం వ్యవహరించాలని ఆదేశించింది. డీలిమిటేషన్ విషయంలో నిబంధనలను పాటించలేదని భైంసాకు చెందిన కపిల్‌షిండే అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. పైవిధంగా ఉత్తర్వులు జారీచేసింది.

రేపు జాతీయ లోక్‌అదాలత్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా శనివారం (ఈ నెల 13న) జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి ఏ సంతోష్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసుల సత్వర పరిష్కారానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కక్షిదారులకు సూచించారు.

సచివాలయంలో వ్యవసాయాధికారుల హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

లాభసాటి వ్యవసాయం దిశగా తెలంగాణ

'తెలంగాణ వ్యవసాయం-దిక్సూచి' పుస్తక ఆవిష్కరణలో మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లాభసాటి వ్యవసాయం దిశగా రాష్ట్ర రైతాంగాన్ని తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పారు. తమ పరిశోధనల పరిజ్ఞానం, వివిధ పంటలసాగు, యాజమాన్య పద్ధతులు తదితర అంశాలను క్రోడీకరించి రాష్ట్ర రైతులు, క్షేత్రస్థాయి సిబ్బంది కోసం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ముద్రించిన 'తెలంగాణ వ్యవసాయం- దిక్సూచి' అనే పుస్తకాన్ని గురువారం సచివాలయంలో మంత్రి విడుదలచేశారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు, అధికారులు, భారత పరిశ్రమల సమాఖ్య రాష్ట్ర ప్రతినిధులు అనిల్ వీ ఏపూర్, ఎస్ రాజశేఖర్‌రెడ్డి, కే గోపీనాథ్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ప్రయోజనం కలిగించే అంశాలు..

రాష్ట్రంలో సాగయ్యే ఆహార ధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనెగింజలు, వాణిజ్య పంటలు, ఆపత్కాల పంటల ప్రణాళిక (ప్రత్యామ్నాయ), సాగునీటి యాజమాన్యం, పండ్లతోటలు, కూరగాయలు, పూలమొక్కలు, కలప పంటలు, పశుగ్రాస పంటలు, నేల ఆరోగ్య పరిరక్షణ, సమస్యాత్మక భూములు, సకశేరుక చీడల యాజమాన్యం, వివిధ సస్యరక్షణ అంశాలు, కలుపు యాజమాన్యం, సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, మార్కెట్ ఇంటెలిజెన్స్, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, గృహవిజ్ఞానం, నవీన సాగు పద్ధతులు, నూతన సస్యరక్షణ మందులు, లాభంచేకూరే పరిశోధన ఫలితాలు వంటి అంశాలను తెలంగాణ వ్యవసాయం- దిక్సూచి పుస్తకంలో పొందుపరిచారు

మన వ్యవసాయ పథకాలు దేశానికే ఆదర్శం

తెలంగాణ అమలుచేస్తున్న వ్యవసాయ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. కేంద్రప్రభుత్వం తలపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకానికి మన రైతుబీమాయే మార్గదర్శకమని అన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోగా ఐదేండ్లలో సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో రైతులకు ధైర్యం వచ్చిందని చెప్పారు. తెలంగాణ వ్యవసాయాధికారులు రూపొందించిన 'హ్యాండ్‌బుక్'ను మంత్రి నిరంజన్‌రెడ్డి గురువారం సచివాలయంలోని డీబ్లాక్ సమావేశ మందిరంలో విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖలో పదోన్నతులపై ఓ కమిటీని ఏర్పాటు చేసి, పారదర్శకంగా పదోన్నతులు ఇచ్చేలా చూస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ కృపాకర్‌రెడ్డి, అధ్యక్షురాలు అనురాధ, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడ్రోజులు ఓ మోస్తరు వర్షాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు దగ్గరలో నైరుతి బంగాళాఖాతం.. దాని పరిసర ప్రాంతాల్లో 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనపడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో శుక్రవారం నుంచి మూడ్రోజులపాటు రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది.

గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షం

గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల గురువారం సాయంత్రం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ప్రభావం కనిపించినా.. సాయంత్రానికి వాతావరణం చల్లబడింది. నగరంలోని బంజారాహిల్స్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, నాంపల్లి, అబిడ్స్, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, బాలానగర్, చింతల్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, నాగోల్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. శుక్ర, శనివారాల్లో గ్రేటర్‌లోని చాలా చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 34.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 25.2 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 59 శాతంగా నమోదైందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

పలు జిల్లాల్లో మోస్తరు వానలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురువారం ఓ మోస్తరు వానలు పడ్డాయి. పలుచోట్ల జోరువాన కురిసింది. ఈ వర్షాలు పంటలకు మేలు చేస్తాయని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఈదురుగాలులతో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బాల్కొండ , బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ నియోజకవర్గాల్లో ఓ మోస్తరు వానపడింది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా 72.4 మి.మీ. వర్షం పడగా, అత్యధికంగా దస్తురాబాద్ మండలంలో 20 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల ఓ మోస్తరు వర్షం పడగా, ములుగు జిల్లా కేంద్రం, వాజేడు, వెంకటాపురం(నూగూరు), ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, తాడ్వాయి, గోవిందరావుపేట, వెంకటాపూర్, ములుగు మండలాల్లో వర్షం కురిసింది. మహబూబాబాద్ జిల్లాకేంద్రంతోపాటు బయ్యారం, గార్ల , కేసముద్రం, కురవి తదితర మండలాల్లో వర్షం పడింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 6.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాకేంద్రంలో చిరుజల్లులు పడగా, జైనూర్ మండలంలో భారీ వర్షం కురిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. యాదాద్రిభువనగిరి జిల్లాలోని మోటకొండూర్, ఆలేరు, ఆత్మకూరు(ఎం) మండలాలలో ఓ మోస్తరు వర్షం కురువగా, బొమ్మలరామారం, రాజాపేట, ఆలేరు, తుర్కపల్లి మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో ఓ మోస్తరువర్షం కురిసింది. సిద్దిపేట జిల్లాలో ఓ మోస్తరు వర్షం పడగా, మంచిర్యాల జిల్లావ్యాప్తంగా 7.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా చెన్నూర్ మండలంలో 31.1 మి.మీ. జన్నారంలో 21.8 మి.మీ వర్షం కురిసింది.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని సంతలో నిలిచిన నీరు

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

కాలుష్య నియంత్రణకు కమిటీలు

జిల్లా ప్రణాళికలు రూపొందించండి ■ ఘన వ్యర్థాల నిర్వహణకు చర్యలు చేపట్టండి

అన్ని దవాఖానలను ఇన్సులేటరీ యూనిట్స్‌తో ట్యాగ్ చేయండి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు సీఎస్ ఎస్కే జోషి ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అన్ని రకాల కాలుష్యాలను అరికట్టడానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటుచేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. అలాగే జిల్లా ప్రణాళికలను కూడా రూపొందించాలని సూచించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఒక కేసులో జారీచేసిన ఉత్తర్వుల అమలుపై గురువారం సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బయో మెడికల్ వేస్ట్, నదుల కాలుష్యం, వాయు కాలుష్యం, ఇసుక మైనింగ్ తదితర అంశాలపై జిల్లా కమిటీలు ప్రతినెలా సమావేశమై మినిట్స్ పంపడంతో పాటు త్రైమాసిక నివేదికలు అందజేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ జీడిమెట్లలో ఏర్పాటుచేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటును మున్సిపల్ కమిషనర్లకు చూపించి.. ఆయా మున్సిపాలిటీల్లో అదేవిధంగా మొదలుపెట్టేలా చర్యలు తీసుకొనేలా చూడాలని చెప్పారు. ప్రతి జిల్లాలో కనీసం మూడు గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, అన్ని గ్రామాలు, పట్టణాల్లో డంపింగ్ యార్డులు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలన్నారు. వినియోగంలో లేని క్వారీలను ఘన వ్యర్థాల నిర్వహణకు ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని దవాఖానలను 11 ఇన్సులేటరీ యూనిట్స్‌తో ట్యాగ్ చేయాలని చెప్పారు. నదుల్లో కాలుష్యాన్ని అరికట్టడంలో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వ్యర్థాలు నదుల్లో కలుపకుండా చూడాలన్నారు. వాయు కాలుష్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అవసరమైన చోట ఎయిర్ క్వాలిటీ స్టేషన్లను ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్, పీసీబీ సభ్యకార్యదర్శి అనిల్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ నీతూప్రసాద్, హైదరాబాద్ కలెక్టర్ మానిక్‌రాజ్, టీఎస్‌ఎండీసీ ఎండీ మల్సూర్, డైరెక్టర్ సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురువారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

క్యాబినెట్ నిర్ణయాల గుణగణాలు లెక్కించలేం

ఎర్రమంజిల్ కేసులో హైకోర్టు వ్యాఖ్య.. కూల్చివేతపై కొనసాగిన వాదోపవాదాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వం, క్యాబినెట్ నిర్ణయాల అర్హతలను, గుణగణాలను లెక్కించడం కోర్టుల పరిధిలోని అంశం కాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. మంత్రిమండలి తీసుకొన్న నిర్ణయాల్లో పాటించిన విధానాలను మాత్రమే పరిశీలించగలమని స్పష్టంచేసింది. ఎర్రమంజిల్‌లో అసెంబ్లీ నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై దాఖలైన కేసుల్లో గురువారం వాదనలు కొనసాగాయి. పిటిషనర్ లుబ్నా సార్వత్ తరపున న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపించారు. తెలంగాణ హెరిటేజ్ చట్టం తీసుకొచ్చి మూడేండ్లవుతున్నా.. ఎర్రమంజిల్‌కు సంబంధించి నిబంధనలు రూపొందించలేదని, కట్టడాలను పరిరక్షించడంలేదని తెలిపారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న ధర్మాసనం.. 'మీకు స్మారక కట్టడాలను కాపాడే నిబంధనలు రూపొందించడం కావాలా? లేక ఎర్రమంజిల్ భవనాన్ని కూల్చకుండా అడ్డుకోవడం కావాలా? ఏ అంశానికి సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలి? పిటిషన్‌లోలేని అంశాలను ప్రస్తావించి సమయం వృథా చేయవద్దు' అని వ్యాఖ్యానించింది. జుడిషియల్ రివ్యూపై స్పందిస్తూ ప్రభుత్వ నిర్ణయాలపై హైకోర్టు అప్పీలెంట్ కోర్టుగా ఉండగలదా? హైకోర్టు జూరిస్‌డిక్షన్ ఎంత? విధాన నిర్ణయాలపై న్యాయసమీక్ష సాధ్యమేనా? అన్న అంశాలపై కచ్చితమైన కేస్ స్టడీలు, నిబంధనలపై వాదనలు వినిపించాలని పేర్కొన్నది. ఎర్రమంజిల్ కేసులో నిర్ణయం తీసుకున్నది ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వ మంత్రిమండలి అని.. క్యాబినెట్‌ను ఇన్‌కాంపిటెంట్ అథారిటీ అనగలమా? అని ధర్మాసనం ప్రశ్నించింది.

ఎర్రమంజిల్‌పై మరో కేసు

ఎర్రమంజిల్ కూల్చివేతపై గురువారం లంచ్ మోషన్ రూపంలో మరో కేసు దాఖలైంది. కూల్చివేత నిర్ణయం హుడా యాక్ట్-2008, హుడా జోనింగ్ నిబంధనలకు విరుద్ధమని డెక్కన్ ఆర్కియాలాజికల్ అండ్ కల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ట్రస్ట్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం హుడా ప్రభుత్వంలో భాగమని, క్యాబినెట్‌ను హుడా నిర్దేశించగలదా? అన్న కోణంలో వాదనలు వినిపించాలని పేర్కొన్నది. కేసు విచారణను శుక్రవారానికి వాయిదావేసింది.

వారసుల కేసులో నోటీసులు

ఎర్రమంజిల్ కూల్చివేతపై ఎర్రమంజిల్ నిర్మాత నవాబ్ ఫక్రుల్ ముల్క్ వారసులు దాఖలుచేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. దీనిపై కౌంటర్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది.

ఫెటోను అరికట్టేందుకు అన్నిదేశాలు ముందుకురావాలి

- హైదరాబాద్‌లోని పలు సంస్థల్లో ఫెటో నీడలు
- టర్కీ కాన్సులేట్ జనరల్ అద్నాన్ అల్టే అల్టీనోర్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఫెటో ఉగ్రవాద సంస్థను అరికట్టేందుకు ప్రపంచదేశాలు ముందుకురావాలని, ఫెటో సామాజిక సంస్థ కాదని, ఉగ్రవాద సంస్థ అని, టర్కీ పార్లమెంట్‌పై ఆ సంస్థ చేసిన దాడిని ప్రపంచదేశాలు హెచ్చరికగా తీసుకోవాలని హైదరాబాద్‌లోని టర్కీ కాన్సులేట్ జనరల్ అద్నాన్ అల్టే అల్టీనోర్స్ పేర్కొన్నారు. టర్కీ కాన్సులేట్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడేండ్ల కిందట ఫెటో ఉగ్రవాద సంస్థ టర్కీ పార్లమెంట్‌పై దాడి చేసిందని, కొంత ప్రాణనష్టం జరిగినా దాడిని టర్కీ ప్రభుత్వం తిప్పి కొట్టిందని తెలిపారు. 1970లో ఫెతూల్లా గులెన్ అనే ఉపాధ్యాయుడు ప్రారంభించిన ఫెటో సంస్థ 165 దేశాల్లో తమ కార్యాకలాపాలు సాగిస్తుందన్నారు. సేవా సంస్థలు, విద్యా సంస్థల ముసుగులో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నదన్నారు. భారతదేశంలో, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో కూడా ఫెటో వ్యాప్తి చెందిందన్నారు. టర్కీస్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ (టిక్కి) సంస్థ తమకుతాముగా ఇండియా, టర్కీల మధ్య వ్యాపార భాగస్వామిగా, వ్యాపార అనుసంధానకర్తగా చెప్పుకొంటుందని, ఇండియాలగూ ఫౌండేషన్ అనే సంస్థ తనకుతాను అంతర్జాతీయ శాంతి సంస్థగా చెప్పుకొంటుందని, ఇక్బాలియా ఇంటర్నేషన్ స్కూల్స్, ఇక్బాలియా జూనియర్ కాలేజీలు ఫెటో అనుబంధంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని, విద్యార్థుల మనసుల్లోకి ఫెటో భావజాలాన్ని చొప్పిస్తున్నారని కాన్సులర్ జనరల్ అద్నాన్ అభిప్రాయపడ్డారు. వీటిలో విద్యార్థులను ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి సంస్థలపై భారత ప్రభుత్వం ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ దేశాల్లో 800 విద్యా సంస్థలు, వెయ్యి స్వచ్ఛంద సంస్థలు, 200కుపైగా మీడియా సంస్థలు, 500 ప్రైవేట్ కంపెనీల్లో ఫెటో ఉందన్నారు. ఈ ఉగ్రవాద సంస్థను నిర్మూలించేందుకు ఆయా దేశాలకు టర్కీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

తెలంగాణ ఇంజినీర్స్ డే సందర్భంగా ఖైరతాబాద్‌లో రిటైర్డ్ ఇంజినీర్ వెంకటరామారావు, తెలంగాణ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల సలహాదారు పెంటారెడ్డి, మిషన్ భగీరథ అడ్వైజర్ జిల్లాపురం జ్ఞానేశ్వర్‌రావు, రిటైర్డ్ ఇంజినీర్ బీ కిషన్‌లకు జీవిత సాఫల్య పురస్కారాలు అందజేసి సత్కరిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్‌రావు తదితరులు

మంథనిలో కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న మంత్రి కొప్పుల

కేసీఆర్ ఔదార్యాన్ని హర్షించాలి

మొదటిపేజీ తరువాయి...

కేవలం 500 టీఎంసీలు మాత్రమే. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగానే 3 టీఎంసీల నీటిని తరలించుకుపోయే పరిస్థితి ఉన్నపుడు ఆయన ఏం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చేసే వాటి గురించి గొడవ చేయడం, కోర్టుకు పోవడం చేస్తే అవేవీ తెగవు. పై రాష్ట్రాలు వాటి ప్రయోజనాలు అవి చూసుకుంటాయి. ఆల్మట్టి ఎత్తు పెంచడం కావచ్చు, గోదావరిని వాడుకొనేందుకు మహారాష్ట్ర ప్రయత్నించడం కావచ్చు, కాళేశ్వరంలో 3 టీఎంసీల నీటిని కేసీఆర్ లిఫ్ట్ చేయడం కావచ్చు.. వాటిని అడ్డుకునే పరిస్థితి లేదు. ఇప్పుడు మనకు కావాల్సింది రాష్ట్రాల మధ్య సఖ్యత. ముఖ్యమంత్రులు ఒకరికొకరు కలిసి పనిచేసే పరిస్థితి ఉండాలి. సీఎంలు కలిసి ఉంటే, కలిసి పనిచేసే గుణం ఉంటే అభివృద్ధి జరుగుతుంది. ఆ పరిస్థితి ఉంది కాబట్టే కేసీఆర్‌గారు ఓ అడుగు ముందుకేసి తెలంగాణ పరిధుల నుంచి కృష్ణా ఆయకట్టుకు నీరిచ్చేందుకు ముందుకొచ్చారు. శ్రీశైలం, సాగర్‌కు గోదావరి నీళ్లు తరలిస్తే తెలంగాణలోని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం, నల్లగొండ జిల్లాలతో పాటు, ఏపీలోని సీమ నాలుగు జిల్లాలు, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల కృష్ణా ఆయకట్టుకు నీరందుతుంది. మనం అడగగానే నీళ్లిచ్చేందుకు కేసీఆర్ ఒప్పుకొన్నారు. దానిగురించి రెండు రాష్ట్రాల ఇంజినీర్లు కలిసికట్టుగా కృషిచేస్తున్నారు. ఇద్దరం కలిసి బృహత్తర కృషి చేసి కృష్ణా ఆయకట్టును స్థిరీకరణ చేయవచ్చనేదానికి సంతోషించాల్సింది పోయి దాంట్లోనూ రాజకీయాలు వెదుకుతున్నారంటే.. ఇంతకంటే దిక్కుమాలిన ప్రతిపక్షం ప్రపంచచరిత్రలో మరేదీ ఉండదని నిస్సంకోచంగా చెప్తున్నా' అని ఏపీ అసెంబ్లీలో టీడీపీ తీరును తీవ్రంగా తప్పుబట్టారు.

తెలంగాణ పునర్నిర్మాణంలో.. ఇంజినీర్లది ముఖ్యపాత్ర

- సీఎం కేసీఆర్ సోషల్ ఇంజినీర్
- 'తెలంగాణ ఇంజినీర్స్ డే'లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- నలుగురు ఇంజినీర్లకు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఇంజినీర్లది ముఖ్యమైన పాత్ర అని రవాణాశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నవాబ్ అలీ నవాజ్ జంగ్ 142వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ఇంజినీర్స్ జేఏసీ, తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్, రోడ్లు, భవనాలశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఇంజినీర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నవాబ్ అలీ నవాజ్ జంగ్ జయంతిని (జూలై 11న) ఇంజినీర్స్ డేగా జరుపుకోవడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. నవాబ్ అలీ జీవిత విశేషాలను పాఠ్యాంశంగా చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. నిజాంసాగర్ నిర్మించి నవాబ్ అలీ జంగ్ రైతులకు ఎనలేని మేలు చేశారని గుర్తుచేశారు. కర్షకుల జీవితాల్లో మళ్లీ వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారని, సీఎం కేసీఆర్ ఇంజినీర్ కాదు కానీ, సోషల్ ఇంజినీర్ అని అభివర్ణించారు. మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులు మామూలువి కాదని, మూడున్నరేండ్లలోనే తెలంగాణ ఇంజినీర్లు వాటిని పూర్తిచేశారని అభినందించారు. రహదారులు, భవనాలశాఖ ఇంజినీర్ల సర్వీస్ అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు మంత్రి చెప్పారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసిన నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ ఆశయాలను సీఎం కేసీఆర్ అమలుచేస్తున్నారని జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్‌రావు పేర్కొన్నారు.

ఇంజినీర్లకు జీవిత సాఫల్య పురస్కారం

ఇంజినీరింగ్ విభాగంలో విశిష్ట సేవలందించి వివిధస్థాయిల్లో ఉన్న రిటైర్డ్ ఇంజినీర్లకు ఈ సందర్భంగా జీవిత సాఫల్య పురస్కారం (లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు) అందజేశారు. పురస్కారం అందుకున్నవారిలో తెలంగాణ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల సలహాదారు పెంటారెడ్డి, మిషన్ భగీరథ అడ్వైజర్ జిల్ల

అన్నీ ఉన్నా.. అసలుదేది!

కోహ్లీ కెప్టెన్సీపై పెరుగుతున్న అసంతృప్తి

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

విరాట్ కోహ్లీ భారత క్రికెట్‌కు దక్కిన ఆణిముత్యం. ఫార్మాట్ ఏదైనా..ప్రత్యర్థి ఎవరైనా..వేదిక ఎక్కడైనా వెన్నుచూపని ధీరత్వంతో పోరాడే క్రికెటర్. దేశ క్రికెట్‌కు దూకుడు నేర్పిన ఆటగాడు. సహచరులు కూడా తనలాగా కసితో ఆడాలని కోరుకునే కెప్టెన్. బ్యాట్స్‌మన్‌గా ఎదురైన రికార్డులను కొల్లగొడుతూ అభినవ మాస్టర్‌గా ప్రశంసలు పొందుతున్న విరాట్.. నాయకుడిగా ఆ స్థాయిలో రాణించలేకపోతున్నాడు. బ్యాట్స్‌మన్‌గా పరుగుల వరద పారిస్తున్న కోహ్లీ కెప్టెన్సీలో మెరుపులు మెరిపించలేక పోతున్నాడు. కొన్ని చారిత్రక విజయాలు సాధించినా.. ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో ప్రభావం చూపించలేకపోతున్నాడు. కోరిందే తడవుగా కోచ్‌ను మార్చినా.. అనుకున్న ఆటగాళ్లను ఎంపిక చేసినా.. అసలు విషయానికి వచ్చేసరికి అనుకున్న ఫలితం రావడం లేదు. ప్రపంచకప్ నిష్క్రమణకు దారి తీసిన కారణాలపై ఓ విశ్లేషణ.

కోట్లాది మంది ఆశలను మోసుకుంటూ బ్రిటిష్ గడ్డపై అడుగు పెట్టిన భారత జట్టు అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన టీమ్‌ఇండియా ప్రపంచకప్ పోరును ఘనంగానే ప్రారంభించినా.. కీలకమైన సెమీఫైనల్లో కివీస్ చేతిలో ఓడి నిష్క్రమించింది. టోర్నీలో దక్షిణాఫ్రికాతో మొదలుపెడితే శ్రీలంక వరకు అద్భుత విజయాలతో అందరికంటే టాప్‌లో నిలిచిన కోహ్లీసేన.. కివీస్‌పై పోరాడి ఓడింది. టోర్నీ మొత్తం మీద ఆల్‌రౌండ్ ఆటతీరుతో ఈసారి కప్ కచ్చితంగా కొడుతుందన్న ఆశలు రేపింది. అయితే ఈ మెగాటోర్నీలో టాప్-3 బ్యాట్స్‌మెన్ రోహిత్ శర్మ, రాహుల్, కోహ్లీ మినహా మిడిలార్డర్‌లో గొప్పగా రాణించింది ఎవరూ లేరు. ధవన్ గైర్హాజరీలో ఓపెనింగ్‌లో వచ్చిన రాహుల్ తన పాత్రకు న్యాయం చేసినా నాలుగో స్థానంలో యువ రిషబ్ పంత్ అంచనాలు అందుకోలేకపోయాడు. పెద్దన్నలా ధోనీ అంతోఇంతో రాణించినా.. అతనికి సహకరించే వారు కరువయ్యారు.

> జట్టుకు మద్దతుగా నిలిచేందుకు ఇక్కడికి (ఇంగ్లండ్) అధిక సంఖ్య లో వచ్చిన మా అభిమానులందరికీ కృతజ్ఞతలు. మా అందరికీ ఈ టోర్నీని మంచి జ్ఞాపకంగా మిగిల్చారు. మీరు జట్టుపై కురిపించిన ప్రేమను మేం ఆస్వాదించాం. మేమంతా చాలా నిరుత్సాహపడ్డాం. మీలాగే భావోద్వాగాలను పంచుకున్నాం. మేం చేయగలిగిందంతా చేశాం. జై హింద్. - కోహ్లీ

'మిడిల్'పై నిర్లక్ష్యం

గత కొంత కాలంగా టాపార్డర్ బ్యాట్స్‌మెన్ ప్రదర్శనతోనే నెట్టుకుంటూ వస్తున్న టీమ్‌ఇండియా మిడిలార్డర్‌పై నిర్లక్ష్యం వహించింది. ముఖ్యంగా కోహ్లీ కెప్టెన్సీలో మిడిలార్డర్‌లో నిలకడగా ఆడే ఆటగాడు లేకుండా పోయాడు. నాలుగో నంబర్‌లో లెక్కలేనన్ని ప్రయోగాలు చేశారు. కీలకమైన ప్రపంచకప్‌లో ఈ సమస్య కొట్టొచ్చినట్లు కనిపించింది. ఒక రకంగా చెప్పాలంటే టాపార్డర్‌ను కట్టడిచేస్తే పని అయిపోయినట్లేనని ప్రత్యర్థి జట్లకు అర్థమయ్యింది.

కోహ్లీకి ఎదురులేదు

భారత జట్టులో కెప్టెన్ కోహ్లీ మాటకు ఎదురులేదు. తనకు అడ్డు వస్తున్నాడని భావించిన దిగ్గజ అనిల్ కుంబ్లేను కోచ్‌గా తప్పించేదాకా నిద్రపోని కోహ్లీ.. చెప్పినట్లు వినే రవి శాస్త్రిని ఏరికోరి చీఫ్ కోచ్‌గా తెచ్చుకుని మాట నెగ్గించుకున్నాడు. ప్రపంచకప్ సందర్భంగా జట్టు తో పాటు భార్యలను అనుమతించాలని కోహ్లీ అలా కోరాడో లేదో బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. ఉన్నట్టుండి ఆటగాళ్లను తప్పించడం, అనూహ్యంగా కొందరిని ఎంపిక చేయడం వంటివన్ని కోహ్లీ ఆధిపత్యానికి నిదర్శనమని చెప్పొచ్చు.

విరాట్‌కు పోటీగా రోహిత్

కెప్టెన్ కోహ్లీకి రోహిత్ పోటీనిస్తున్నాడనే చెప్పొచ్చు. ప్రపంచకప్‌ముందు కోహ్లీ విశ్రాంతి తీసుకోగా రోహిత్ కెప్టెన్సీలో నిదహాస్ ట్రోఫీతో పాటు ఆసియా కప్‌లో భారత్‌ను విజేతగా నిలిపాడు.

'రిటైర్మెంట్ ఆలోచన రానివ్వకండి'

ధోనీకి లతా మంగేష్కర్ సూచన

ముంబై: భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతాడని గత కొంత కాలంగా వస్తున్న వార్తలపై ప్రఖ్యాత గాయని లతా మంగేష్కర్ స్పందించారు. 'ధోనీజీ.. ఈ మధ్య కాలంలో మీ రిటైర్మెంట్ గురించి వార్తలు వింటున్నాను. దయచేసి మీరు ఇలాంటి నిర్ణయం తీసుకోకండి. దేశానికి మీ ఆట అవసరం ఉంది. వీడ్కోలు పలికే ఆలోచన మీ మదిలోకి కూడా రానివ్వకండి ఇది నా విన్నపం' అని లతా మంగేష్కర్ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు.

ఐదు దశాబ్దాల ప్రపంచకప్ చరిత్రలో తొలి 5 టోర్నీల్లో మూడుసార్లు ఫైనల్ చేరి రన్నరప్‌తో సరిపెట్టుకున్న ఇంగ్లండ్.. 27 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ తుదిపోరుకు అర్హత సాధించింది. సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తు చిత్తుగా ఓడించి ఫైనల్ ఫైట్‌కు దూసుకెళ్లింది. తొలి సెమీఫైనల్లో భారత బ్యాటింగ్‌ను తలపించిన ఆసీస్ అందుకు తగిన మూల్యం చెల్లించుకుంది. ఎనిమిదోసారి ప్రపంచకప్ ఫైనల్ చేరాలనుకున్న కంగారూల కలలను చిదిమేస్తూ.. బౌలింగ్‌లో వోక్స్, రషీద్ విజృంభిస్తే.. బ్యాటింగ్‌లో జాసెన్ రాయ్ ఆసీస్ పేసర్లతో చెడుగుడాడుకున్నాడు. ఫలితంగా మరో 108 బంతులు మిగిలుండగానే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించిన ఇంగ్లండ్ సొంతగడ్డపై సగర్వంగా తుదిపోరుకు చేరింది. ఫైనల్లో తలపడే రెండు జట్లూ ఇప్పటి వరకు కప్పు కొట్టకపోవడంతో.. కొత్త చాంపియన్‌ను చూసే అవకాశం దక్కనుంది. బ్యాటింగే బలంగా దూసుకొచ్చిన ఇంగ్లండ్ క్రికెట్ మక్కా లార్డ్స్‌లో ఆదివారం జరిగే ఫైనల్లో నాణ్యమైన పేస్ వనరులున్న న్యూజిలాండ్‌ను ఢీకొట్టనుంది. ఇంకేముంది ఇక చలో లార్డ్స్..

వారెవ్వా ఇంగ్లండ్

సెమీస్‌లో ఆస్ట్రేలియాపై ఘనవిజయం

మెరిసిన వోక్స్, రషీద్, రాయ్.. లార్డ్స్‌లో కివీస్‌తో బిగ్‌ఫైట్

27 ఏండ్ల తర్వాత ఫైనల్‌కు

వోక్స్ (3/20)

రాయ్ (85)

బర్మింగ్‌హామ్: ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా పోరాటం కూడా సెమీఫైనల్లోనే ముగిసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆతిథ్య ఇంగ్లండ్ 27 ఏండ్ల తర్వాత విశ్వసమరం తుదిపోరుకు అర్హత సాధించింది. గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై గెలిచి ఫైనల్ చేరింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్ 49 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (119 బంతుల్లో 85; 6 ఫోర్లు), ఒంటరి పోరాటం చేయగా.. అలెక్స్ కారీ (46; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో రషీద్, వోక్స్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ 32.1 ఓవర్లలో 2 వికెట్లకు 226 పరుగులు చేసింది. జాసన్ రాయ్ (65 బంతుల్లో 85; 9 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగితే.. రూట్ (46 బంతుల్లో 49 నాటౌట్; 8 ఫోర్లు), మోర్గాన్ (39 బంతుల్లో 45 నాటౌట్; 8 ఫోర్లు) రాణించారు. వోక్స్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఆదివారం లార్డ్స్‌లో జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో ఆతిథ్య ఇంగ్లండ్ తలపడనుంది.

రెచ్చిపోయిన రాయ్

లక్ష్యం మరీ పెద్దది కాకపోవడంతో ఎలాంటి తడబాటుకు గురికాని ఇంగ్లండ్ ఆడుతూ పాడుతూ టార్గెట్ ఛేజ్ చేసింది. ఓపెనర్లు రాయ్, బెయిర్‌స్టో (34; 5 ఫోర్లు) ఆరంభంలో ఆచితూచి ఆడినా.. కుదురుకున్నాక స్కోరు బోర్డును ఉరకలెత్తించారు. స్టార్క్ బౌలింగ్‌లో 2 ఫోర్లు, ఒక సిక్స్‌తో బాదుడు మొదలు పెట్టిన రాయ్ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఫలితంగా పవర్ ప్లే ముగిసేసరికి ఇంగ్లండ్ వికెట్ నష్టపోకుండా 50 పరుగులు చేసింది. పరుగులు కట్టడి చేసేందుకు ఆసీస్ కెప్టెన్ ఫించ్ స్పిన్నర్ లియాన్‌ను రంగంలోకి దింపితే.. రాయ్ 6,4తో అతడికి స్వాగతం పలికాడు. మరి కాసేపటికే స్టార్క్ బౌలింగ్‌లో మరో 2 బౌండ్రీలు బాది 50 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో బెయిర్ స్టో కూడా బ్యాట్‌కు పనిచెప్పడంతో.. ఇంగ్లండ్ చూస్తుండగానే సెంచరీ మార్క్ దాటింది. ప్రమాదకరంగా మారిన జోడీని విడదీసేందుకు ఫించ్.. స్మిత్‌కు బంతినిస్తే రాయ్ హ్యాట్రిక్ సిక్సర్లతో పండుగ చేసుకున్నాడు. తొలి బంతిని లాంగాన్ మీదుగా తరలించిన రాయ్.. రెండోదాన్ని బౌలర్ తలమీదుగా గీత దాటించాడు. ఇక మూడో బంతైతే.. ఏకంగా గ్రౌండ్ బయట పడటం విశేషం. తొలి వికెట్‌కు 124 జోడించాక బెయిర్ స్టో వెనుదిరిగాడు. కాసేపటికే అంపైర్ తప్పుడు నిర్ణయానికి రాయ్ కూడా పెవిలియన్ బాటపట్టాడు. బంతి బ్యాట్‌కు తాకకపోయినా అంపైర్ ఔటివ్వడం.. అప్పటికే రివ్యూ కోల్పోవడంతో రాయ్ అసంతృప్తితో మైదానం వీడాడు. అర్ధశతకానికి 50 బంతులు తీసుకున్న రాయ్ ఆ తర్వాత 15 బంతుల్లోనే 35 పరుగులు చేయడం విశేషం. అప్పటికి విజయానికి 77 పరుగులు కావాల్సి ఉండగా.. కెప్టెన్ మోర్గాన్, రూట్ మిగిలిన లాంఛనం పూర్తి చేశారు.

అతనొక్కడే..

ఆస్ట్రేలియా ఆ మాత్రం స్కోరు చేయగలిగిందంటే స్మిత్ పోరాటం వల్లే. 14/3తో పీకల్లోతు కష్టాల్లో పడ్డ ఆసీస్‌కు స్మిత్ అనితర సాధ్యమైన ఆటతో పోరాడే స్కోరు సాధించి పెట్టాడు. మెగాటోర్నీలో జోరు మీదున్న కెప్టెన్ ఆరోన్ ఫించ్ (0) ఎదుర్కొన్న తొలి బంతికే 'గోల్డెన్ డక్'గా పెవిలియన్ చేరాడు. న్యూజిలాండ్‌తో సెమీస్‌లో కోహ్లీ ఔటైన విధానాన్ని తలపిస్తూ.. ఆర్చర్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. ఇన్నింగ్స్ మొదటి బంతికే బౌండ్రీతో ఖాతా తెరిచిన డేవిడ్ వార్నర్ (9) కూడా ఫించ్ వెంట నడిచాడు. టోర్నీలో తొలి మ్యాచ్ ఆడిన హ్యాండ్స్‌కోంబ్ (4) ఎక్కువ సేపు నిలువలేకపోయాడు. ఫలితంగా పవర్ ప్లే ముగిసేసరికి ఆసీస్ 3 వికెట్ల నష్టానికి 27 పరుగులే చేసింది. ఈ దశలో మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్, అలెక్స్ కారీ జోడీ సాధికారికంగా ఆడుతూ.. ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. భారీ షాట్లకు పోకుండా ఒకటీ, రెండు పరుగులతో స్కోరు బోర్డును నెమ్మదిగా కదిలించింది. 25వ ఓవర్లోగానీ కంగారూల స్కోరు 100 దాటలేదు. నాలుగో వికెట్‌కు 103 పరుగుల భాగస్వామ్యం నమోదైన దశలో స్పిన్నర్ రషీద్ ఖాన్ ఆసీస్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. ఒకే ఓవర్‌లో కారీతో పాటు స్టొయినిస్ (0)ను ఔట్ చేసి ఇంగ్లండ్ శిబిరంలో ఆనందం రెట్టింపు చేశాడు. కొన్ని చక్కటి షాట్లతో అలరించిన మ్యాక్స్‌వెల్ (22; 2 ఫోర్లు, 1 సిక్స్) పెవిలియన్ చేరేందుకు తొందరపడ్డాడు. మరో ఎండ్‌లో స్టెయిక్ రొటేట్ చేయగలిగే ఆటగాడు లేకపోవడంతో స్మిత్ స్టెయికింగ్ ఎక్కువగా తన వద్దే ఉంచుకున్నా భారీ షాట్లు ఆడలేకపోయాడు. 15 ఓవర్ల పాటు ఒక్క బౌండ్రీ కూడా కొట్టలేకపోయాడు. ఆఖర్లో స్టార్క్ (29; 1 ఫోర్, 1 సిక్స్) దాటిగా ఆడటంతో 45వ ఓవర్లో ఆసీస్ 200 మార్క్ దాటింది. కాసేపటికి వరుస బంతుల్లో స్మిత్, స్టార్క్ ఔటవడంతో కంగారూల ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. జొఫ్రా ఆర్చర్ (2/32) తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు.

కారీ (46)

రక్తం కారుతున్నా..

ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఆర్చర్ వేసిన 8వ ఓవర్ చివరి బంతి అలెక్స్ కారీ హెల్మెట్ నుంచి దూసుకుంటూ అతడి దవడ ముందు భాగానికి బలంగా తాకింది. సుమారు గంటకు 140 కిలో మీటర్ల వేగంతో దూసుకొచ్చిన బంతి హెల్మెట్ గ్రిల్ దాటి అతడికి తాకడంతో చర్మం చీలి రక్తం కారింది. అప్పటికే 19/3తో కష్టాల్లో ఉన్న ఆస్ట్రేలియా.. కారీ సేవలు కోల్పోయేలానే కనిపించింది. కానీ మైదానంలోనే ప్రథమ చికిత్స తీసుకున్న అతడు తిరిగి బ్యాటింగ్ కొనసాగించి గొప్ప స్ఫూర్తి చాటాడు. అతని పోరాటం ఒకప్పుడు (విండీస్‌పై, 2002లో)విరిగిన దవడతోనే బౌలింగ్ చేసిన కుంబ్లేను గుర్తు చేసింది.

స్కోర్ బోర్డు

ఆస్ట్రేలియా: వార్నర్ (సి) బెయిర్‌స్టో (బి) వోక్స్ 9, ఫించ్ (ఎల్బీ) ఆర్చర్ 0, స్మిత్ (రనౌట్/బట్లర్) 85, హ్యాండ్స్‌కోంబ్ (బి) వోక్స్ 4, కారీ (సి) (సబ్) విన్స్ (బి) రషీద్ 46, స్టొయినిస్ (ఎల్బీ) రషీద్ 0, మ్యాక్స్‌వెల్ (సి) మోర్గాన్ (బి) ఆర్చర్ 22, కమ్మిన్స్ (సి) రూట్ (బి) రషీద్ 6, స్టార్క్ (సి) బట్లర్ (బి) వోక్స్ 29, బెరెన్‌డార్ఫ్ (బి) వుడ్ 1, లియాన్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు:** 16, **మొత్తం:** 49 ఓవర్లలో 223 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-4, 2-10, 3-14, 4-117, 5-118, 6-157, 7-166, 8-217, 9-217, 10-223, **బౌలింగ్:** వోక్స్ 8-0-20-3, ఆర్చర్ 10-0-32-2, స్టోక్స్ 4-0-22-0, వుడ్ 9-0-45-1, ప్లంకెట్ 8-0-44-0, రషీద్ 10-0-54-3.

ఇంగ్లండ్: రాయ్ (సి) కారీ (బి) కమ్మిన్స్ 85, బెయిర్‌స్టో (ఎల్బీ) స్టార్క్ 34, రూట్ (నాటౌట్) 49, మోర్గాన్ (నాటౌట్) 45, **ఎక్స్‌ట్రాలు:** 13, **మొత్తం:** 32.1 ఓవర్లలో 226/2. **వికెట్ల పతనం:** 1-124, 2-147, **బౌలింగ్:** బెరెన్‌డార్ఫ్ 8.1-2-38-0, స్టార్క్ 9-0-70-1, కమ్మిన్స్ 7-0-34-1, లియాన్ 5-0-49-0, స్మిత్ 1-0-21-0, స్టొయినిస్ 2-0-13-0.

1 ఒక ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు (27) తీసిన బౌలర్‌గా స్టార్క్ అగ్రస్థానానికి చేరాడు. ఆసీస్ దిగ్గజం మెక్‌గ్రాత్ 2007 టోర్నీలో 26 వికెట్లు పడగొట్టాడు.

4 ప్రపంచకప్ ఫైనల్ చేరడం ఇంగ్లండ్‌కు ఇది నాలుగోసారి. గతంలో మూడుసార్లు రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది.

> ఈ రోజు మా ఆట తీరు బాలేదు. తొలి పవర్ ప్లేలో 27 పరుగులకే 3 వికెట్లు కోల్పోవడం దెబ్బ కొట్టింది. క్రితంసారి ఇంగ్లండ్‌లో పర్యటించిన దానికంటే ప్రస్తుతం మెరుగైనే ప్రదర్శన చేశాం. ఓవరాల్‌గా ఈ టోర్నీలో చాలా సానుకూల అంశాలను గుర్తించాం.
> -ఫించ్, ఆసీస్ కెప్టెన్

> తొలి పది ఓవర్లలో వోక్స్ చాలా ప్రమాదకర బౌలర్, ఆర్చర్ కూడా ఆకట్టుకున్నాడు. ఓపెనర్లు రాయ్, బెయిర్‌స్టో అదరగొట్టారు. 2015తో పోల్చుకుంటే మేం చాలా మెరుగయ్యాం. ఆటగాళ్లంతా లార్డ్స్‌లోనూ ఇదే ఆటతీరు కనబర్చాలని కోరుకుంటున్నా.
> - మోర్గాన్, ఇంగ్లండ్ కెప్టెన్

చరిత్రకు అడుగు దూరంలో..

వింబుల్డన్ ఫైనల్లో సెరెనా.. స్వితోలినాను చిత్తు చేసిన హలెప్.. ఫైనల్ చేరిన తొలి రొమేనియా మహిళగా రికార్డు

సెరెనా

నేటి పురుషుల సెమీస్‌లో..
జొకోవిచ్ X బటిస్టా
ఫెదరర్ X నాదల్
సాయంత్రం 5.30 గంటల నుంచి

మరో గ్రాండ్‌స్లామ్ టోర్నీ గెలిచి టెన్నిస్ ఆల్‌టైమ్ గ్రేట్ మార్గరెట్ కోర్ట్ రికార్డును సమం చేయాలని పట్టుదలగా ఉన్న సెరెనా విలియమ్స్ స్థాయికి తగ్గ ప్రదర్శనతో వింబుల్డన్ తుదిపోరుకు చేరింది. సెమీస్‌లో ప్రత్యర్థి స్విర్కోవాను గంటలోపే మట్టికరిపించింది. మరో మ్యాచ్‌లో స్వితోలినాను సునాయాసంగా ఓడించి వింబుల్డన్ సింగిల్స్‌లో ఫైనల్ చేరిన తొలి రొమేనియా మహిళగా సిమోనా హలెప్ రికార్డు సృష్టించింది.

లండన్ : 37 ఏండ్ల వయసులో టెన్నిస్‌కోర్టులో మెరుపు వేగంతో పరుగెడుతూ... బంతిని బలంగా బాదుతూ.. ప్రత్యర్థులను మట్టికరిపిస్తున్న అమెరికా దిగ్గజం సెరెనా విలియమ్స్ వింబుల్డన్ గ్లాండ్‌స్లామ్ టైటిల్‌ను ఎనిమిదోసారి కైవసం చేసుకునేందుకు అడుగుదూరంలో నిలబడింది. గురువారమిక్కడ జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో సెరెనా 6-1, 6-2తో బార్బోరా స్ట్రికోవా(చెక్ రిపబ్లిక్)పై సునాయాసంగా గెలిచి ఫైనల్లో ప్రవేశించింది. స్ట్రికోవా కేవలం 1ఏస్ సహా 8 విన్నర్లను సాధించగా.. సెరెనా మొత్తం 4ఏస్‌లు, 28 విన్నర్లు బాది సత్తా చాటింది. 59నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి తుదిపోరుకు అర్హత సాధించింది. వింబుల్డన్ ఫైనల్ చేరడం సెరెనాకు ఇది ఓవరాల్‌గా 11వ సారి కాగా.. ఇప్పటిదాకా ఏడుసార్లు టైటిల్‌ను ముద్దాడింది. శనివారం జరిగే ఫైనల్‌లో గెలిచి.. టెన్నిస్ ఆల్‌టైం గ్రేట్ మార్గరెట్ కోర్ట్ పేరిట ఉన్న మహిళల సింగిల్స్ అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల(24) రికార్డును సమం చేయాలని సెరెనా(23) పట్టుదలగా ఉంది.

తొలి రొమేనియన్ మహిళగా హలెప్..

మరో సెమీస్‌లో 8వ సీడ్ ఎలీనా స్వితోలినా (ఉక్రెయిన్)పై 2018 ఫ్రెంచ్ ఓపెన్ విజేత, 7వ సీడ్ సిమోనా హలెప్ అలవోక విజయం సాధించింది. 6-1, 6-3తేడాతో గంటా 13 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి తొలిసారి వింబుల్డన్ ఫైనల్‌కు చేరింది. అలాగే ఈ ఘనత సాధించిన మొదటి రొమేనియా మహిళగా హలెప్ చరిత్ర సృష్టించింది. మ్యాచ్ మొత్తం మీద 26 విన్నర్లు సహా ప్రత్యర్థి స్వితోలినా సర్వీస్‌ను ఆమె ఐదుసార్లు బ్రేక్ చేసింది. ప్రారంభం నుంచి పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఏ దశలోనూ తగ్గకుండా తొలి సెట్‌ను 6-1తో, రెండో సెట్‌ను 6-3తో కైవసం చేసుకొని హలెప్ సత్తా చాటింది. శనివారం జరిగే మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో సెరెనా విలియమ్స్, హలెప్ తలపడనున్నారు.

హలెప్

పంత్‌కు యువీ మద్దతు

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో జరిగిన ప్రపంచకప్ సెమీఫైనల్లో భారీ షాట్‌కు ప్రయత్నించి ఔటవడంపై రిషబ్ పంత్‌పై విమర్శలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ పీటర్సన్ కూడా పంత్ షాట్ ఎంపికను ట్విట్టర్ వేదికగా తప్పుబట్టాడు. ఎన్నోసార్లు పంత్ తప్పుడు షాట్లకు ప్రయత్నించి ఔటయ్యాడని, ఇది బాధాకరమని అన్నాడు. దీనిపై భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ స్పందించాడు. 'అతడు (రిషబ్ పంత్) కేవలం 8 అంతర్జాతీయ వన్డేలే ఆడాడు. అతడి తప్పేం లేదు. కచ్చితంగా నేర్చుకుని మరింత మెరుగుపడతాడు' అని యువరాజ్ అన్నాడు.

యూఎస్ రెండో రౌండ్‌లో లక్ష్యసేన్

ఫుల్లెర్టన్(యూఎస్ఏ): యూఎస్ బ్యాడ్మింటన్ ఓపెన్‌లో లక్ష్యసేన్, సౌరభ్ వర్మ, ప్రణయ్ రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో యువ షట్లర్ లక్ష్యసేన్ 21-11, 21-18తో సీనియర్ కశ్యప్‌పై విజయం సాధించాడు. అర్ధగంటలోనే కశ్యప్‌ను చిత్తుచేసిన లక్ష్యసేన్ రెండో రౌండ్‌లో సౌరభ్‌తో తలపడుతాడు.

జెరెమీ సంచలనం

అపియా(సమోవా): భారత యువ వెయిట్‌లిఫ్టర్ జెరెమీ లాల్‌రినుంగ సంచలనం సృష్టించాడు. కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో ఏకంగా మూడు కొత్త రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. గురువారం 67కిలోల స్నాచ్ విభాగంలో బరిలోకి దిగిన ఈ 16 ఏండ్ల యువ వెయిట్‌లిఫ్టర్ 136 కిలోల బరువు ఎత్తి యూత్ వరల్డ్, ఆసియా, కామన్వెల్త్ రికార్డులను తిరుగరాశాడు. గత ఏప్రిల్‌లో చైనాలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో 134 బరువు ఎత్తి యూత్ వరల్డ్, ఆసియా రికార్డును జెరెమీ సవరించిన సంగతి తెలిసిందే. సమోవాలో జరుగుతున్న ప్రస్తుత కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో స్నాచ్‌లో అదరగొట్టిన జెరెమీ..క్లీన్ అండ్ జెర్క్‌లో రాణించలేకపోయాడు. ఈ టోర్నీలో ప్రదర్శన ఆధారంగా టోక్యో(2020) ఒలింపిక్స్‌కు ర్యాంకింగ్స్‌ను ప్రకటించనున్నారు. టోర్నీలో భారత్‌కు నాలుగు స్వర్ణాలు సహా రెండు రజతాలు, ఒక కాంస్య పతకం దక్కాయి. పురుషుల 73కిలోల విభాగంలో అచింతా సెహులీ 305 కిలోలతో స్వర్ణం సాధించగా, మన్‌ప్రీత్‌కౌర్(207కి) పసిడి అందుకుంది.

భారత్ ఓటమిని తట్టుకోలేక..

ఖానాకుల్/భవానీపట్నా: ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో భారత్ ఓటమిని తట్టుకోలేక ఒకరు మృతి చెందగా, మరొకరు ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. కివీస్‌తో మ్యాచ్‌లో ధోనీ రనౌట్ కావడాన్ని మొబైల్‌లో చూసిన పశ్చిమబెంగాల్‌కు చెందిన శ్రీకాంత్ మైతీ గుండెపోటుతో బుధవారం మరణించాడు. సెమీస్ మ్యాచ్ చూస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. హుటాహుటిన దగ్గరలోని రూరల్ దవాఖానకు తరలించినా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారని పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు ఒడిశా కలహండి జిల్లాకు చెందిన సంబ్రు బోయి విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు.

సెన్సెక్స్	నిఫ్టీ
38,823	11,583
↗266	↗84

ముడి చమురు (బ్రెంట్) ↘66.53 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)

24 క్యారెట్లు	35,800
22 క్యారెట్లు	35,630
వెండి (కిలో)	39,200

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	65.60	71.10
యూరో	73.70	80.20
బహ్రెయిన్ దినార్	172.00	186.00
కువైట్ దినార్	216.00	230.00
సౌదీ రియాల్	17.20	19.00
యూఏఈ దిర్హామ్	17.60	19.30

చికెన్ ధరలు

(రూ.లలో)

ఫారం ధర	80.00
రిటైల్ లైవ్	102.00
డ్రెస్డ్	148.00
స్కిన్‌లెస్	168.00

నెక్ (వంద గుడ్లకు)

(రూ.లలో)

హైదరాబాద్	415-00
రంగారెడ్డి	415-00
మెదక్	415-00
కరీంనగర్	418-00
వరంగల్	418-00
రిటైల్ ప్రైస్	4-75

అమ్మకానికి అనిల్ ఆస్తులు

రుణ భారాన్ని తగ్గించుకునే దిశగా అంబానీ అడుగులు

రోడ్డు ప్రాజెక్టుల నుంచి రేడియో స్టేషన్ల వరకు విక్రయం

రూ.21,700 కోట్ల సమీకరణకు ప్రయత్నాలు

న్యూఢిల్లీ, జూలై 11:

పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన అనిల్ అంబానీ.. ఈ ఊబి నుంచి బయటకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే రోడ్డు ప్రాజెక్టుల నుంచి రేడియో స్టేషన్ల వరకున్న ఆస్తులను అమ్మాలని యోచిస్తున్నారు. అనిల్ అంబానీ గ్రూప్‌లో చాలా రకాల సంస్థలు.. వివిధ వ్యాపారాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. బీమా, మౌలిక, టెలికం, కేబుల్ నెట్‌వర్క్, విద్యుత్, ఇంజినీరింగ్, ఫైనాన్స్ తదితర రంగాల్లో అనిల్‌కు వ్యాపారాలున్నాయి. అయితే వీటిలో నాలుగు సంస్థల రుణ భారమే దాదాపు రూ.67,000 కోట్లుగా ఉన్నది. ఒక్క రిలయన్స్ క్యాపిటల్ అప్పులే రూ.38,900 కోట్లుగా ఉన్నాయి. అలాగే రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.17,800 కోట్లు, రిలయన్స్ నోవల్ అండ్ ఇంజినీరింగ్‌పై రూ.7,000 కోట్లు, రిలయన్స్ పవర్‌కు రూ.3,000 కోట్ల రుణ భారం ఉన్నది.

ఆర్‌కామ్ అప్పులు రూ.35,600 కోట్లు

ఒకప్పుడు దేశీయ టెలికం రంగాన్నే ఓ ఊపు ఊపిన ఆర్‌కామ్.. ఇప్పుడు దివాలా కోర్టులో దిగాలుగా నించున్నది. ఈ ఏడాది మార్చి 31 నాటికి సంస్థ రుణ భారం సుమారు రూ.35,600 కోట్లుగా ఉన్నది. పెరిగిన పోటీ వాతావరణం, స్పెక్ట్రం ధరలు, 4జీ నెట్‌వర్క్‌తో రిలయన్స్ జియో రాక, తదనంతర పరిణామాలు రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) మూతబడ్డానికి దారితీశాయి. అన్న ముకేశ్ అంబానీ.. తమ జియో కోసం ఆర్‌కామ్ నెట్‌వర్క్ వ్యవస్థను కొనుగోలు చేద్దామని డీల్ కుదుర్చుకున్నా.. అది ఓకే కాకపోవడంతో అనిల్ ఆశలు ఆవిరయ్యాయి. చివరకు దివాలా ప్రక్రియకు వెళ్లాల్సి వచ్చింది.

ఇన్‌ఫ్రా, క్యాపిటల్ ఆస్తులపైనే గురి

రుణ భారాన్ని తగ్గించుకోవడానికి చూస్తున్న అనిల్ అంబానీ.. రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ క్యాపిటల్ ఆస్తులపైనే దృష్టి పెట్టారు. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన 9 రోడ్డు ప్రాజెక్టులను విక్రయించాలని భావిస్తున్నారు. వీటి విలువ రూ.9,000 కోట్లు. అలాగే ముంబైలోని శాంతాక్రజ్ ఈస్ట్‌లోగల రిలయన్స్ సెంటర్ ఆఫీస్‌ను దీర్ఘకాలిక వ్యవధికిగాను లీజుకు ఇవ్వనున్నారు. దీనివల్ల సమకూరే మొత్తాన్ని ఇంకా అంచనా వేయలేదు. రిలయన్స్ క్యాపిటల్‌లోని రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో 100 శాతం వాటా విక్రయం, రిలయన్స్ నిప్పాన్ లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్, ప్రైం ఫోకస్, ప్రైవేట్ ఈక్విటీ/రియల్ ఎస్టేట్, రేడియో వ్యాపారాలనూ అమ్మేస్తుండగా, వీటి ద్వారా రూ.12,700 కోట్లు రావచ్చని అంచనా. ఇలా మొత్తం రూ.21,700 కోట్లను పొందాలని అనిల్ చూస్తున్నారు. దీంతో కొంతైనా అప్పుల కష్టాలను తీర్చుకోవాలని భావిస్తున్నారు.



రూ.25 కోట్ల చోక్సీ ఆస్తులు జప్తు

న్యూఢిల్లీ, జూలై 11: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పరారీ రత్నాల వ్యాపారి మెహుల్ చోక్సీకి చెందిన మరో రూ.24.77 కోట్ల ఆస్తులను జప్తు చేసింది. ఇవన్నీ కూడా దేశ, విదేశాల్లో ఉన్నాయని గురువారం అధికారులు తెలిపారు. దుబాయ్‌లోని మూడు వాణిజ్య ఆస్తులుసహా ఓ మెర్సిడెస్ బెంజ్ కారు, కొన్ని డిపాజిట్లను అటాచ్ చేసినట్లు వివరించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.13,500 కోట్ల మోసంలో రత్నాల వ్యాపారి చోక్సీ కూడా ప్రధాన నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఈయన మేనల్లుడు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ మరో నిందితుడవగా, బ్రిటన్ జైలులో విచారణ ఖైదీగా ఉన్న సంగతీ విదితమే. ఈ కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీ లాండరింగ్ కేసును నమోదు చేసిన ఈడీ.. విస్తృత స్థాయిలో దర్యాప్తు చేస్తున్నది. పీఎన్‌బీ మోసంలో చోక్సీ వాటా రూ.6,097.73 కోట్లుగా ఉండగా, ఇప్పటిదాకా ఆయనకు చెందిన రూ.2,534.7 కోట్ల ఆస్తులను ఈడీ స్వాధీనం చేసుకున్నది. ప్రస్తుతం చోక్సీ కరేబియన్ దీవుల్లో దాక్కోగా, అక్కడి పౌరసత్వాన్ని కలిగి ఉన్నాడు. స్థానికంగా పెట్టుబడుల ద్వారా ఈ హోదాను పొందినది తెలిసిందే.

స్మార్ట్‌ఫోన్లపై పెరిగిన సైబర్‌దాడులు

హైదరాబాద్, జూలై 11: పర్సనల్ కంప్యూటర్లతోపాటు స్మార్ట్‌ఫోన్లపై కూడా సైబర్‌దాడులు మరింత పెరిగాయి. ఆండ్రాయిడ్ ఆధారిత మొబైళ్లపై సైబర్ దాడులు చేయడం మరింత సులభమని సైబర్ రిస్క్ మానిటర్(సీఆర్ఎం) పేరుతో కే7 నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 51 శాతం వెబ్ ఆధారంగా దాడులు జరుగగా, మిగతా 49 శాతం మొబైల్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ఆధారంగా జరిగాయని తెలిపింది. ఈ సందర్భంగా కే7 కంప్యూటింగ్ సీఈవో పురుషోత్తం మాట్లాడుతూ..సైబర్ సెక్యూరిటీ ప్రస్తుతం ప్రపంచ సమస్యగా మారిందని, ఈ దాడులను నియంత్రించడానికి 25 ఏండ్ల క్రితమే ఈ సేవలను ఆరంభించినట్లు చెప్పారు. స్మార్ట్‌ఫోన్లలో ఉండే యాప్స్ ద్వారా కూడా ఈ దాడులు జరిగే అవకాశం ఉన్నదని, వీటిలో గూగుల్ క్యాలెండర్, గూగుల్ వీడియోప్రో, గూగుల్ యాప్స్, గూగుల్ సర్చ్, గేమ్స్, వీడియో డౌన్‌లోడ్స్ కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.74 కోట్లుగా నమోదైన కంపెనీ టర్నోవర్ ఈసారి రూ.100 కోట్లకు చేరుకునే అవకాశం ఉన్నది. ప్రస్తుతం సంస్థకు భారత్‌లో కోటి మంది వినియోగదారులు భారత్‌లో ఉండగా, జపాన్‌లో కోటిన్నర మంది ఉన్నట్లు తెలిపారు.

సరికొత్తగా హోండా 'డబ్ల్యూఆర్-వీ'

న్యూఢిల్లీ, జూలై 11: జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ హోండా కార్స్..దేశీయ మార్కెట్లోకి సరికొత్తగా ఎస్‌యూవీ 'డబ్ల్యూఆర్-వీ' మోడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఢిల్లీ షోరూంలో ఈ కారు ధర రూ.9.95 లక్షలుగా నిర్ణయించింది. ప్రీమియం లుక్ ఇండే విధంగా డిజైన్ చేసిన ఈ కారును డైట్లైంలో వచ్చే హెడ్ ల్యాంప్, రియర్ పార్కింగ్ సెన్సార్, ముందుభాగంలో కూర్చుండే ప్రయాణికుడి కోసం సీట్ బెల్ట్ రిమైండర్, హై-స్పీడ్ అలర్ట్, స్పీడ్ సెన్సింగ్ ఆటో డోర్ లాక్ వంటి ఫీచర్స్ ఉన్నాయని హెచ్‌సీఐఎల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, రాజేష్ గోయల్ తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఆఫర్

సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. బీఎస్ఎన్ఎల్ 498 పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్ తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 12 నుంచి 90 రోజులపాటు అమలులో ఉండనున్నదని ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్లాన్ కింద ఏ నెట్‌వర్క్‌కైనా అన్‌లిమిటెడ్ కాల్స్‌తోపాటు రోమింగ్ చార్జీలు ఉచితం, 30 జీబీల డాటా, వెయ్యి ఎస్ఎంఎస్‌లు నెల రోజులపాటు లభించనున్నాయి.

మార్కెట్లకు ఫెడ్ కిక్కు

266 పాయింట్లు లాభపడిన సూచీ



ముంబై, జూలై 11: బడ్జెట్ దెబ్బకు గడిచిన కొన్ని రోజులుగా దిగువముఖం పట్టిన దేశీయ మార్కెట్లు నెలకు కొట్టిన బంతిలా తిరిగి పుంజుకున్నాయి. వడ్డీరేట్లు తగ్గించే అవకాశం ఉందన్న అమెరికా ఫెడరల్ రిజర్వు చీఫ్ జెరోమ్ పోవెల్ వ్యాఖ్యలు మార్కెట్లుకు మరింత కిక్కునిచ్చాయి. ప్రారంభం నుంచే లాభాల బాట పట్టిన సూచీలు ఏ దశలోనూ వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఇంట్రాడేలో 335 పాయింట్లు లాభపడిన బీఎస్ఈ సెన్సెక్స్ 30 షేర్ల ఇండెక్స్ సూచీ చివరకు 266.07 పాయింట్లు ఎగబాకి 38,834.11 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ మరో 84 పాయింట్లు అందుకొని 11, 582.90 వద్ద స్థిరపడింది. మసకబారుతున్న అమెరికా వృద్ధికి ఊతమివ్వడానికి తగిన చర్యలు తీసుకోనున్నట్లు యూఎస్ ఫెడరల్ రిజర్వు చైర్మన్ జెరోమ్ పోవెల్ వ్యాఖ్యలు అంతర్జాతీయ మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఫలితంగా దేశీయ సూచీలు కూడా భారీగా పుంజుకున్నాయి. మార్కెట్లో ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ 4.46 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఇండస్ఇండ్ బ్యాంక్, టాటా మోటర్స్, వేదాంతా, ఎస్బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్‌ఫార్మా, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల షేర్లు 3.63 శాతం వరకు బలపడ్డాయి. మరోవైపు టెక్ మహీంద్రా, యెస్ బ్యాంక్, టీసీఎస్, ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీలు ఒక్క శాతంకు పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి.

ఫెడ్ చైర్మన్ వ్యాఖ్యలు స్టాక్ మార్కెట్లకు ఆక్సిజన్‌లా పనిచేశాయని, దేశీయ మార్కెట్లు అరశాతానికి పైగా లాభపడ్డాయని శ్యాంట్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అధికారి సునీల్ శర్మ తెలిపారు. వడ్డీరేట్ల తగ్గింపుతో ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యలభ్యత పరిస్థితులు మెరుగుపడనుండటం మదుపరులకు కలిసొచ్చిందన్నారు. రంగాల వారీగా చూస్తే ఆటో, మెటల్, టెలికం, రియల్టీ, యుటిలిటీ, ఫైనాన్స్ రంగ షేర్లకు మదుపరుల నుంచి వచ్చిన మద్దతుతో 1.84 శాతం లాభపడగా, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లు మాత్రం నష్టపోయాయి.

14 పైసలు లాభపడ్డ రూపాయి

ఫెడ్ చైర్మన్ వ్యాఖ్యలు అమెరికా కరెన్సీపై ప్రతికూల ప్రభావం చూపాయి. ఫలితంగా ఇతర కరెన్సీలు లాభపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 14 పైసలు పెరిగి 68.44 వద్ద ముగిసింది. చమురు ధరలు పెరిగినప్పటికీ రూపాయి బలపడటం విశేషమని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 68.31 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు 68.30 నుంచి 68.48 మధ్యలో కదలాడింది.

8 రోజుల్లో రూ.21 వేల కోట్లు మటాష్

సంపదను కోల్పోయిన టైటాన్ కంపెనీ మదుపరులు

టాటా గ్రూపునకు చెందిన టైటాన్ కంపెనీ షేరు పాతళంలోకి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీ మందకొడి వృద్ధిని నమోదు చేసుకోనున్నదన్న సంకేతాలు, పసిడి దిగుమతులపై సుంకాన్ని 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కంపెనీని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. దీంతో గడిచిన ఎనిమిది ట్రేడింగ్‌లలో కంపెనీ షేరు ధర 17 శాతం పతనం చెందింది. జూలై 3న రూ.1,328గా నమోదైన షేరు ధర అమాంతం పడిపోయి రూ.1,100 కిందకు జారుకున్నది. ప్రముఖ పెట్టుబడిదారు రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా పెట్టుబడులు పెట్టిన టైటన్ కంపెనీ రేటింగ్‌ను తగ్గిస్తున్నట్లు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ప్రకటన ఎనలేని కష్టాలను తెచ్చిపెట్టింది. జూన్ 28 నుంచి ఇప్పటి వరకు కంపెనీ షేరు ధర 17 శాతం నష్టపోవడంతో రూ.21,232 కోట్ల మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. గత నెల చివర్లో రూ.1.18 లక్షల కోట్లుగా ఉన్న కంపెనీ విలువ ప్రస్తుతం రూ.97,274 కోట్లకు పడిపోయింది. గురువారం కంపెనీ షేరు ధర రూ.1,101 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 2.63 శాతం తగ్గి రూ.1,072.25 వద్దకు పడిపోయింది. గడిచిన ఏడాదికాలంగా 34.72 శాతం పెరిగిన షేరు ధర..గత వారంరోజుల్లో సగానికి సగం క్షీణించింది. స్టాక్ మార్కెట్లు 7.5 శాతం పెరిగినప్పటికీ కంపెనీ షేరు ధర భారీగా పతనమవడం విశేషం.

పసిడి జిగేల్..జిగేల్

- ఒకేరోజు రూ.930 పెరిగిన ధర
- రూ.35,800కి చేరిన తులం

న్యూఢిల్లీ, జూలై 11: పసిడి రికార్డు స్థాయిలో పెరుగుతున్నది. దేశరాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర ఒకేరోజు రూ.930 పెరిగి రూ.35,800కి చేరుకున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి లభించిన కొనుగోళ్ల మద్దతుతో కిలో వెండి రూ.300 అందుకొని రూ.39,200గా నమోదైంది. ఆర్థిక రాజధాని ముంబైలో బంగారమైతే రూ.34,716 పలుకుగా, వెండి రూ.38 వేలకు చేరింది. హైదరాబాద్‌లో పసిడి రూ.34,340కి, వెండి రూ.38,400 పలికింది. వడ్డీరేట్లను త్వరలో తగ్గించనున్నట్లు యూఎస్ ఫెడరల్ రిజర్వు చైర్మన్ పోవెల్ వ్యాఖ్యలతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించడంతో గ్లోబల్ మార్కెట్లో పసిడి ధర వారం గరిష్ఠ స్థాయికి చేరుకున్నదని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హరీష్ తెలిపారు. అంతర్జాతీయ దేశాల ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉండటం, అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతుండటంతో గోల్డ్ ధరలు పెరుగడానికి పరోక్షంగా కారణమన్నారు. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,420.80 డాలర్లు పలుకగా, అదే వెండి 15.24 డాలర్లకు చేరింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించిన నివేదిక ప్రకారం 99.9 శాతం, 99.5 శాతం కలిగిన బంగారం ధరలు రూ.930 ఎగబాకి రూ. 35,800కి, రూ.35,630కి చేరాయి. గ్లోబల్ మార్కెట్లకు తోడు స్థానిక ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం కూడా ధరలు పెరుగడానికి దోహదపడ్డాయని తెలిపింది.

హైదరాబాద్‌లో ఎస్అండ్‌పీ రెండో సెంటర్

750 మందికి ఉపాధి.. రెండు నెలల్లో మరో 100 మందికి

కంపెనీ దేశీయ ఎండీ అభిషేక్ తోమర్ వెల్లడి

హైదరాబాద్, జూలై 11:

రాష్ట్రానికి అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే పలు గ్లోబల్ సంస్థలు ఇక్కడ కార్యాలయాలను ఏర్పాటు చేయగా..తాజాగా అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీ..భాగ్యనగరంలో తన రెండో ఆఫీస్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ భారత కార్యకలాపాల ఎండీ అభిషేక్ తోమర్ మాట్లాడుతూ..నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్‌లో 850 మంది సిబ్బంది కూర్చోవడానికి వీలుండగా, ఇప్పటికే 750 మందిని రిక్రూట్ చేసుకున్నట్లు, మరో రెండు నుంచి మూడు నెలల్లో మిగతా వంద మందిని నియమించుకునే అవకాశం ఉన్నదన్నారు. టెక్నాలజీ రంగంలో నైపుణ్యం కలిగిన సిబ్బంది అధికంగా ఉండే హైదరాబాద్‌లో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సాంకేతిక, ఐటీ కార్యవర్గాన్ని మరింత విస్తరించడానికి ఈ సెంటర్ ఎంతో కీలకపాత్ర పోషించనున్నదని ఆయన చెప్పారు. 2004లో కేవలం 200 మంది సిబ్బందితో భారత్‌లో కార్యకలాపాలను ప్రారంభించిన సంస్థ గడిచిన పదిహేనేండ్లలో 7,500 మంది సిబ్బందికి ఎదిగామన్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, అహ్మదాబాద్‌లలో ఉన్న మూడు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు, భవిష్యత్తులో మరో కొన్ని సెంటర్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భవిష్యత్తు మార్కెట్లకు ఊతమిచ్చే విధంగా మెరుగైన నిర్వహణ సామర్థ్యం, సాంకేతిక సేవల వ్యూహాత్మక అభివృద్ధి దిశగా సంస్థ అడుగులు వేస్తున్నదన్నారు.

ప్యూర్ ఎలక్ట్రిక్ వాహనాలు

- ఐఐటీ హైదరాబాద్, ప్యూర్ ఎనర్జీ సంయుక్తంగా తయారీ
- త్వరలో మార్కెట్‌లోకి 4 మోడళ్లు

సంగారెడ్డి రూరల్: ఇక మార్కెట్లోకి సరికొత్త ఎలక్ట్రిక్ వాహనాలు రానున్నాయి. పూర్తిగా బ్యాటరీ ఆధారితంగా నడిచే ఈ ద్విచక్ర వాహనాలు పెట్రోల్ వాహనాలకు ధీటుగా రోడ్లపై దూసుకుపోనున్నాయి. ఈ వాహనాల తయారీకి ప్రతిష్టాత్మక ఐఐటీ హైదరాబాద్ వేదికగా నిలువగా.. ప్యూర్ ఎనర్జీ అంకుర సంస్థ నేతృత్వంలో మరి కొన్ని నెలల్లో సరికొత్త ఎలక్ట్రిక్ వాహనాలు మార్కెట్‌లో ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తేనున్నారు. ఇప్పటికే తయారైన వాహనాల పనితీరును ఐఐటీ క్యాంపస్ ఆవరణలో టెస్ట్ రైడ్‌ల ద్వారా సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. తక్కువ ధరకే నాలుగు రకాల మోడళ్లలో ఈ ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగదారులకు అందించనున్నారు. అయితే కొత్తగా ప్యూర్ ఎనర్జీ ఆధ్వర్యంలో తయారవుతున్న ఈ ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రముఖ ఫార్మా దిగ్గజం వీసీ నన్న పనేని 32 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టారు. ఈ పెట్టుబడి ద్వారా ప్యూర్ ఈవీ సంస్థ విలువ రూ.240 కోట్లకు చేరింది.

2016లో ప్రారంభం

ఐఐటీ హైదరాబాద్‌లో ప్రొఫెసర్ నిషాంత్ డోంగ్రీ ప్యూర్ ఎనర్జీ పేరుతో అంకుర సంస్థను ప్రారంభించారు. లిథియం బ్యాటరీ సహాయంతో వాయు, శబ్ద కాలుష్య రహిత వాహనాల తయారీపై గత మూడేండ్లుగా అనేక పరిశోధనలు చేశారు. ఇవి విజయవంతం కావడంతో ఆ సంస్థ సీఈవో రోహిత్ పదేరా వాహనాలను మార్కెటింగ్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

నాలుగు రకాల మోడళ్లు

2020 నాటికి నాలుగు రకాల మోడళ్లలో 10వేల వాహనాలను మార్కెట్‌లోకి తీసుకురావాలనే లక్ష్యంతో సంస్థ ప్రతినిధులు అడుగులు వేస్తున్నారు. మన రహదారులు ప్రజల అవసరాలను బట్టి కొత్తగా ఎలక్ట్రిక్ స్కూటర్లు, ఎలక్ట్రిక్ సైకిళ్లను తయారు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు. ఒక యూనిట్ కరెంటుకే బ్యాటరీ చార్జింగ్ ఫుల్ అవుతుండగా, 120 కిలోమీటర్ల దూరం ప్రయాణించే వీలును కల్పించారు. వాహనదారునికి కిలోమీటర్‌కు కేవలం ఐదు పైసలే ఖర్చవుతున్నది. సేల్స్ పెరిగితే మరిన్ని వాహనాలను మార్కెట్‌లో సిద్ధంగా ఉంచాలని సంస్థ భావిస్తున్నది.

238 బిలియన్ డాలర్లకు చేరొచ్చు

2025కల్లా ఇండో-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యంపై యూఎస్ఐఎస్‌పీఎఫ్ అంచనా

వాషింగ్టన్, జూలై 11: భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2025కల్లా 238 బిలియన్ డాలర్లకు చేరవచ్చని అమెరికా-భారత్ వ్యూహాత్మక, భాగస్వామ్య మండలి (యూఎస్ఐఎస్‌పీఎఫ్) అంచనా వేసింది. ప్రస్తుతం 143 బిలియన్ డాలర్లుగానే ఉండగా, మరో ఆరేండ్లలో ఇది దాదాపు 100 బిలియన్ డాలర్ల మేర పెరుగవచ్చన్నది. ఇరు దేశాల మధ్య ఏటా వాణిజ్యం 7.5 శాతం వృద్ధి చెందితే.. తమ అంచనా సాధ్యమేనని గురువారం మండలి రెండో వార్షిక నాయకత్వ సదస్సు సందర్భంగా విడుదల చేసిన నివేదికలో అభిప్రాయపడింది. గత రెండేండ్లు నమోదైన వార్షిక సగటు వృద్ధి 10-12.5 శాతం రేటు కొనసాగితే 327 బిలియన్ డాలర్లను తాకుతుందని పేర్కొన్నది.

నేడు వాణిజ్య అంశాలపై చర్చ

శుక్రవారం ఢిల్లీలో భారత్, అమెరికా దేశాల సీనియర్ అధికారులు వాణిజ్య అంశాలపై చర్చించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంలో భాగంగా వివిధ ఆర్థిక అంశాలపైనా చర్చ జరుపుతారని తెలుస్తున్నది. ఈ సందర్భంగా దక్షిణ, మధ్య ఆసియా దేశాలకు అమెరికా అసిస్టెంట్ వాణిజ్య ప్రతినిధి నేతృత్వంలోని అమెరికా అధికారుల బృందం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌ను కలుసుకోనున్నది. మొత్తానికి భారత్ పన్నులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, భారత్‌కు ప్రాధాన్య వాణిజ్య హోదా (జీఎస్పీ) దూరమైన క్రమంలో, అమెరికా నుంచి దిగుమతి అవుతున్న 28 రకాల ఉత్పత్తులపై భారత్ సుంకాలను పెంచిన దశలో జరుగుతున్న ఈ సమావేశం ఇప్పుడు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నది.

విద్యతోనే భవిష్యత్తు

కేఎల్ యూనివర్సిటీ వీసీ ఎల్ఎస్ఎస్ రెడ్డి

హైదరాబాద్, జూలై 11: విద్యతోనే భవిష్యత్తు అని, అత్యుత్తమ ర్యాంకుల కోసం ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో కేవలం 3 గంటలు చదివితే చాలని, పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన అవసరం లేదని కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎల్ ఎస్ఎస్ రెడ్డి అన్నారు. గతేడాది హైదరాబాద్‌లో ఈ యూనివర్సిటీ శాఖను ప్రారంభించగా, ప్రస్తుత 2019-2020 విద్యా సంవత్సరానికిగాను అడ్మిషన్లు జరుగుతున్నాయి. మొదటి రోజు సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడుతూ దేశంలోని 10 వేల ఇంజినీరింగ్ కళాశాలల్లో తమ యూనివర్సిటీది 50వ ర్యాంకు అని ఎల్ ఎస్ఎస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన టిక్‌టాక్ సరదా

- చెరువులో మునిగి యువకుడు మృతి

టిక్‌టాక్ కోసం సెల్ఫీవీడియో తీస్తున్న ప్రశాంత్ (వెనుక ఉన్న యువకుడు నర్సింహులు)

పేట్‌బషీరాబాద్: టిక్‌టాక్ సెల్ఫీవిడియో సరదా యువకుడి ప్రాణాలు బలితీసుకుంది. హైదరాబాద్ నగరశివారులో ఒక యువకుడు నీటిలో మునిగి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై సీఐ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన బేగరి శరణయ్య కుమారుడు నర్సింహులు (24) ఈ నెల 8న గండిమైసమ్మ దుండిగల్ మండల పరిధిలోని దూలపల్లిలో ఉంటూ సూరారంలో పనిచేస్తున్న సోదరుడు ప్రశాంత్ ఇంటికి వచ్చాడు. మంగళవారం (ఈ నెల 9న) సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ఇద్దరూ కలిసి దూలపల్లిలోని తుమార్‌చెరువుకు స్నానానికి వెళ్లారు. నర్సింహులుకు టిక్‌టాక్ ఆలోచన రాగా.. ప్రశాంత్ తన ఫోన్ ద్వారా సెల్ఫీవీడియో తీయడం ప్రారంభించాడు. టిక్‌టాక్‌లో వస్తున్న పాటకు అనుగుణంగా సరదాగా నీటిలో ఎగురుతున్న నర్సింహులు ఈతరాక నీటిలో మునిగిపోయాడు. ప్రశాంత్ దూలపల్లిలోని బంధువులను పిలిపించి వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తెల్లారాక గజ ఈతగాళ్లు వెతికి నర్సింహులు మృతదేహాన్ని బయటికి తీశారు. టిక్‌టాక్, తదితర సోషల్‌మీడియాల్లో సెల్ఫీ వీడియోలు, చిత్రాలు అప్‌లోడ్ చేసేవారు మరింత జాగ్రత్తగా ఉండాలని పేట్‌బషీరాబాద్ సీఐ మహేశ్ అన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలను అప్రమత్తం చేయాలని కోరారు.

మోసగాడు బెనర్జీ అరెస్ట్

- విశాఖ కస్టమ్స్ అధికారినంటూ పరిచయాలు
- 50 శాతం ధరకే బంగారం అంటూ బురిడీ
- పెట్టుబడికి 30% వడ్డీ ఇస్తానంటూ మోసం
- రెండున్నర ఏండ్ల తర్వాత దొరికిన మోసగాడు
- వివరాలు వెల్లడించిన రాచకొండ కమిషనర్ మహేశ్‌భగవత్

బెనర్జీ రూపొందించిన తప్పుడు ఐడీ కార్డులను చూపుతున్న రాచకొండ పీసీ మహేశ్‌భగవత్. చిత్రంలో అదనపు డీసీపీ సురేందర్‌రెడ్డి కూడా ఉన్నారు.

బెంగాల్ రాష్ట్రంలోని అంటిల్లా గ్రామానికి చెందిన నిందితుడు సౌమెన్ బెనర్జీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మాయ మాటలు చెప్పి ప్రజలను పెద్ద మొత్తంలో మోసం చేయడంలో దిట్ట. రెండున్నర సంవత్సరాలుగా పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరిగుతున్నాడు. చివరకు ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో పట్టుబడ్డాడు. నేరేడ్‌మెట్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో గురువారం సీపీ మహేశ్‌భగవత్ వెల్లడించిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని అంటిల్లా గ్రామానికి చెందిన సౌమెన్ బెనర్జీ 2013లో సొంతూరులో మెసాలకు పాల్పడి తన మకాంను హైదరాబాద్ శివారులోని చెంగిచర్ల ప్రాంతానికి మార్చాడు. వైజాగ్ పోర్ట్‌లో కస్టమ్స్ అధికారిగా పనిచేస్తున్నట్టు చెప్తూ స్థానికులతో పరిచయం పెంచుకొన్నాడు. అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన బంగారాన్ని 50 శాతం తక్కువ ధరకు ఇప్పిస్తానంటూ స్థానికంగా లక్షల్లో డబ్బు వసూలుచేశాడు. నమ్మకం కుదిరేందుకు కొందరికి బంగారం బిస్కెట్లను ఇచ్చాడు. అనంతరం చెంగిచర్ల, మారేడ్‌పల్లిలో గ్రోసరీ దుకాణాలు పెట్టి.. పరిచయాలు పెంచుకొని వ్యాపారంలో పెట్టుబడి పెడితే 30 శాతం లాభం వచ్చేలా చేస్తానని చాలా మంది వద్ద పెద్దమొత్తంలో వసూలుచేశాడు. పలువురికి 30 శాతం వడ్డీ కూడా చెల్లించాడు. విలాసవంతమైన విందులు ఏర్పాటుచేస్తూ, విమానాల్లో పర్యటనలకు తీసుకెళ్తూ, ఖరీదైన కార్లు, విల్లాలు కొనుగోలు చేసి ఆకట్టుకొన్నాడు. చివరకు 31 జనవరి 2017 నుంచి కనిపించకుండాపోయాడు. మరుసటిరోజు నుంచి బెనర్జీ ఫోన్లన్నీ స్విచ్ ఆఫ్ అయి ఉండటంతో మోసపోయామని గ్రహించిన పలువురు బాధితులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదుచేశారు.

బెనర్జీ మోసం ఐదు కోట్లు పైమాటే..

సౌమెన్ బెనర్జీ దాదాపు రూ.5 కోట్ల వరకు ప్రజలను మోసం చేసినట్టు ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. బెనర్జీని పట్టుకునేందుకు ఎస్వోటీ పోలీసులు శ్రమిస్తున్న సందర్భంలో మహారాష్ట్ర నాగ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో ఉన్నట్టు గుర్తించినా దొరుకలేదు. మరోసారి అమృత్‌సర్‌లో ఉన్నట్టు సమాచారం అందినా తప్పించుకొన్నాడు. అమృత్‌సర్‌లో కూడా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసినట్టు తెలిసింది. అక్కడి నుంచి జార్ఖండ్‌కు.. ఒడిశాకు మకాం మార్చాడు. ఎస్వోటీ పోలీసులు భువనేశ్వర్ వెళ్లి బెనర్జీని అదుపులోకి తీసుకొన్నారు. కస్టమ్స్ అధికారిగా, యాంటీ కరప్షన్ ఇన్వెస్టిగేటర్‌తోపాటు వివిధ కంపెనీల జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నట్టు తప్పుడు ఐడీకార్డులు సృష్టించి మోసం చేసినట్టు గుర్తించారు. ఆయన నుంచి 25 నకిలీ స్టాంపులు, ఓటరు ఐడీ కార్డులు, తన కుమారుడి కోసం తయారుచేసిన నకిలీ ఇంటర్‌మీడియట్ సర్టిఫికెట్, పలు సిమ్ కార్డులు, పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకొన్నారు. బెనర్జీని అరెస్టు చేయడంతో కుషాయిగూడ, మేడిపల్లి పీఎస్‌ల పరిధిలో నమోదైన కేసుల మిస్టరీ వీడిపోనున్నది. బెనర్జీని అరెస్టుచేసిన మల్కాజ్‌గిరి ఎస్వోటీ బృందాన్ని సీపీ మహేశ్‌భగవత్ అభినందించి రివార్డులు ప్రకటించారు. కస్టడీలోకి తీసుకొని మరింత లోతుగా విచారించేందుకు రాచకొండ పోలీసులు సిద్ధమవుతున్నారు. ఎవరు కూడా తక్కువ ధరకు బంగారం అమ్మకం జరుపరు అనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని కమిషనర్ మహేశ్‌భగవత్ సూచించారు.

నేడు టీ-సాట్‌లో జీవశాస్త్ర ప్రసారాలు

- ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బీ శేషుకుమారి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 వరకు టీ-సాట్‌లో జీవశాస్త్ర అభ్యసనంపై ప్రసారం అవుతుందని, జిల్లా విద్యాశాఖాధికారులు, అధికారులు, ప్రధానోపాధ్యాయులు తప్పకుండా వీక్షించాలని ఎస్సీఈఆర్టీ సంచాలకులు బీ శేషుకుమారి తెలిపారు. 6-10 తరగతుల విద్యార్థులు కూడా కార్యక్రమాన్ని వీక్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జీవశాస్త్రానికి చెందిన నిపుణులతోపాటు విద్యారంగ, బోధన నిపుణుల సహకారంతో ప్రసారాలు కొనసాగుతాయని చెప్పారు. నిపుణ చానల్, టీ-సాట్ యాప్, యూట్యూబ్, కేబుల్ కనెక్షన్ ద్వారా కార్యక్రమాన్ని చూడవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం 040-23553473, 1800-425-4038 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

లండన్‌లో 'టాక్' నిర్వహించిన బోనాల జాతర వేడుకలకు హాజరైన స్థానిక ఎంపీలు, ఇండియన్ హైకమిషన్ ప్రతినిధి ప్రేమ్‌జిత్

విదేశాల్లో బోనాల సంబురాలు

- 'టాక్' ఆధ్వర్యంలో లండన్‌లో నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) ఆధ్వర్యంలో లండన్‌లో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు స్థానిక ఎంపీలు వీరేంద్రశర్మ, సీమ మల్హోత్రా, రూత్‌కాడ్బరి, ఇండియన్ హై కమిషన్ ప్రతినిధి ప్రేమ్‌జిత్, హౌన్సలా డిప్యూటీ మేయర్ రాగ్వీందర్‌సిద్దు ముఖ్యఅతిథులుగా హాజరైనట్టు టాక్ కార్యదర్శి రత్నాకర్ కడుదుల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లండన్ వీధుల్లో తొట్టెల ఊరేగింపుతోపాటు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. పోతురాజు వేషధారణలో జయ్‌రెడ్డి ఆకట్టుకున్నారని తెలిపారు. టాక్ సంస్థ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం, అధ్యక్షురాలు పవిత్రరెడ్డి కంది మాట్లాడుతూ.. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నివిధాల తమకు అండగా ఉంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో అడ్వైజరీ చైర్మన్ గోపాల్ మేకల, ఉపాధ్యక్షురాలు స్వాతి బుడగం, అడ్వైజరీ వైస్ చైర్మన్ మట్టా రెడ్డి, సభ్యులు నవీన్‌రెడ్డి, రత్నాకర్, శ్రీధర్‌రావు, శ్రీకాంత్ జెల్ల, సత్య పింగళి, సత్య చిలుముల, సత్యం కంది పాల్గొన్నారు.

న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో బోనాలు..

న్యూజిలాండ్‌లో బోనాల జాతర

న్యూజిలాండ్‌లోని అక్లాండ్ నగరంలో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ న్యూజిలాండ్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కటకం దయానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రతినిధులు, తెలంగాణ వాసులు సుమారు 300 మంది పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ చాన్స్‌లర్‌గా గవర్నర్!

వర్సిటీ చట్టాల మార్పు కమిటీ భేటీలో చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కొనసాగుతున్న రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) చాన్స్‌లర్‌గా గవర్నర్‌ను నియమించాలని.. వర్సిటీ చట్టాల మార్పు కమిటీ భావిస్తున్నది. ఈ మేరకు ఉమ్మడి ఏపీలో ఉన్న ఆర్జీయూకేటీ చట్టాన్ని మార్పుచేయాలని నిర్ణయించింది. వీసీలతో ఏర్పాటుచేసిన యూనివర్సిటీ చట్టాల మార్పు కమిటీ గురువారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సమావేశమైంది. ఇప్పటివరకు ఆర్జీయూకేటీకి చాన్స్‌లర్‌గా ప్రైవేటు వ్యక్తి కొనసాగారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత వర్సిటీ విడిపోయి.. చాన్స్‌లర్ పోస్ట్ ఏపీలోని ఆర్జీయూకేటీకి వెళ్లింది. నాటినుంచి తెలంగాణలో చాన్స్‌లర్ పోస్టు ఖాళీగా ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న స్టేట్ యూనివర్సిటీల మాదిరిగానే ఆర్జీయూకేటీ చట్టాన్ని కూడా మార్చుతున్నామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి చెప్పారు. త్వరలోనే తెలంగాణ యూనివర్సిటీ చట్టాన్ని తీసుకురావాలనే అంశంపైనా కమిటీ అధ్యయనం చేస్తున్నదని తెలిపారు. సంప్రదాయ యూనివర్సిటీలకు, స్టేట్ యూనివర్సిటీలకు, ఓపెన్ యూనివర్సిటీలకు కామన్‌గా చట్టాలను చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. దీనిపై త్వరలోనే కమిటీ అధ్యయనం పూర్తవుతుందని, అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు.

ఉపాధి చూపేలా అగ్రి పాలిటెక్నిక్ కోర్సులు

- వచ్చే ఏడాది నుంచి పాఠ్యాంశాల్లో మార్పులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సులు చదువుతున్నవారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండేలా వచ్చే ఏడాది నుంచి పాఠ్యాంశాల్లో మార్పులు తీసుకొస్తున్నట్టు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్ వెల్లడించారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో తొలి విడుత కౌన్సెలింగ్‌ను ఆయన గురువారం ఉదయం వర్సిటీ ఆడిటోరియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. సీట్ల భర్తీ పారదర్శకంగా జరుగుతున్నదని, తల్లిదండ్రులు, విద్యార్థులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. సాత్విక అనే విద్యార్థికి పాలిటెక్నిక్ మొదటి సీటు కేటాయింపు పత్రాన్ని అందించి కౌన్సెలింగ్‌ను రిజిస్ట్రార్ ప్రారంభించారు. ప్రతిరోజు సాయంత్రం కౌన్సెలింగ్ అనంతరం సీట్ల లభ్యత తాజా సమాచారాన్ని విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సాత్వికకు పాలిటెక్నిక్ సీటు కేటాయింపు పత్రాన్ని అందించి కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్

నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
/nt.zindagi
జిందగీ
శుక్రవారం 12 జూలై 2019

పట్టు చీరంటే మక్కువ లేనిది ఏ మగువకో చెప్పండి! పట్టు మగువల మనసుల్ని కనికట్టు చేస్తూనే ఉంటుంది. కంచి.. ధర్మవరం.. గద్వాల్.. ఇలా తీరొక్క పట్టు.. తమ వార్డ్‌రోబ్‌లో భద్రంగా ఉంచుకోవాలనుకుంటారు పడతులు.. ఆషాఢం నడుస్తున్నది.. వచ్చేది శ్రావణం.. ఆ సమయంలో.. అందరిలో ఘనంగా కనిపించకపోతే ఎలా?! అందుకే బెటర్ ఆప్షన్ అంటే.. వెంటనే గుర్తొచ్చేది గద్వాల్! జరీ మెరుపులు.. టెంపుల్ డిజైన్ తళుకులు.. రాయల్ లుక్‌తో ఇట్టే కట్టిపడేస్తాయి.. మరి ఆ పట్టును మెచ్చే పడతుల కోసం ఈ వారం ఫ్యాషన్..

ఘనమైన గద్వాల్!

వంకాయ రంగు గద్వాల్ పట్టు చీర మీద మొత్తం గుర్రం, జింక డిజైన్‌ల జరీ వచ్చేసింది. చీర మొత్తం ఈ బొమ్మలు కనిపిస్తాయి. ఇక ఎర్రని బార్డర్ చెక్స్ ప్యాటర్న్‌తో వచ్చింది. ఎర్రని పల్లూ మీద నెమలి నాట్యం చేస్తున్న జరీ రావడంతో సూపర్‌గా కనిపిస్తున్నది. వంకాయ రంగు పట్టు బ్లౌజ్‌ని హై నెక్‌తో డిజైన్ చేశాం. ఎలాంటి వర్క్ చేయకుండా సింపుల్ లుక్‌ని ఇచ్చాం.

ఈ కాంబినేషన్ ఎవరైనా ఇట్టే కట్టి పడేస్తుంది. ముదురు ఆకుపచ్చ రంగు గద్వాల్ చీరకు ఎర్రని జరీ బార్డర్ వచ్చింది. దానికి కిందగా వచ్చిన టెంపుల్ డిజైన్ బార్డర్ మరింత అందాన్ని తీసుకొచ్చింది. పల్లూ చీరకి గ్రాండ్ లుక్‌ని తీసుకొచ్చింది. పూర్తి జరీ వచ్చిన పట్టు బ్లౌజ్‌ని దీనికి మ్యాచ్ చేశాం. సింపుల్‌గా కుట్టినా.. చీరకు పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అయింది.

పసుపు-ఎరుపు, పసుపు - ఆకుపచ్చ ఈ కాంబినేషన్స్ ఎప్పుడూ కొత్తగానే కనిపిస్తాయి. కానీ మూడు రంగుల కలయికతో నేసిన చీర కచ్చితంగా మనసులను దోచుకుంటుంది. ఒకవైపు ఎర్రని, మరోవైపు ఆకుపచ్చని బార్డర్‌తో వచ్చిన గద్వాల్ చీర ఇది. దీనికి ఆకుపచ్చ రంగు పట్టు బ్లౌజ్‌ని హైనెక్‌గా డిజైన్ చేశాం. స్లీవ్స్‌కి మాత్రం ఎర్రని పట్టు జరీ బార్డర్‌ని జత చేశాం. బ్లౌజ్‌కి అక్కడక్కడ ఇచ్చిన కుందన్స్ మరింత మెరిసిపోతున్నాయి.

రాయల్‌గా కనిపించేందుకు ఈ చీర కట్టాల్సిందే! బ్లూ కలర్ చెక్స్ ప్యాటర్న్ గద్వాల్ చీర ఇది. అక్కడక్కడ బుటీస్ వచ్చాయి. ఎర్రని జరీ బార్డర్ ఒకవైపు, మరో వైపు నెమళ్ల బార్డర్ వచ్చింది. రిచ్‌గా వచ్చిన పల్లూ చీర అందాన్ని రెట్టింపు చేసింది. ఇక ఎర్రని పట్టు బ్లౌజ్‌ని సింపుల్‌గా డిజైన్ చేశాం. వెనుక వైపు హై నెక్, మోచేతుల వరకు హ్యాండ్స్ పెట్టడంతో సూపర్ లుక్ సొంతమైంది.

ఎర్రని గద్వాల్ పట్టు చీర ఇది. చెక్స్ ప్యాటర్న్.. అక్కడక్కడా జరీతో వచ్చిన నెమలి పింఛాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఇక దీనికి వచ్చి గోల్డెన్ జరీ బార్డర్, రిచ్ పల్లూ మరింత మెరిసిపోతున్నాయి. బార్డర్ కింద చిలకాకుపచ్చ లైన్ కాంట్రాస్ట్‌గా బాగుంది. అందుకే ఇదే రంగు పట్టు బ్లౌజ్‌ని ఎంచుకున్నాం. మోడ్రన్ టచ్ ఉండడం కోసం స్లీవ్‌లెస్‌గా డిజైన్ చేశాం.

పవులూరి నాగతేజ
ఫ్యాషన్ డిజైనర్, తేజ శారీస్
కూకట్‌పల్లి, హైదరాబాద్
tejasarees@yahoo.com

లేడీ బస్ డ్రైవర్

డ్రైవింగ్ ఫీల్డ్‌లో అంతా పురుషులే ఉంటారు. అందులో భారీ వాహనాలు నడిపే వారిలో అయితే చెప్పనక్కర్లేదు. కానీ ప్రతిక్షా దాస్ అనే యువతి మాత్రం భారీ వాహనాలు నడపాలని చిన్నప్పటి నుంచే కలలు కన్నది. వాటిని సాకారం చేసుకొని మొదటి మహిళా బస్ డ్రైవర్ అయింది.

ప్రతిక్షా దాస్ ముంబైకి చెందిన 24 ఏండ్ల అమ్మాయి. ఇప్పుడు ముంబైలో బెస్ట్ ఉమెన్ బస్ డ్రైవర్. ఆర్టీ నుంచి ఆ గుర్తింపు పొందింది. ప్రతిక్షకు బైక్‌లు, కార్లు నడపడం అంటే చాలా ఇష్టం. తను ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడే వాళ్ల మామయ్య బైక్‌ను నడిపింది. కేవలం రెండు రోజుల్లో పూర్తి బైక్ రైడింగ్ నేర్చుకొని కుటుంబీకులను ఆశ్చర్యపరిచింది. అక్కడ మొదలైన ఆమె ఆసక్తి మెల్లిగా కార్లు నడపడం వరకూ కొనసాగింది. ఇంజినీరింగ్ అయిన తర్వాత ఆయె ఆర్టీవో అధికారి కావాలనుకున్నది. ఉద్యోగానికి దరఖాస్తు చేయాలంటే హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. దీంతో బస్‌ను నడపడం నేర్చుకున్నది. దీని కోసం ప్రత్యేకమైన శిక్షణ తీసుకుంది. ట్రెయినర్లు ఇదంతా ఎందుకు అని అడిగితే ' డ్రైవింగ్ సీట్లో అమ్మాయిలు ఎందుకు ఉండకూడదు?' అని ఎదురు ప్రశ్నించేది. ఈమె మాటలకు వారు ఆశ్చర్యపోయేవారు. కొద్ది రోజుల్లోనే బస్ డ్రైవింగ్ నేర్చుకొని 16 కిలోమీటర్లు ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేమీద బస్ నడిపి హెవీ వెహికిల్ లైసెన్స్‌కు అర్హత సాధించింది. దీంతో పాటు తొలి మహిళా బస్ డ్రైవర్‌గా కూడా సుపరిచితురాలైంది. ఇది తనకు మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచిందనీ, తనకు అంతర్రాష్ట్ర లగ్జరీ బస్సులను నడపాలనుందనీ, పైలెట్‌గా శిక్షణ తీసుకోవాలనుందని చెప్తున్నది.

చింత చిగురు ఎంతో మంచిది!

వర్షాకాలం ప్రారంభంలో దొరికే చింత చిగురు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పుల్లగా ఉండే ఈ చింత చిగురులో అనేక పోషకాలుంటాయి. దీనిని కూరల్లోనూ వాడుకోవచ్చు. కషాయం చేసుకుని తాగడం వల్లనూ అనేక లాభాలు చేకూరుతాయి.

- చింత చిగురు చిన్నారులకు తినిపిస్తే నులిపురుగుల సమస్య తొలిగిపోతుంది. నులిపురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింతచిగురుతో చేసిన వంటలు తినిపిస్తే ఫలితం ఉంటుంది. చింతచిగురు కషాయం వల్ల బాలింతలకు పాలు పడతాయి.
- చింత చిగురులోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌ను అడ్డుకుంటాయి. తద్వారా గుండెజబ్బులు రాకుండా చూసుకోవచ్చు. రక్తాన్ని శుద్ధి చేయడంలోనేకాక, కీళ్లనొప్పులకు ఇది మేలు చేస్తుంది.
- చింతాకు తినడం వల్ల ఎర్ర రక్తకణాల ఉత్పత్తి పెరుగుతుంది. ఈ సీజన్‌లో ప్రతి రోజు ఉదయం పూట గుప్పెడు చింత చిగురును తింటే రోగనిరోధక శక్తి సైతం పెరుగుతుంది. సీజనల్ వ్యాధుల నుంచి కూడా తప్పించుకోవచ్చు.
- చింత చిగురుతో మరిగించిన కషాయం లేదా టీలో కాస్త తేనె వేసుకుని తాగడం వల్ల మధుమేహం నియంత్రణలో ఉంటుంది. కామెర్లకు మందులా పనిచేస్తుంది. ఈ కషాయం తాగడం వల్ల గొంతునొప్పి, గొంతులో మంట తగ్గుతుంది.
- చింత చిగురులో లభించే విటమిన్- సి నోటిపుండ్లను చిగుళ్ల వ్యాధుల్ని నివారిస్తుంది. జ్వరం, గ్యాస్ సంబంధిత సమస్యలను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. అంతే కాకుండా కూరల్లోనూ చింత చిగురును వాడవచ్చు. చింత చిగురు పచ్చడి కూడా రుచికరంగా ఉంటుంది. ఆరోగ్యాన్ని అందిస్తుంది.

మృదువైన పెదాల కోసం!

పెదవులు ఎర్రగా ఉండాలని కోరుకోని మహిళ లుండరు. పెదవుల రంగు అందాన్నే కాకుండా ఆరోగ్యాన్ని సైతం సూచిస్తుంది. నల్లని పెదాలను సైతం ఎర్రగా మార్చుకునేందుకు ఈ చిన్న చిట్కాలు పాటిస్తే చాలు.

- టేబుల్ స్పూన్ పాలు, టేబుల్ స్పూన్ మీగడ గిన్నెలో వేసుకోవాలి. బాగా కలుపుకొని ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. మీ పెదవులకు రాసుకోవాలి. తర్వాత ఒక కాటన్ బాల్‌తో తుడుచుకోవాలి. క్రమం తప్పకుండా ప్రతి రోజు ఇలా చేస్తే నెలలోపు పెదాలు నిగారింపును సంతరించుకుంటాయి.
- టేబుల్ స్పూన్ పాలు అలాగే కొన్ని గులాబీ రేకుల్ని తీసుకుని పాలల్లో వేసి బాగా కలపాలి. 10-15 నిమిషాలు అలాగే ఉంచుకుని తర్వాత దూదితో తుడుచుకోవాలి. దీనివల్ల పెదవులు మృదువుగా, ప్రకాశవంతంగా మారుతాయి.
- అర టేబుల్ స్పూన్ తేనెలో అర టేబుల్ స్పూన్ నిమ్మరసాన్ని కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని పెదాలకు రాసుకోవాలి. కొంత సమయమయ్యాక చల్లటి నీటితో కడుక్కోవాలి. తర్వాత పెదాలు గులాబీ రంగులోకి మారడం గమనిస్తారు.
- బీట్రూట్ జ్యూస్ లాగే క్యారట్ జ్యూస్ కూడా మీ పెదవులను చక్కగా మారుస్తుంది. ఒక క్యారెట్‌ను తీసుకుని దానిని గుజ్జు చేసి ఆ రసాన్ని పెదాలకు రాసుకుంటే మంచిది. మీ పెదవులు పొడిబారినప్పుడల్లా ఈ జ్యూస్‌ను రాసుకుంటే మృదువైన గులాబీ రంగు పెదాలు మీ సొంతమవుతాయి.
- దోస ముక్కల్ని మీ పెదవులకు రాసుకుంటే ఎంతో బాగా పనిచేస్తాయి. ఇవి చర్మంపైనే కాదు చక్కటి పింక్ పెదాల్ని మీ సొంతం చేస్తాయి. కొన్ని నిమిషాలపాటు పెదవులపై రాస్తే ఎంతో మంచిది. దోసముక్కల్ని ఇలా ఎక్కువ సార్లు రాస్తూ ఉంటే త్వరగా మీకు ఫలితం కనిపిస్తుంది.

నమస్తే తెలంగాణ
చింతన
[కరీంనగర్]
శుక్రవారం 12 జూలై 2019

పర్వదినాలు

- తొలి ఏకాదశి, చాతుర్మాస్య వ్రతారంభం (నేడు)
- బోనాల జాతర (14వ తేది)
- గురుపూర్ణిమ (16వ తేది)
- చంద్రగ్రహణం, దక్షిణాయనం ప్రారంభం (17వ తేది)

అరుదైన అవకాశం

ఇలా చేద్దాం

భారతీయ వైదిక భక్తులకు, ప్రత్యేకించి శ్రీమహావిష్ణువు ఆరాధకులకు విశేష ఫలాన్నిచ్చేది చాతుర్మాస్య వ్రతం. దీర్ఘకాలం పాటు (నాలుగు నెలలు) భగవత్ సేవలో నిమగ్నమయ్యే అరుదైన అవకాశం దీనివల్ల కలుగుతుంది. ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి/ శయన ఏకాదశి) నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి (ప్రబోధినీ ఏకాదశి) వరకు సుమారు 120 రోజుల వరకు ఏకధాటిగా ఇది కొనసాగుతుంది. ఈ దీక్షను నిష్ఠాగరిష్ఠులు ఎవరైనా స్వీకరించవచ్చు. దీక్ష ప్రారంభానికి అనువైన రోజులుగా తొలి ఏకాదశి, గురుపూర్ణిమలను వేద పండితులు చెప్తారు. ఎక్కువమంది గురుపూర్ణిమనాడే దీక్షను స్వీకరిస్తుంటారు. కానీ, తొలి ఏకాదశి రోజు మొదలుపెట్టి ప్రబోధినీ ఏకాదశి నాడు ముగించడమే ఉత్తమ పద్ధతిగా వారు సూచిస్తున్నారు. ఈ కాలమంతా దీక్షాపరులకు ప్రతి రోజూ విధిగా బ్రహ్మచర్యం, ఒంటిపూట భోజనం, ఉన్న ఊరు సరిహద్దులు దాటక పోవడం, సూర్యోదయ వేళకు ముందే స్నానం వంటివి తప్పని సరి అని, మంత్రానుష్ఠానం, దానాది పుణ్యకార్యాలు ఆచరించాలని వారు సూచిస్తున్నారు. దీనివల్ల వందరెట్లు అధిక ఫలం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

మంచిమాట

చీకటనే వస్తువే లేదు. జ్ఞానమనే దీపం లేకపోవడమే చీకటి!

-మళయాల స్వామి

జీవితకాలం: (1885-1962)

* నేడు వర్ధంతి

మల్లాది వెంకట కృష్ణమూర్తి | **తీర్థయాత్ర** 12

నర్మద పరిక్రమ

నీళ్లలోంచి బంగారు నాణేలు!

(గత సంచిక తరువాయి)

రాత్రి భోజనం మేం బస చేసే చోట వండి పెడుతారు. ఏ రోజు ఏం వండాలో మొత్తం మెనూను దేశాయ్ ముందే నిర్ణయించి ఆమెకు చెప్పారు. ఆ ప్రకారం సరుకులను తీసుకువచ్చారు. ఈ యాత్రలో ఆ ఇద్దరు సేవకులు, పుష్ప మాసి ఏ విషయంలోనూ ఎవరిమీదా చిరాకు పడగా నేను చూడలేదు. ఎప్పుడూ నవ్వు మొహాలతోనే కనిపించారు. వారికి దేశాయ్ 'ఇది చెయ్యి, అది చెయ్యి' అని పనిని పురమాయించగా కూడా నేను చూడలేదు. తాము చేయాల్సింది ఎవరూ చెప్పకుండానే వారు చకచకా చేసుకు వెళ్లడం విశేషం. దేశాయ్ కూడా ఎప్పుడూ చిరునవ్వుతో కనపడేవారు. అంతమందితో చేసే ఆ యాత్ర తాలూకు ఒత్తిడి ఎన్నడూ ఆయన మాటల్లో, మొహంలో లేదా చర్యల్లో కనపడలేదు.

బ్రేక్‌ఫాస్ట్ అయ్యాక మళ్లీ అంతా బస్సు ఎక్కాం. కొద్దిసేపటికి మా బస్ మహారాష్ట్ర నుంచి మధ్యప్రదేశ్‌లోని షెండ్లా అనే ఊళ్లోకి ప్రవేశించింది. పక్కనే ఓ పురాతన కోట కనిపించింది. కూరలు కొనడానికి రద్దీగా ఉన్న రోడ్డుపక్కన బస్‌ని ఆపారు. చాలామంది బస్ దిగి చిరుతిళ్లు కొన్నారు. ఓ అరటిపళ్ల దుకాణంలోంచి పళ్లు కొని ఒకరు బస్‌లోని అందరికీ తలా ఒకటి పంచారు. ఆ అరటి పళ్ల దుకాణం అతనికి మేం నర్మద పరిక్రమ చేస్తున్నామని తెలిసి, బస్‌లోని అందరికీ ఇవ్వమని ఉచితంగా నలభై అరటిపళ్లని ఇచ్చాడు. పరిక్రమ వాసులు (నర్మదా నదికి ప్రదక్షిణం చేసేవారు) దొరకడం తన అదృష్టమని, ఆ పళ్ల దుకాణం యజమాని, దేశాయ్ డబ్బు ఇచ్చినా తీసుకోలేదు. నర్మద పరిక్రమ చేసేవాళ్లకు ఆహారం ఇవ్వడం పుణ్యకార్యంగా నర్మదా నదికి సమీపంలో నివసించే వారు భావిస్తారు. బీదవారే అయినా ఆదివాసులు, భిల్లులు కూడా యాత్రికులతో

తమ భోజనాన్ని పంచుకోవడం మామూలే. నేనా అరటిపండును దారిలో కనబడ్డ మేకకు వేశాను. మా బస్సు మధ్యాహ్నం ఒంటిగంటకు బేడియా అనే గ్రామం దగ్గర నేషనల్ హైవేకి పక్కనే ఉన్న ఓ శివాలయం దగ్గర ఆగింది. నీటి వసతి ఉందో లేదో చూసి వచ్చాక పనివాళ్లు పాత్రలు దింపారు. బోరింగ్ పంపునీటితో మా కంచాలని కడుక్కున్నాం. పావ్ బాజి, బ్రెడ్, అరటిపండు, ఓ స్వీట్ లంచ్‌కు ఇచ్చారు. నేను, వెంకటేశ్వరరావు దైవదర్శనం చేసుకున్నాం. నేను బ్రెడ్‌ను అక్కడున్న ఉడుతకి వేశాక భోజనానికి ఉపక్రమించాను.

> నీళ్లలోని ఆయన కాళ్లమీది చర్మాన్ని, మాంసాన్ని చేపలు ఇతర జలచరాలు తినేశాయి! కేవలం ఎముకలే మిగిలాయి!! ఆర్నెల్ల తర్వాత నర్మదా మాత ఆయనకు దర్శనం ఇచ్చింది.

గౌరీశంకర్ మహారాజ్

లంచ్ అయ్యాక బస్ బయలుదేరే లోగా దేశాయ్ 150-200 ఏండ్ల క్రితం నర్మద ఒడ్డున, హోషంగాబాద్‌కి 28 కి.మీ. దూరంలోని కౌసల్య, నర్మదల సంగమ స్థలం అయిన ఖోక్సర్‌లో జీవించిన గౌరీశంకర్ మహారాజ్ అనే మహాత్ముడి గురించి చెప్పారు. గౌరీ శంకర్ నర్మదా నదీమధ్యలో నీళ్లలో నిలబడి నర్మద మాత దర్శనం కోరి 'ఓం నర్మదా నమ:' అనే మంత్రాన్ని ఆర్నెల్లపాటు జపించారు. నీళ్లలోని ఆయన కాళ్లమీది చర్మాన్ని మాంసాన్ని చేపలు, ఇతర జలచరాలు తినేశాయి! కేవలం ఎముకలే మిగిలాయి!! ఆర్నెల్ల తర్వాత నర్మద మాత ఆయనకు దర్శనం ఇచ్చింది. ''నువ్వు ఏ భూతానివో కావని, నర్మద మాతవే అని నాకు నమ్మకం ఏమిటి?'' అడిగారు గౌరీ శంకర్.

బదులుగా నర్మదా నది అతని చుట్టూ పెద్ద సుడిగుండాన్ని సృష్టించింది. కానీ, దానిలో అతను మాత్రం నిశ్చలంగా ఉన్నారు. సుడిగుండం తనను ఏమీ చేయకపోవడంతో ఆమె భూతం కాదని, నర్మదా మాతేనని, భూతానికి ఇంత శక్తి ఉండదని గౌరీ శంకర్‌కి నమ్మకం కలిగింది. తన తపస్సు భగ్నం కాలేదని ఆయన నమ్మాక- నర్మద చెప్పింది.

''నా దర్శనం కావాలనే నీ కోరిక తీరింది. ఇక నువ్వు నా దగ్గరే ఉండిపో.''

ఆయన నదిలోంచి బయటకు రాగానే కాళ్లల్లో తిరిగి మాంసం, చర్మం వచ్చాయి! ఆ తర్వాత జీవితాంతం ఆయన శరీరంలోని కిందిభాగం తెల్లగా, పైభాగంలో పుట్టిన చర్మం రంగులో నల్లగా ఉండేది. ఆయన నర్మదా నది పక్కనే ఖోక్సర్‌లో ఆశ్రమం నిర్మించుకొని జీవించారు. నర్మద పరిక్రమ చేసే సాధువులకు భోజనం పెట్టేవారు. ఓసారి అయిదు వేలమంది సాధువులకి గౌరీ శంకర్ మహారాజ్ భోజనం పెట్టారు. ఇది తెలిసిన బ్రిటిష్ అధికారులు వచ్చి ఆయనను, 'అంత డబ్బు ఎలా వచ్చిందని' ప్రశ్నించారు. 'తనకు నర్మదా నది ఆ డబ్బు ఇచ్చిందని' అంటే బ్రిటిష్‌వాళ్లు దానిని ఋజువు చేయమన్నారు. ఆయన నవ్వుతూ నర్మదా జలంలోంచి బంగారు నాణేల సంచీ ఒకటి బయటకు తీశారు!

-సశేషం

మహా జ్ఞానదీపం!

సిద్ధ పురుషుడు, వైదిక సంస్కృతికి పట్టుకొమ్మ వ్యాసభగవానుని జీవిత విశేషాలు

వేళా విశేషం



అసత్తు నుండి సత్తులోకి, తమస్సు నుండి వెలుగులోకి, మృత్యుముఖం నుండి మోక్షానికి తీసుకొని వెళ్లేవాడే అసలైన గురువు. సనాతన గురుపరంపరకు శ్రీకారం చుట్టినవాడు భగవాన్ వేదవ్యాసుడు. అందుకే, 'గురుపూర్ణిమ'నే మనం 'వ్యాసపూర్ణిమ'గానూ జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా ఆ మహానుభావుని జీవిత విశేషాలు తెలుసుకొందాం.

మనకు జన్మనిచ్చిన వారు తల్లిదండ్రులైతే, జ్ఞానంతో ఇదే శరీరంలో పునర్జన్మ నిచ్చేవారు గురువులు. గురువు లేని విద్య గుడ్డి విద్య కదా. గురువే సమస్త విద్యలకు వారధి. జ్ఞాన విజ్ఞానాలకు పెన్నిధి. తమ సంతానానికి కీడు తలపెట్టని వారు తల్లిదండ్రులైనట్లే, శిష్యుల అభివృద్ధిని నిరోధించని వారే నిజమైన గురువులు. వారు జ్ఞాన శరీర ప్రదాతలు. పోషణ, రక్షణ తల్లిదండ్రుల నుంచి లభిస్తే.. క్రమశిక్షణ, విద్యా కౌశల్యం, కళానైపుణ్యాలు గురువుల వల్లనే సంప్రాప్తిస్తాయి. గురువే లేకుంటే ఈ లోకం అంధకారమయ్యేది. జ్ఞానమే వెలుగు. మనల్ని అజ్ఞానమనే అంధకారం నుంచి బయట పడవేసే జ్ఞానదీపం గురువే. గురువు జ్ఞానానికి పూర్వరూపమని, శిష్యుడు ఉత్తర రూపమని, గురుశిష్యుల బంధం లోక కల్యాణ కారకమని, గురూపదేశం లోకానికే శిరోధార్యమని ఉపనిషత్తులు చెబుతున్నాయి. వశిష్ఠుని మునిమనవడుగా, శక్తికి మనవడిగా, పరాశరునికి పుత్రునిగా, శుకునికి తండ్రిగా ప్రసిద్ధి చెందిన వ్యాసుడు గురువులకే మహాగురువు. 'వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తే పౌత్ర మకల్మషం/ పరాశరాత్మజం వందేశుకతాతం తపోనిధిం' అన్నది సంస్కృత మూలాధారం.

వ్యాసుడు సత్యవతీ-పరాశరులకు జన్మించాడు. సత్యవతీ కుమారుడు కనుక 'సాత్యవతేయుడ'ని, పరాశరుని వల్ల పుట్టాడు కాబట్టి, 'పారాశర్యుడని' కూడా ఆయన్ని పిలుస్తాం. 'కృష్ణ' అనే పేరుగల ద్వీపంలో జన్మించడం వల్ల 'కృష్ణ ద్వైపాయనుడు' అని కూడా ఆయనకు పేరు వచ్చింది. అంతేకాక, వేదార్థం తెలిసి, వైదిక సంస్కృతికి పట్టుకొమ్మగానూ ఆయన నిలిచాడు. నాలుగు వేదాలను నాలుగు దిక్కులకూ ప్రసరింపజేశాడు. దీనివల్లే తాను 'వేదవ్యాసుడు' అయినాడు. ఇంతే కాదు, వ్యాసుడు సిద్ధ పురుషుడు. పుట్టుకతోనే అత్యంత ప్రతిభావంతుడు. కనుకనే, ఎంతో గొప్ప వాఙ్మయాన్ని సృష్టించగలిగాడు. పురాణ వాఙ్మయకర్తగా, భారత-భాగవతాది గ్రంథాల సృష్టికర్తగా, అన్నింటికీ మించి దర్శనగ్రంథాలలో తలమానికమైన వేదాంత దర్శనానికి రూపశిల్పిగా వ్యాసుడు లోకప్రసిద్ధుడు. ఇవన్నీ ఒక ఎత్తయితే 'వేదాంత దర్శనాని'కి రూపశిల్పి కావడం మరో ఎత్తు. వ్యాసుడు చారిత్రిక పురుషుడు కూడా. ప్రత్యక్షంగా కౌరవ పాండవులకు బంధువూ అవుతాడు. భారతగాథలోని పలు కీలక సన్నివేశాలలో అప్పుడప్పుడు ఆయన మనకు చాలా గొప్పగా తారసపడతాడు. అది పాండవులు అరణ్యవాసం చేస్తున్న వేళ. వ్యాసుడు నేరుగా వారి దగ్గరకు వెళ్లి ధైర్యం చెబుతాడు. ఇదే సమయంలో అర్జునునికి పాశుపతాస్త్ర ప్రాప్తికై ఉపాయాన్ని బోధిస్తాడు. కురుక్షేత్ర యుద్ధం జరుగుతుండగా కూడా ఆయన మనకు దర్శనమిస్తాడు. వ్యాసుడు అంటే ఎవరో కాదు, సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అంశా స్వరూపమే. ఇందుకు సాక్ష్యం శ్రీ కృష్ణుని నోట వచ్చిన 'గీతాబోధ'. ఇది వారిలోని ఆధ్యాత్మిక పటిమకు ఒక గొప్ప ఉదాహరణ.

వ్యాసుడు మొట్టమొదట 'జయ' అనే పేరుతో మహాభారతాన్ని 8,800 శ్లోకాలతో రచించాడు. తర్వాత 24,000 శ్లోకాలకు, తదనంతరం లక్ష శ్లోకాలకు పెరిగి, ఇవాళ ఇంతటి మహాభారతమైంది. 'నారాయణం నమస్కృత్య/ నరం చైవ నరోత్తమమ్/ దేవీం సరస్వతీం వ్యాసం/ తతో జయ ముదీరయేత్' అన్న శ్లోకాన్నిబట్టి 'జయ'నామం వెల్లడవుతున్నది. దీనిని శిష్యులు పైల, సుమంత, జైమిని, వైశంపాయనులకు, తన కుమారుడైన శుకునికి ఆయన బోధించాడు. వారు దాన్ని అంతటా వ్యాపింపజేశారు. విశేషించి వ్యాసుడు 'ఉత్తర మీమాంస'ను రచించి దార్శనికుడుగా ప్రసిద్ధిగాంచాడు. 'పూర్వ మీమాంస'ను రచించిన జైమిని, వ్యాసుని శిష్యుడు కావడం విశేషం. ఆ ఉత్తర మీమాంసకే 'బ్రహ్మసూత్రాలు' అని పేరు. అద్వైతమత ప్రవక్త శంకరులు, వ్యాసుడు రచించిన భారతాంతర్గత భగవద్గీతను, బ్రహ్మసూత్రాలను గ్రహించి, ఉపనిషత్తులను ఆధారంగా చేసుకొని తనదైన 'మహాభాష్యాన్ని' అందించాడు. అది 'శంకరభాష్యం'గా ప్రసిద్ధిగాంచింది.

ఇలా ఆదినుండి గురుపరంపరకు ఆద్యుడై, భారతీయ ఆధ్యాత్మిక ప్రగతికి పెట్టనికోటగా నిలిచిన వ్యాసుని పేరుతో 'గురుపూర్ణిమ' విశేష ప్రాశస్త్యాన్ని సంతరించుకొంది. గురుపూర్ణిమ గురుశిష్య బంధాన్ని, వైదిక సాంస్కృతిక వైభవాన్ని, ప్రాచీన గురుపరంపరను మనకు గుర్తుచేస్తున్నది. వేదాలపట్ల అనంతమైన గౌరవాన్ని పెంచుతున్నది. వ్యాసుడు మంత్రద్రష్ట కూడా. ఋషి కాకపోతే కవి కాలేడన్న వాక్యానికి ఆయనే చక్కని నిదర్శనం. భారతేతిహాసాన్ని రచించడం వల్ల తాను కవిగా మారాడు. మహాభారతం ప్రపంచ సాహిత్యంలోనే అపూర్వ గ్రంథం. మంచిచెడ్డల మధ్య జరిగే సంఘర్షణలకు ప్రతిరూపమే ఇది. అందులో ఉన్నది సమస్త మానవజాతి కథ. వ్యాసుని లోకజ్ఞతకు భారతగాథ అద్దం పడుతున్నది. ఋషియైన కవి ఎలా ఉండాలో, సమాజానికి ఉపదేశించగలిగిన గురుస్థానమేమిటో ఈ గ్రంథం నిరూపిస్తున్నది. మహాభారతం కేవలం ఉపదేశం మాత్రమే చేయదు. ఆహ్లాదాన్నిస్తుంది. కళ్లల్లో నీరు నింపుతుంది. మరీమరీ ఆలోచింపజేస్తుంది. ఆత్మోన్నతిని కలిగిస్తుంది. అన్నింటినీ మించి మనల్ని నీతివంతులైన మానవులుగా తీర్చిదిద్దగలిగిన అద్భుత గ్రంథం అది.

ఒక్కమాటలో చెప్పాలంటే, మానవజాతి సమస్తం వ్యాసునికి ఋణపడి ఉంది. ఆయన ప్రసాదించిన జ్ఞానం అక్షయపాత్ర. శిష్యుడు తనకు విద్యామృతాన్ని ధారపోసే గురువును తల్లిగాను, తండ్రిగాను భావించాలని భారతగాథ ప్రబోధిస్తున్నది. విద్యార్థుల ముఖాలనుండి వెలువడే ప్రతిమాట వెనుక, చేసే ప్రతిపని వెనుక చదువు చెప్పిన గురువే ఉన్నాడన్న విషయం మరవరాదు. గురుపూర్ణిమ భారతీయ సంస్కృతిలోని విశిష్టమైన గురుస్థానాన్ని తెలియజేస్తుంది. గురువు ఎల్లవేళలా ఆరాధ్యుడన్న విషయాన్ని మనకు గుర్తు చేస్తుంది. గురువే బ్రహ్మకు ప్రతిరూపమని, బ్రహ్మనుంచి వేదం ఏ విధంగా లోకంలోకి వచ్చిందో, గురువువల్లనే జ్ఞానం మానవాళికి అందుతుందని గురుపూర్ణిమ మహత్తరమైన సందేశాన్ని ఇస్తున్నది. సంతానాన్ని తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులెంతో కష్టపడతారు. అందుకు తల్లిదండ్రుల ఋణం తీర్చుకోవడానికి పిల్లలకు నూరేళ్లయినా సరిపోవు. గురువుల విషయంలోను ఇదే గుర్తుపెట్టుకుంటే గురుపూర్ణిమ సార్థకమైనట్లే.

ఆద్యంతాలు లేనివాడే ఆదిగురువు!

'గురూనాం గురు:' గురువులకే గురువు ఈశ్వరుడు. మనకు ప్రథమగురువు పరమేశ్వరుడే. 'పూర్వే షామపి గురు:/ వచ్చే దాత్' (యోగ. 1-26). ఒకప్పుడుండి, మరొకప్పుడు లేనివాడై ఉండక, అన్ని కాలాల్లో ఆద్యంతాలు లేనివాడై వేద ప్రకాశకులైన పూర్వఋషులకు గురువైనవాడు పరమేశ్వరుడే. అందుకే, ఆయన ముఖం నుండి వెలువడిన వేదాలను శ్రవణ మననాదుల ద్వారా మనం గ్రహించి మనల్ని మనం ఉద్ధరించుకుంటున్నాం.

- ఆచార్య మసన చెన్నప్ప
సెల్: 98856 54381

జీవితసత్యం

దేనివల్ల మన మనసుకు బాధ కలుగుతుందో దానిని ఇతరులపట్ల ఆచరించకపోవడమే విజ్ఞత.

- అష్టకాల నరసింహరామశర్మ

దయాగుణమే ప్రధానం

భక్తిమార్గం

పోతనామాత్యుని విరచితమైన తెలుగు 'శ్రీమద్భాగవతం' అటు భక్తికి, ఇటు ధార్మిక జీవనానికి అద్దం పట్టింది. పలు చోట్ల వివిధ సందర్భాలలో ఈ విషయాలు వెల్లడవుతాయి. 'చేతులారంగ శివుని పూజింపడేని / నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని/ దయయు సత్యంబు లోనుగా దలపడేని/ కలుగ నేటికి తల్లుల కడుపు చేటు' అనే పద్యం ఎంతో ప్రసిద్ధం. భక్తి తత్పరతతోపాటు భూతదయ భగవత్సేవతో సమానమని చెప్పిన ఇందులోని నీతి ప్రతి ఒక్కరికీ ఆచరణీయం. మానవులు అవలంభించవలసిన అన్ని సుగుణాలకంటే దయాగుణమే ప్రధానమని, లోకల్యాణానికి అదే శ్రీరామరక్షగా నిలుస్తుందని దీనితో స్పష్టమవుతున్నది. ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లడానికి ప్రతి వ్యక్తీ దయాగుణాన్ని కలిగి ఉండాలి.

'భాగవతం'లోనే మరొకచోట 'భూతముల కెగ్గు సేసిన/ భూతంబులు నీకు నెగ్గులు బుట్టించె వృథా/ భూతమగు మనిషికి యెల్లను/ భూతద్రోహికిని శుభము పొంద వధీశా!' అన్నారు పోతన. భూతదయ మనిషికి సహజ గుణాభరణం కావాలి. అంతేకాని, భూతద్రోహం ఎప్పటికీ, ఎవరికీ పనికి రాదు. అది అత్యంత ప్రమాదకరం కూడా. ఈ దయాగుణాన్నే ఆ మహత్ గ్రంథం మానవజాతికి ఇచ్చిన గొప్ప సందేశంగానూ మనం భావించాలి. మహాభారత గాథతోనే శ్రీమద్భాగవతం కూడా ప్రారంభమవుతుంది. ఉపపాండవులుగా ప్రఖ్యాతులైన తన అయిదుగురు కుమారులను ఘోరంగా వధించిన అశ్వత్థామను అర్జునుడు బంధించి, తన ముందుకు తెచ్చినప్పుడు ద్రౌపదీ సాధ్వి అన్న మాటలు ఇక్కడ సందర్భోచితం.

'భూసురుడవు బుద్ధి దయా/ భాసురడవు, శుద్ధవీర భట సందోహా/ గ్రేసరుడవు, శిశుమారణ/ మాసుర కృత్యంబు ధర్మ మగునే తండ్రీ' (భాగ. 1-161) అన్నది ఆమె నిలదీత. దీనికి అశ్వత్థామ వద్ద సమాధానమెక్కడిది? ఏది ధర్మమో, ఎవరికి దయాగుణం ఉండాలో ఇందులో ఆమె చెప్పకనే చెప్పారు. 'శ్రీమద్భాగవతం'లోని 7వ స్కంధంలో వచ్చే ప్రహ్లాదుని కథ మనకు తెలిసిందే. ఒక సందర్భంలో 'సర్వభూతములందు దయా సుహృద్భావములు కర్తవ్యంబులు..' (7-217) అన్న ఆ మహాబాలభక్తుని మాటలూ ఈ సందర్భంలో గమనార్హం. అన్ని ప్రాణుల యెడ మానవాళికి ఉండవలసిన దయ ఎంత తప్పనిసరో ఇలా ఆయా సన్నివేశాల ద్వారా భాగవతం మనకు తెలియజేసింది. దయలోనూ ఉన్నదీ దైవభక్తే కదా!

- గన్నమరాజు గిరిజా మనోహరబాబు

సుడోకు

డైలీ సుడోకు 88 సమాధానం

7	8	3	9	1	2	4	5	6
4	9	1	6	5	7	2	8	3
2	5	6	3	4	8	7	9	1
1	6	5	7	8	3	9	4	2
3	2	7	5	9	4	1	6	8
9	4	8	1	2	6	3	7	5
6	3	2	8	7	9	5	1	4
5	7	4	2	6	1	8	3	9
8	1	9	4	3	5	6	2	7

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -89

		1				3		
		2		3	4		9	
	9		2			4	7	5
			1			7		8
9		4			2			
7	2	8			3		6	
	6		7	9		2		
		9				5		

ట్వీట్

సందీప్ కిషన్
@sundeepkishan

బిజీ షెడ్యూల్‌లోనూ మా కోసం సమయం కేటాయించి మా 'నిను వీడని నీడను నేనే' సినిమాను సపోర్ట్ చేసేందుకు ముందుకొచ్చారు డార్లింగ్ ప్రభాస్. అన్నా.. మీకు కృతజ్ఞతలు. సినిమా పెద్ద హిట్ అవుతుందని మీరు అన్న మాటలు నిజం కావాలని ఆశిస్తున్నా. మీ ఫ్యాన్‌గా చెప్తున్నా.. మీ సింప్లిసిటీకో దండం అన్నా!

సందీప్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య

595447

కామన్‌మ్యాన్ వాయిస్

బాబును జగన్ ఎగతాళి చేయడంలో ఏం తప్పులేదు అనుకుంటున్నా. కోడికత్తి పార్టీ అని మొదలుపెట్టి ప్రచారంలో ఎంత ఎగతాళి చేసిండో బాబుకు గుర్తులేదా?

- Nawin Samala

జ్ఞాపకాలెప్పుడూ నిజాలు కావు. నమ్మినవాళ్లు చేసే మోసాలు.

- R.V. LaWkshmi

అనుకున్న పని పూర్తయ్యేంత వరకు రహస్యాన్ని ఇతరులతో పంచుకోకూడదు!

- Chandu Dusari

సినిమాల్లో బ్రహ్మానందం కనపడగానే ఎలా నవ్వుతామో.. అసెంబ్లీలో బాబుగారు కనబడగానే అలా నవ్వుతున్నారు ఎమ్మెల్యేలు!

- Madhukar Alluri

వైరల్ వీడియో

వచ్చేటప్పుడు ఎంత అందంగా ఉన్న ప్రేమ.. వెళ్లిపోయేటప్పుడు ఎందుకు ఇంత బాధపెడుతుంది? అంటూ యూట్యూబ్‌లో ట్రెండింగ్ అవుతున్న డియర్ కామ్రేడ్‌ను మీరూ పలుకరించండి!

Dear Comrade Theatrical Trailer | Vijay Deverakonda | Rashmika | Bharat Kamma | Justin Prabhakaran

Total views : 1,869,651+

Published on Jul 11, 2019

నమస్తే తెలంగాణ
విహారం
[కరీంనగర్]
శుక్రవారం 12 జూలై 2019

ఆకాశంలో తెలతెల్లగా తేలిపోతున్న మబ్బులు.. వాటిని అందుకునేందుకా అన్నట్టు నిటారుగా పెరిగిన దట్టమైన చెట్లు.. ఆకుపచ్చ దుపట్టా కప్పుకున్నట్టు వరుసగా కనిపించే మట్టి కొండలు.. ఇవీ దైవభూమి కేరళ లో ఉత్తరాన మలబారు జిల్లాల్లో ఎటుచూసినా కనిపించే దృశ్యాలు. ఇటు పశ్చిమ కనుమలు, అటు అరేబియా కడలి అంచున పర్చుకున్న మలబార్ జిల్లాల్లో పర్యాటకులను కట్టిపడేసే ప్రాంతాలు ఎన్నో. మలబార్ జిల్లాల్లో కొబ్బరి, అరటి తోటలు కనువిందు చేస్తుంటాయి. ఇక కేరళ కు పెట్టింది పేరైన సుగంధద్రవ్యాలు, కాఫీ తోటలు పచ్చదనాన్ని పర్చుకొని కనిపిస్తాయి. దక్షిణ కేరళ లోని బ్యాక్‌వాటర్స్‌లో ట్రాఫిక్ జామ్‌లా కనిపించే పడవల సందడి ఈ జిల్లాల్లో కనిపించదు. మలబార్ జిల్లాల్లో జీవనంలోనూ, నీటి ప్రవాహాల్లోనూ నిలకడ కనిపిస్తుంటుంది. అందుకే బ్యాక్‌వాటర్స్‌లో పడవల్లో విహరిస్తే ఏ హడావుడిలేని ప్రశాంతత మదినిండా నిలిచిపోతుంది.

బాణాసుర సాగర్ డ్యాం ప్రాంతం



తెయ్యం!

మలబార్ కేరళీయం!

మలబార్ జిల్లాల్లో పర్యాటకులకు ఆహ్లాదాన్ని, ఆసక్తిని కలిగించే ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. ఉత్తర కేరళలో చారిత్రకంగా, సాంస్కృతికంగా ప్రధానమైన జిల్లా కన్నూర్. పర్షియా, అరేబియాతో 12వ శతాబ్దం నుంచే వాణిజ్య సంబంధాలున్న తీరప్రాంత పట్టణం ఇది. ఇక్కడ పోర్చుగీసు వైస్రాయ్ క్రీ.శ. 1505లో నిర్మించిన సెయింట్ ఆంజిలో ఫోర్ట్ ప్రసిద్ధిగాంచింది. ఈ కోటను తదనంతర కాలంలో డచ్చివారు స్వాధీనపర్చుకున్నారు. పలు యుద్ధాల అనంతరం 1772లో డచ్చివారు దీనిని అరక్కల్ వంశస్థులైన అలీరాజాకు విక్రయించారు. త్రికోణంలో ఉండే ఈ కోట బురుజులపై పటిష్ఠమైన తోపులు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. మన కాకతీయ రాజులు ఖిలా వరంగల్ కోట చుట్టూ శత్రువులను నిరోధించేందుకు తవ్విన అగడ్తలలాంటివే ఇక్కడ ఈ కోట చుట్టూ మనకు కనపడతాయి. సముద్రమార్గంలో దాడికి వచ్చే శత్రుసైన్యాలను తిప్పికొట్టేందుకు సముద్ర ముఖంగా ఉన్న తోపులు ఇక్కడ ఆకర్షిస్తాయి. కోట బురుజులపైనుంచి కడలి అందాల్ని మనం వీక్షించవచ్చు. అరక్కల్ వంశీయులకు ఈ కోట చేజిక్కిన తరువాత దానిని అభివృద్ధి పరిచారు. ఇప్పుడు ఇది ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. 17వ శతాబ్దంలోనే కన్నూర్ కేంద్రంగా కేరళలో ఒక ముస్లిం వంశం మొదటిసారి రాజ్యపాలన చేసింది. ఈ వంశస్థుల పాలనకు చిహ్నంగా కన్నూర్‌లో మ్యూజియంను నిర్వహిస్తున్నారు. అరక్కల్ మ్యూజియంగా పిలిచే ఈ మ్యూజియంలో అరుదైన వస్తువులున్నాయి. అయితే పెద్ద గోదాంలో నిర్వహిస్తున్న ఈ మ్యూజియం పైకప్పు శిథిలావస్థకు చేరడం దురదృష్టకరం. వలస పాలకులకు వ్యతిరేకంగా పోరాటం సాగించి.. హిందూ, ముస్లింలను ఏకం చేసి సాంస్కృతికంగా చక్కని సామాజిక పాలన అందించిన రాజులుగా అరక్కల్ వంశీయులకు మంచిపేరుంది.

అరక్కల్ మ్యూజియంలో..

కన్నూర్ కోటలో తీరం వైపు తోపులు..

బాణాసుర సాగర్ డ్యాం

వయనాడ్‌లో ప్రత్యేక ఆకర్షణ బాణాసుర సాగర్ డ్యాం. కాల్‌పెట్ట నుంచి 21 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆనకట్ట మట్టితో కట్టింది. ఇలా మట్టితో కట్టిన ఆనకట్టగా మన దేశంలో ఇదే మొదటిది.. ఆసియాలోనే రెండోదని చెబుతారు. ఎత్తైన మట్టికొండల మధ్య ఈ డ్యాం చాలా విశాలంగా కనిపిస్తుంది. ఈ ఆనకట్టను కొండలపైనున్న రిసార్ట్‌ల నుంచి చూడగలిగితే అద్భుత దృశ్యమే.

తక తెయ్యం!

కాసర్‌గోడ్ జిల్లాలో చూడాల్సిన అనేక ప్రాంతాల్లో చారిత్రాత్మకమైంది బేకాల్ ఫోర్ట్. కోటలో విశాలంగా పరుచుకొని ఉండే పచ్చగడ్డిపై నడుస్తూ కడలి అలల శబ్దాన్ని వినడం నిజంగా ఓ అపురూప అనుభూతి. మలబార్‌లో తెయ్యం జానపద కళారూపం ప్రసిద్ధి. కాసర్‌గోడ్‌లో తెయ్యం ఉత్సవాలు పర్యాటకులను ఆకర్షిస్తుంటాయి. ఈ జిల్లాలో నీలేశ్వర్‌లోని తేజస్విని నదిలో హౌస్‌బోట్ల అందమే వేరు. నిశ్చలంగా కనిపించే నీటిలో.. కొబ్బరిచెట్ల వరుసల మధ్య హౌస్ బోట్‌లో ప్రయాణం ఆహ్లాదకరం.

కన్నూర్ అంతర్జాతీయ విమానాశ్రయం

కన్నూర్‌కు తూర్పువైపు 28 కిలోమీటర్ల దూరంలో గత ఏడాది డిసెంబర్ 9న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం అయింది. 2300 ఎకరాల్లో ఈ విమానాశ్రయం చాలా విశాలంగా కనిపిస్తుంది. మలబార్ జిల్లాలకు ఇప్పుడు ఇది ప్రధాన కేంద్రంగా మారింది. మధ్యప్రాచ్య దేశాల్లో అనేక వృత్తుల్లో ఉన్న మలబార్ జిల్లాల వాసులు ఇప్పుడు తమ స్వస్థలాలకు రాకపోకలకు సాగించేందుకు ఈ విమానాశ్రయం ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఉత్తర కేరళకే కాకుండా కర్ణాటకలోని సరిహద్దు ప్రాంత జిల్లాలకు కూడా ఈ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. ప్రతిఏటా ఈ విమానాశ్రయాన్ని 10 లక్షల మంది ప్రయాణీకులు వినియోగిస్తారని అంచనా.

వయనాడ్ కార్నివాల్

రుతుపవనాలు ప్రవేశించిన తరువాత ఎడతెరిపిలేని వర్షాలు కేరళను కుదిపేస్తుంటాయి. వర్షంలోనూ బయటకు వచ్చి ఆటపాటల్లో పాల్గొంటే ఎలా ఉంటుంది? అనే ఆలోచననుంచే పుట్టుకొచ్చింది వయనాడ్ జిల్లాలో జరిగే మాన్‌సూన్ కార్నివాల్ (splash). కేరళ టూరిజం, వయనాడ్ టూరిజం ఆర్గనైజేషన్ కలిసికట్టుగా 2009 నుంచి వర్షాకాలంలో ఈ కార్నివాల్‌ను నిర్వహిస్తున్నారు. టూరిస్టులకు, ప్రకృతి ఆరాధకులకు ఈ కార్నివాల్ ఆకర్షణీయంగా మారింది. బురదమడుల్లో ఫుట్‌బాల్ ఆడడం, చెట్ల మధ్య సన్నటి దారుల్లో సైక్లింగ్ వంటి అనేక ఆటలు ఈ కార్నివాల్‌లో యువతను కట్టిపడేస్తున్నాయి. వయనాడ్ కొండప్రాంతాల్లోని స్థానిక గిరిజనుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ. ఈ ఏడాది గురువారం (జూలై 11) నుంచి ఈ కార్నివాల్ మొదలైంది. 14న ఈ ఉత్సవం ముగుస్తుంది. దాదాపు 55మంది ఎస్టేట్ల యజమానులు ప్రతి ఏటా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

- కాకతి
kakathi@reddifmail.com

వయనాడ్‌లో వైతిరి

కన్నూర్ కోట.. చుట్టూ అగడ్తలు



కాసర్‌గోడ్‌లో హౌస్‌బోట్

నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

ఎన్ఎంఐలో ప్రవేశాలు

న్యూఢిల్లీలోని భారత సాంస్కృతిక మంత్రిత్వశాఖలోని నేషనల్ మ్యూజియం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ ఆర్ట్, కన్జర్వేషన్ & మ్యూజియాలజీ 2019-20 ఏడాదికిగాను కింది కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

పీజీ/పీహెచ్‌డీ ప్రవేశాలు

- ఎంఏ (హిస్టరీ ఆఫ్ ఆర్ట్)-25 సీట్లు
- ఎంఏ (కన్జర్వేషన్)-15 సీట్లు
- ఎంఏ (మ్యూజియాలజీ)-15 సీట్లు
- పీహెచ్‌డీ (హిస్టరీ ఆఫ్ ఆర్ట్)-5 సీట్లు
- పీహెచ్‌డీ (మ్యూజియాలజీ)-4 సీట్లు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో

చిరునామా: Assistant Registrar, National Museum Institute, 1st floor, National Museum, Janpath, New Delhi - 110011

- **చివరితేదీ:** జూలై 16
- **వెబ్‌సైట్:** www.nmi.gov.in

ఆర్మీలో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ

ఇండియన్ ఆర్మీ షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా 2020 ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీం (47వ కోర్సు)లో చేరటానికి అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ (47వ కోర్సు)
- **మొత్తం ఖాళీలు** -55 (ఎన్‌సీసీ మెన్ - 50, ఎన్‌సీసీ ఉమెన్ - 5)
- **అర్హతలు: ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ హోల్డర్స్:** ఏదైనా డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌సీసీలో సీనియర్ డివిజన్‌లో కనీసం రెండు అకడమిక్ ఇయర్స్ సర్వీస్ తోపాటు ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఎగ్జామ్‌లో కనీసం బీ లేదా సీ సర్టిఫికెట్స్‌ను పొంది ఉండాలి.
- **నాన్ ఎన్‌సీసీ హోల్డర్స్:** యుద్ధ క్షతగాత్రులు, మరణించినవారు, మిస్సింగ్ అయిన వారి కుటుంబాలకు చెందినవారు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. వీరికి ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ అవసరం లేదు.
- **వయస్సు:** 2020 జనవరి 1 నాటికి 19 - 25 ఏండ్ల మధ్య ఉండాలి. 1995, జనవరి 2 - 2001, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.
- **పేస్కేల్:** రూ. 56,100-1,77,500+నెలకు ఎంఎస్‌పీ రూ. 15,500/- చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ ద్వారా
- ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూకు ఎంపికైన వారిని రెండు దశల్లో పరీక్షించి ఎంపిక చేస్తారు.
- చెన్నైలోని ఆఫీసర్ ట్రెయినింగ్ అకాడమీలో 49 వారాల శిక్షణ ఇస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి లెఫ్టినెంట్ హోదాతో ఆర్మీలో ఉద్యోగావకాశం కల్పిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 8
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

ఎన్ఐఆర్‌డీలో

రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- మొత్తం ఖాళీలు: 5
- ప్రాజెక్టు మేనేజర్-2
- ప్రాజెక్టు అసిస్టెంట్-2
- అటెండెంట్-1
- **అర్హత:** సంస్థ నిబంధనల ప్రకారం
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 26
- **వెబ్‌సైట్:** www.nirdpr.org.in

సీఏయూలో ఫ్యాకల్టీ పోస్టులు

మణిపూర్ (ఇంఫాల్)లోని సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీ (సీఏయూ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 71
- **పోస్టులు:** సీనియర్ సైంటిస్ట్/అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, టెక్నికల్/హిందీ ఆఫీసర్, రిసెర్చ్ ఇంజినీర్, ఆఫీసర్ తదితర పోస్టులు
- **విభాగాలు:** ప్లాంట్ పాథాలాజీ, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, అగ్రానమీ, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్, ఫిషరీస్, హార్టికల్చర్, హోంసైన్స్, ప్లాంట్ ప్రొటెక్షన్, సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చర్ తదితర విభాగాలు ఉన్నాయి.
- **అర్హతలు:** ప్రొఫెసర్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ఎంటెక్ లేదా పీహెచ్‌డీ, యూజీసీ/సీఎస్ ఐఆర్ నెట్, ఏఎస్ఆర్‌బీ ఉత్తీర్ణత.
- **ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ. 1000/- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ. 500/-
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చిరునామా:** రిజిస్ట్రార్, సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, ఇంఫాల్
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 8
- **వెబ్‌సైట్:** www.cau.ac.in

నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

నోయిడాలోని నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న నాన్ ఎగ్జిక్యూటివ్ (వర్కర్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం పోస్టులు:** 30
- **పోస్టు పేరు:** నాన్ ఎగ్జిక్యూటివ్ (వర్కర్)
- **ట్రేడులు:** టర్నర్, మెషినిస్ట్, ఫిట్టర్, వెల్డర్, డీజిల్ మెకానిక్, ఆటో ఎలక్ట్రీషియన్, మెషిన్ టూల్ మెకానిక్, లోకో మెకానిక్.
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత. సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ ఉండాలి.

National Fertilizers Limited (NFL)

- **వయస్సు:** 2019 జూన్ 30 నాటికి 18-30 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 200/- (ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీలకు ఫీజు లేదు)
- **పేస్కేల్:** రూ. 21,500-52,000/-
- **ఎంపిక:** ఆన్‌లైన్ రాతపరీక్ష, స్కిల్ టెస్ట్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 8
- **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

రవిశంకర్, రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ, భరత్, నవీన్, యష్, చెర్రి

డియర్ కామ్రేడ్‌లకు అంకితం చేస్తున్నాం!

'ఈ సినిమా ట్రైలర్ కోసం ఈ రోజు పొద్దున ఆరు గంటలకు లేస్తే శుక్రవారం రిలీజ్ పెట్టుకుని మా తమ్ముడు మాత్రం తొమ్మిది గంటలకు లేచాడు. మా సినిమా ఈ నెల 26న రిలీజ్ అవుతున్నా మాకు నిద్రపట్టడం లేదు. ఈ చిత్రాన్ని మీకు అందిస్తున్నందుకు చాలా గర్వంగా వుంది' అన్నారు విజయ్ దేవరకొండ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'డియర్ కామ్రేడ్'. భరత్ కమ్మ దర్శకుడు. రష్మిక మందన్న కథానాయిక. మైత్రీ మూవీస్, బిగ్ బెన్ సినిమాస్ పతాకాలపై నవీన్ యెర్నేని, రవిశంకర్, మోహన్ చెరుకూరి, యష్ రంగినేని నిర్మించారు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ని చిత్ర బృందం గురువారం హైదరాబాద్‌లో విడుదల చేసింది. ఈ సందర్భంగా హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'నాలుగు భాషల్లో విడుదలైన ట్రైలర్ అందరికి నచ్చుతుందనే నమ్మకముంది. నా సినిమా రిలీజ్ రోజు 12 గంటలకు లేచిన రోజులున్నాయి. అయితే ఈ సినిమా రిలీజ్‌కు వారం ముందు నుంచే నిద్ర పట్టడం లేదు. ఈ నెల 12 నుంచి డియర్ కామ్రేడ్ మ్యూజిక్ ఫెస్టివల్ మొదలవుతోంది. ఏడాది పాటు ఈ సినిమా కోసం శ్రమించాం. ఇప్పుడు ఆ కష్టాన్ని మర్చిపోవడం కోసం ఎంజాయ్ చేయాలని నిర్ణయించుకున్నాం. 12న బెంగళూరులో, 13న కొచ్చిలో, 18న చెన్నైలో, 19 హైదరాబాద్‌లో, 22న వైజాగ్‌లో ఆడియో రిలీజ్ వేడుకలు నిర్వహించబోతున్నాం. నా కెరీర్‌లోనే బెస్ట్ ఆల్బమ్ ఇది. ఈ ఏడాదికి ఇది బిగ్గెస్ట్ ఆల్బమ్‌గా నిలుస్తుంది. దీన్ని సెలబ్రేట్ చేసుకోవాలనే టీమ్ అంతా డ్యాన్స్ చేస్తూ ఐదు రాష్ట్రాల్లో పాటలు పాడబోతున్నాం. మన జీవితంలో ఏది చేసినా మనకు ఆ పనిలో తోడుగా నిలిచే వాడే కామ్రేడ్. ఈ చిత్రాన్ని అలాంటి కామ్రేడ్‌లకు అంకితం చేస్తున్నాం. బెంగళూరులో నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హీరో యష్ వస్తున్నారు' అన్నారు. నవీన్ యెర్నేని మాట్లాడుతూ 'ట్రైలర్ అద్భుతంగా వుంది. అన్ని చోట్ల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ రోజు నుంచి ఈ చిత్ర ప్రచారాన్ని ప్రారంభిస్తున్నాం. ఈ సినిమా మ్యూజిక్ ఫెస్టివల్‌ని శుక్రవారం నుంచి మొదలుపెడుతున్నాం. 22న ప్రీరిలీజ్ వేడుకని వైజాగ్‌లో నిర్వహించనున్నాం. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అన్నారు. యష్ రంగినేని మాట్లాడుతూ 'రెండేళ్లుగా ఈ టీమ్ కష్టాన్ని చూస్తున్నాను. సినిమాపై టీమ్ అంతా చాలా నమ్మకంతో వున్నాం. విజయ్‌ని ఈ చిత్రంలో చాలా కొత్తగా చూస్తారు' అని తెలిపారు. 'మూడేళ్ల ప్రయాణం ఈ సినిమా. ఈ చిత్రం విషయంలో చాలా మంది కామ్రేడ్‌లు నాకు సహకారాన్ని అందించారు' అని దర్శకుడు భరత్‌కమ్మ తెలిపారు. కార్యక్రమంలో రష్మిక మందన్న, రవిశంకర్, మోహన్ చెరుకూరి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో షురూ

అల్లు అర్జున్

'ఆర్య', 'ఆర్య-2' తర్వాత అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కలయికలో హ్యాట్రిక్ సినిమా రాబోతున్నది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. సుకుమార్ స్క్రిప్ట్ వర్క్‌ను పూర్తిచేసినట్లు సమాచారం. త్వరలో ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాల్ని ప్రారంభించనున్నట్లు తెలిసింది. సుకుమార్ గత చిత్రాలకు భిన్నంగా వినూత్నమైన కథ, కథనాలతో ఈ సినిమా ఉంటుందని చెబుతున్నారు. అక్టోబర్ లేదా నవంబర్‌లో ఈ చిత్రం సెట్స్‌పైకి రానుంది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా చిత్రీకరణలో అల్లు అర్జున్ బిజీగా ఉన్నారు.

'నిను వీడని నీడను నేనే' పక్కా హిట్!

- సందీప్‌కిషన్

'నిను వీడని నీడను నేనే' తొలి టికెట్‌ను సందీప్‌కిషన్ నుంచి స్వీకరిస్తున్న హీరో ప్రభాస్

సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'నినువీడని నీడను నేనే'. కార్తీక్‌రాజు దర్శకుడు. అన్యాసింగ్ కథానాయిక. దయా పన్నెం, సందీప్‌కిషన్, వీజీ సుబ్రహ్మణ్యన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక బుధవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. సందీప్‌కిషన్ మాట్లాడుతూ 'సినిమా ఫంక్షన్‌లో నేను ఎప్పుడూ మంచి సినిమా తీశానని చెబుతుంటా కానీ అదిరిపోయే సినిమా తీశానని తొలిసారి చెబుతున్నా. పక్కా హిట్ అయ్యే సినిమా తీశా. అది నేనొక్కడినే తీశానని చెప్పడం లేదు. సెట్‌లో, టీమ్‌కు ఎలాంటి లోటు చేయలేదు. ఇవ్వాళ్టి వరకు ఒక్కరూపాయి కూడా మోసం చేయలేదు. మంచి సినిమా తీశాం. సినిమానే మాట్లాడుతుంది. నిజాలు మాట్లాడుకోవాలంటే ఈ రోజు ఉదయం వరకు సినిమా విడుదల అవుతుందో? లేదో మాకు తెలియదు. అంత టెన్షన్ పడ్డాను. నాకు తెలిసింది ఒక్కటే కథను నమ్మాలి. కరెక్ట్‌గా ప్రచారం చేయాలి. జనాల్లోకి తీసుకెళ్లాలి. ఒకడు సినిమా తీస్తున్నాడంటే సంబంధం లేనివాడు దాన్ని ఆపడానికి చూస్తుంటాడు. అందరికన్నా సినిమా గొప్పది. అదే సినిమాను కాపాడుకుంటుంది. ఈ చిత్రానికి చాలా అడ్డంకులు వచ్చాయి. వాటన్నింటిని అధిగమించాం. శివ, సీతారామ్ లేకపోతే నేను లేను. ఈ చిత్రాన్ని ఇంత వరకు తీసుకొచ్చింది వాళ్లే. 'ఎస్ఎమ్ఎస్' చిత్రానికి సుధీర్‌బాబు 77 మంది దగ్గర అప్పుఎలా చేశాడో ఇప్పుడ అర్థమైంది' అన్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌బాబు, నిఖిల్, కార్తికేయ, కార్తీక్‌రాజు, దయా పన్నెం, విశ్వక్‌సేన్, అన్యా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్రెస్టింగ్ 'మిస్ మ్యాచ్'

ఉదయ్‌శంకర్, వెంకటేష్

ఉదయ్‌శంకర్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మిస్ మ్యాచ్'. ఎన్.వి.నిర్మల్‌కుమార్ దర్శకుడు. ఐశ్వర్యారాజేష్ కథానాయిక. జి.శ్రీరామరాజు, భరత్‌రామ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ని హీరో వెంకటేష్ గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''మిస్ మ్యాచ్' టీజర్ ఆసక్తికరంగా వుంది. మిస్ మ్యాచ్ కుటుంబ సభ్యులంతా చూడదగ్గ సినిమా అవుతుందని భావిస్తున్నాను. హీరో ఉదయ్‌శంకర్‌కు నటుడిగా మంచి భవిష్యత్తు వుంది. ఈ సినిమా అందరిని ఆకట్టుకుంటుందని భావిస్తున్నాను' అన్నారు. ఉదయశంకర్ మాట్లాడుతూ ' భూపతిరాజా అందించిన కథను దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ఎన్.వి.నిర్మల్‌కుమార్, శ్రీరామరాజు,భూపతిరాజా తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్ 'ఎవరు'

అడివి శేష్, రెజీనా

అడివి శేష్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎవరు'. వెంకట్ రామ్‌జీ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. రెజీనా కథానాయిక. నవీన్‌చంద్ర కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను గురువారం విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ సినిమాలో అడివి శేష్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించబోతున్నారు. పరిశోధనాత్మక థ్రిల్లర్‌గా మెప్పిస్తుంది' అన్నారు. ఆగస్ట్ 23న చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వంశీ, సంగీతం: శ్రీచరణ్ పాకాల, ఆర్ట్: అవినాష్ కొల్ల, సంభాషణలు: అబ్బూరి రవి, దర్శకత్వం: వెంకట్ రామ్‌జీ.